# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 5 ఫిబ్రవరి 2026 వెల : రూ.15

వివక్ష, పేదరికం లేని సమాజం కోసం.. ఫిబ్రవరి 20 - సామాజిక న్యాయ దినోత్సవం

అందరి ప్రగతికి బడ్జెట్ ఎలా ఉండాలి ? - కేంద్ర బడ్జెట్‌లో కుటిల వ్యూహం

కేంద్ర బడ్జెట్ : సంపన్నులకే 'అచ్ఛేదిన్'

ప్రజాస్వామ్యం : విస్తరణ దశలోని సంక్షోభాలు - ప్రజల చైతన్యమే దానికి ప్రాణం

సంపదల్లో సమానత్వం ఎందుకు ?

సామాజిక న్యాయంపై కనిపించని కుట్ర

రెండు దేశాల భారత్ - సామాజిక న్యాయమేదీ ?

సామాజిక పరిణామ క్రమంలో స్త్రీ - అంబేడ్కర్ విశ్లేషణ

మహాత్ముడివి మూడు బాధలు!

అమృతకాలంలో అయోధ్యరాముడే జాతిపిత !

దేశ నాయకుల అబద్ధాలను బట్టబయలు చేస్తున్న గ్రోక్..!

మూఢత్వ పోకడలపై ఖడ్గధారి వేమన

అభ్యుదయ సాహిత్య విమర్శకుడు చందు సుబ్బారావుకు నివాళి

సాహితీ విమర్శకు దారిదీపం - సాహిత్య సీమలో వైజ్ఞానికుడు

బడా కార్పొరేట్ సంస్థలకు ఉచితాలను రద్దు చేయాలి

మననం చేసుకోవలసిన మహానుభావుడు

ఫిబ్రవరి - 2026 పేజీలు : 42

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 5

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1. విపక్ష, పేదరికం లేని సమాజం కోసం.. ఫిబ్రవరి 20 - సామాజిక న్యాయ దినోత్సవం - సంపాదకీయం 3
2. అందరి ప్రగతికి బడ్జెట్ ఎలా ఉండాలి ? - మనోజ్‌కుమార్ ఝా 4
3. కేంద్ర బడ్జెట్‌లో కుటిల వ్యూహం - ప్రభాత్ పట్నాయక్ 5
4. కేంద్ర బడ్జెట్ : సంపన్నులకే 'అచ్ఛేదిన్' - షేక్ కరిముల్లా 7
5. ప్రజాస్వామ్యం : విస్తరణ దశలోని సంక్షోభాలు - ప్రజల చైతన్యమే దానికి ప్రాణం - ప్రొ॥ కె.యస్.చలం 9
6. సంపదల్లో సమానత్వం ఎందుకు ? - రాహుల్‌కుమార్ 10
7. సామాజిక న్యాయంపై కనిపించని కుట్ర - యోగేంద్ర యాదవ్ 12
8. రెండు దేశాల భారత్ - మల్లేపల్లి లక్ష్మయ్య 14
9. సామాజిక న్యాయమేదీ ? - సంపతి రమేష్ మహారాజ్ 16
10. సామాజిక పరిణామ క్రమంలో స్త్రీ -అంబేడ్కర్ విశ్లేషణ - అనూరాధ 17
11. మహాత్ముడివి మూడు బాధలు! - దొక్కా మాణిక్యవరప్రసాద్ 25
12. అమృతకాలంలో అయోధ్యరాముడే జాతిపిత! - కె.శ్రీనివాస్ 26
13. నాయకుల అబద్ధాలను బట్టబయలు చేస్తున్న గ్రోక్..! -దేవరాజు మహారాజు 28
14. మూఢత్వ పోకడలపై ఖడ్గధారి వేమన - తెలకపల్లి రవి 30
15. సాహిత్య సీమలో వైజ్ఞానికుడు చందు - ప్రొఫెసర్ కె.యస్.చలం 32
16. చందు సుబ్బారావుకు అరసం నివాళి 33
17. సాహితీ విమర్శకు దారిదీపం - డాక్టర్ దామెర వేంకట సూర్యారావు 34
18. బడా కార్పొరేట్ సంస్థలకు ఉచితాలను రద్దు చేయాలి - ప్రొ॥ జ్యోతిరాణి 36
19. మననం చేసుకోవలసిన మహానుభావుడు - మందలపర్తి కిషోర్ 39
20. కార్టూన్స్ 40
21. కొత్త పుస్తకాలు 41




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

**దారి దీపం**

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495



# వివక్ష, పేదరికం లేని సమాజం కోసం..
# ఫిబ్రవరి 20 - సామాజిక న్యాయ దినోత్సవం

ఫిబ్రవరి 20 అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు నిర్వహిస్తున్నాయి. వివిధ దేశాలలో ఏదో ఒక రూపంలో వివక్ష వున్నది. జాతిపరమైన వివక్ష, రంగుపరమైన వివక్షతోపాటు అల్ప సంఖ్యాక తరగతుల వివక్షలు వున్నాయి. మనదేశంలో కులపరమైన, మతపరమైన, లింగ పరమైన వివక్ష నేటికీ కొనసాగుతున్నది. ఈ వివక్ష తరగతులే అత్యధిక సంఖ్యాకులుగా వున్నారు. పైగా అందులో అత్యధిక సంఖ్యాకులు పేదలు. తక్కువ స్థాయి చదువు, తక్కువ స్థాయి సంపాదన గల వృత్తులలో వున్నారు. మెజారిటీ ప్రజలకు సామాజిక న్యాయం అందించాల్సిన దేశం మనది. అందుకే సామాజిక న్యాయ దినోత్సవం ఇతర దేశాలకంటే మన దేశంలో అత్యంత ప్రాధాన్యత గల అంశం. వివక్ష లేని, పేదరికం లేని సమాజం కోసం.. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని మనం నిర్వహించుకోవాలి. కులపరమైన, మత పరమైన, లింగ పరమైన వివక్ష అనేది ఒక మానసిక జాడ్యం. ఇది ఒక్క రోజుతో పోదు. ఇదొక దీర్ఘకాలిక సమస్య. కులపరంగా, మత పరంగా, లింగ పరంగా, వివక్ష లేని సమాజం అంటే అందరూ సమానమేనని అందరికీ సమాన హక్కులు వుండాలని అన్నదమ్ముల వలెను, జాతులు, మతములన్నియు మెలగవలెనోయ్' అన్న గురజాడ భావన సాధించడానికి ఒక సాంస్కృతిక ఉద్యమం సాగాలి. మన బుర్రలలో పేరుకుపోయిన వివక్ష బురదను కడిగి వేసే ఉద్యమం అవసరం.

ఈలోగా వివక్ష తరగతులకు అందరితో సమానంగా ఎదిగే అవకాశాలను తక్షణం సాధించాలి. దీనికి సమాన అవకాశాల నినాదం (Equality) మాత్రమే సరిపోదు. వీరికి ప్రత్యేక అవకాశాలు కల్పించే "సమన్యాయం" (Equity) విధానాల అమలుకు ఉద్యమించాలి. ఈ వివక్ష తరగతులలోనే పేదరికం వుండాలి. అది ఎదిగే అవకాశాలకు గుది బండగా వుంది. గౌరవప్రదమైన స్వతంత్ర జీవనానికి అడ్డంకిగా వుంది. సామాజిక న్యాయం సాధించడంలో పేదరికాన్ని నిర్మూలించడం ప్రధానమైంది.

మనదేశంలో ఒక పక్క సంపద గుట్టలుగా పోగు పడింది. మరొక పక్క పేదరికం అత్యధిక సంఖ్యాకుల పాలిట శాపంగా మారింది. ఈ అంతరాల సమాజానికి సంపద పంపిణీ చికిత్స జరగాలి. దేశంలో ఒక శాతం దగ్గర పోగుపడ్డ 46 శాతం సంపదను పదిశాతం దగ్గర పోగుపడ్డ 75 శాతం సంపదను వివిధ పన్నుల ద్వారా సేకరించి "జాతీయ సంక్షేమ నిధిని" ఏర్పాటు చేయాలి.

వివిధ తరగతుల కుటుంబాలకు, పేదలందరి కుటుంబాలకు ఈ సంక్షేమ నిధి నుంచి జాతీయ బోనస్ రూపంలో నివాస హక్కు, ఆహార భద్రత, ఉపాధి హక్కు రూపంలో పంపిణీ చేయాలి. రైతులు, కౌలు దారులకు లాభసాటి ధర కోసం యువతకు ఉపాధి హక్కు, నైపుణ్యాల కోసం వినియోగించాలి. సంపద పంపిణీ చికిత్సతో సామాజిక న్యాయం అన్న నినాదంతో ఈ అంతర్జాతీయ సామాజిక న్యాయం అన్న నినాదంతో ఈ అంతర్జాతీయ సామాజిక న్యాయదినోత్సవాన్ని నిర్వహించుకోవాలి. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# అందరి ప్రగతికి బడ్జెట్ ఎలా ఉండాలి ?



- మనోజ్‌కుమార్ ఝా

**ఈ రోజు దేశం మరో కేంద్ర బడ్జెట్‌ను చూడబోతోంది. కానీ ఈ బడ్జెట్ ప్రాధాన్యం కేవలం సంఖ్యలు, ఆర్థిక లోటు లేదా వృద్ధి అంచనాలకే పరిమితం కాదు. అసలు ప్రశ్న మరింత లోతైనది. ఈ ఆర్థిక వ్యవస్థ ఎవరి కోసం ? పొలాల్లో, కర్మాగారాల్లో, తరగతి గదుల్లో, నిర్మాణ రంగంలో కష్టపడే కోట్లాది భారతీయుల కోసమా ? లేక ఇప్పటికే అపారమైన వనరులు, విధాన ప్రభావం కలిగిన కొద్ది మంది ఉన్నత వర్గాల కోసం మాత్రమేనా ?**

గత దశాబ్దంలో భారత్ ఒక విచిత్రమైన విరుద్ధతను అనుభవించింది. ఒక వైపు, భారత్ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ప్రశంసించబడుతోంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారత మార్కెట్లలో అపార అవకాశాలను చూస్తున్నారు. మరోవైపు, లక్షలాది యువత ఉద్యోగాల కోసం తిప్పలు పడుతోంది. కుటుంబాలు స్థిరంగా నిలిచిన ఆదాయాలు లేక ఇబ్బంది పడుతున్నాయి. ఆదాయ అసమానత వలస పాలన కాలం తర్వాత ఎప్పుడూ లేనంతగా పెరిగింది. పైస్థాయిలో అపార సంపద, కింద స్థాయిలో తీవ్రమైన అస్థిరత - ఇవే నేటి భారత ఆర్థిక దృశ్యానికి లక్షణాలుగా మారాయి.

ఇలాంటి సమయంలో బడ్జెట్ కేవలం సాంకేతిక పత్రంగా ఉండకూడదు. అది నైతిక దిశా నిర్దేశం కలిగి ఉండాలి. పౌరుల దైనందిన జీవన వాస్తవాలను ప్రతిబింబించాలి. కాయితాలపై కనిపించే ఆశావాదానికి మాత్రమే పరిమితం కాకూడదు. కొద్ది మంది క్రోనీ ధనవాదుల సంపద పెరుగుదలకే దోహదపడే విధానం కాకుండా, సమగ్ర ఆర్థిక వృద్ధిని కేంద్రంగా ఉంచిన బడ్జెట్ దేశానికి అవసరం.

ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు నిరుద్యోగం మరియు పెరుగుతున్న ఆదాయ అసమానత. ఇవి అప్రధాన అంశాలు కావు. ఇవి సామాజిక స్థిరత్వం, ప్రజాస్వామ్య విశ్వసనీయతకు గుండెల్లో దెబ్బ కొడతాయి. 'యువత లాభం'గా చెప్పబడే భారత జనాభా ప్రయోజనం వేగంగా భారంగా మారుతోంది. చదువుకున్న యువత ఉద్యోగయోగ్యులు కావడం లేదు - ఆశల లోపం వల్ల కాదు, గౌరవప్రదమైన ఉపాధిని సృష్టించే ఆర్థిక వ్యవస్థ లేకపోవడం వల్ల. మెజారిటీ భారతీయులకు ఉపాధి కల్పించే ఇన్ఫార్మల్ రంగం బలహీనంగా ఉంది. విధాన షాక్‌ల వల్ల తరచూ దెబ్బ తింటోంది. ఉపాధికి నిజమైన ఆధారస్తంభాలైన చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రుణాలు, మార్కెట్ ప్రాధాన్యత, నియంత్రణ రక్షణ కోసం పోరాడుతున్నాయి.

అయినా ఈ మౌలిక సమస్యలు ప్రజా చర్చల్లో వెనుకబడుతున్నాయి. ఆర్థిక కష్టాలను జాతీయవాదం, మత ధ్రువీకరణ, కృత్రిమ భయాందోళనల వెనుక దాచుతున్నారు. జీవనోపాధి అంశాల నుంచి ప్రజల దృష్టిని భావోద్వేగ కథనాల వైపు మళ్లిస్తున్నారు. గుర్తింపులు రెచ్చగొడుతుండగా, జీవనాధారాలు నిశ్శబ్దంగా క్షీణిస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది ఆర్థిక కేంద్రీకరణకు అనుకూలమైన పొగ తెరగా పనిచేస్తోంది. ఫలితంగా, దేశ ఆర్థిక వ్యవస్థ ఏకాధిపత్యాల వైపు మరింత వంగుతోంది. మౌలిక వసతులు, శక్తి, నౌకాశ్రయాలు, గనులు, టెలి కమ్యూనికేషన్లపై కొద్ది మంది కార్పొరేట్ గృహాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. సంపద పైభాగంలో వేగంగా పెరుగుతుండగా, కింద స్థాయిలో జీతాలు స్థిరంగా నిలిచిపోతున్నాయి. అంతర్జాతీయ నివేదికల ప్రకారం, భారత్ ప్రపంచంలోనే అత్యంత అసమాన సమాజాలలో ఒకటిగా మారింది. అత్యంత ధనవంతులైన ఒక శాతం దేశ సంపదలో విపరీతమైన వాటాను నియంత్రిస్తుండగా, కింది సగం జనాభా కనీస భద్రతకే పోరాడుతోంది. ఈ దిశ కేవలం అన్యాయమే కాదు; రాజ్యాంగ ఆత్మకు విరుద్ధమైనది కూడా.

మన రాజ్యాంగ నిర్మాతలు, సంపద కొద్ది మందిలో కేంద్రీకరించి, అది క్రిందికి జారుతుందనే ఆశపై నిలిచే గణతంత్రాన్ని ఊహించలేదు. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 39 ఆర్థిక పాలనకు స్పష్టమైన నైతిక దిశను సూచిస్తుంది. సమాజంలోని వనరులు సామాన్య మేలుకు ఉపయోగపడేలా పంపిణీ కావాలని, సంపద మరియు ఉత్పత్తి సాధనాలు ప్రజలకు నష్టం కలిగించేలా కేంద్రీకృతం కాకూడదని అది స్పష్టం చేస్తుంది. ఇవి అలంకారిక వాక్యాలు కావు; విధానాలకు మార్గదర్శకమైన నైతిక సూత్రాలు.

ఆర్టికల్ 39కు కట్టుబడిన **(మిగతా 8వ పేజీలో)**

# కేంద్ర బడ్జెట్‌లో కుటిల వ్యూహం



- ప్రభాత్ పట్నాయక్

బూర్జువా వర్గానికి అత్యున్నతమైన దివ్యవాణి ఐ.ఎం.ఎఫ్. అటువంటి సంస్థే ఇండియా బడ్జెట్‌లో ప్రకటించిన జీడీపీ అంచనాలు నమ్మదగ్గవి కావని ప్రకటించింది. అటువంటప్పుడు బడ్జెట్‌లో పేర్కొన్న వివిధ అంచనాలు, వృద్ధి రేటు సంఖ్యలు, జీడీపీ అంచనాలు వగైరాలన్నింటికీ పెద్దగా విలువ లేదు. నిజానికి, అనేక రకాల పన్నులను ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రకటించింది. వాటి ద్వారా ప్రభుత్వానికి వచ్చే అదనపు ఆదాయం ఎంత ఉండనుంది ? అన్నది గాని, లేకపోతే తగ్గిపోయే ఆదాయం ఎంత అన్నది గాని అంచనాల్లో ఇవ్వనే లేదు. అయినప్పటికీ, బడ్జెట్ అంకెల్ని బట్టి దాని వ్యూహం ఏ దిశగా ఉండబోతోంది అన్నది చెప్పవచ్చు. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ ఉన్న స్థితిలో ఈ బడ్జెట్ వెనుక ఉన్న వ్యూహం పూర్తిగా కుటిలత్వంతో కూడుకుని వుంది. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న అత్యంత ప్రధాన సమస్యలు ఇలా ఉన్నాయి : గత వందేళ్ల కాలంలో ఎన్నడూ చూడనంత తీవ్రస్థాయిలో దేశంలో ఆర్థిక అసమానతలు కొట్ట వచ్చినట్టు పెరిగిపోయాయి.

ప్రణాళికా సంఘం తన తొలి సంవత్సరాల్లో పేదరికం ఉన్నట్టు నిర్ధారించడానికి ఎంపిక చేసిన ప్రమాణాల మేరకు (తలసరి ఆహారంలో ఎన్ని కేలరీల శక్తి కనీసం ఉండాలన్న ప్రమాణం) చూసినప్పుడు పూర్తి పేదరికంలోకి దిగజారిపోతున్న వారి సంఖ్య భారీగా పెరిగిపోతోంది. దేశంలోని విద్యావంతులైన యువజనుల్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగం చాలా తీవ్రస్థాయికి చేరింది. ఈ సమస్యలన్నింటికీ ఒక ఉమ్మడి పరిష్కారం ఉంది. సామాన్య ప్రజల కొనుగోలు శక్తిని భారీగా పెంచడమే ఆ పరిష్కారం. ద్రవ్యలోటు పెరగకుండా, ఈ విధంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి కావలసిన ధనాన్ని సమీకరించాలంటే సంపన్నుల మీద అదనంగా పన్నులు వేయడమే మార్గం. ఇలా సమీకరించిన ధనం ప్రజలకు అందిస్తే అప్పుడు దేశం మొత్తం మీద డిమాండ్ పెరుగుతుంది. ఎక్కువగా ఉపాధి కల్పనకు దారి తీసే వస్తూత్పత్తికి అది దోహదం చేస్తుంది. పేదరికం నుంచి విముక్తి కూడా దొరుకుతుంది. ఆర్థిక అసమానతలు ఒక మేరకు తగ్గుతాయి.

సరిగ్గా దీనికి పూర్తి వ్యతిరేక దిశ తీసుకోవడంలోనే ఈ బడ్జెట్ కుటిలత్వం వెల్లడౌతోంది. జీడీపీలో పన్నుల ద్వారా లభించే ఆదాయం శాతం పెరగాల్సింది పోయి తగ్గు ముఖం పట్టింది. 2023-24లో, 2024-25లో ఇది 11.5 శాతం ఉండేది. 2025-26 (సవరించిన అంచనాలు)లో 11.4కి తగ్గింది. 2026-27లో 11.2కి మరింత తగ్గింది. దీనికితోడు ద్రవ్య లోటు 2024-25లో 4.8 శాతం, 2025-26 (సవరించిన అంచనాలు)లో 4.4 శాతం, 2026- 27లో 4.3 శాతం ఉంది. అందుచేత మొత్తం ప్రభుత్వ వ్యయం కుదించబడింది. అటు సంపన్నుల మీద పన్నులు పెంచడానికి కాని, ఇటు ద్రవ్య లోటును పెంచడానికి కాని ప్రభుత్వం సిద్ధం కాలేదు. అదే పెట్టుబడి వ్యయాన్ని చూస్తే 2024-25లో అది జిడిపిలో 4.0 శాతం ఉండేది. 2025-26 (సవరించిన అంచనాలు)లో 3.9 శాతంగా ఉంది. 2026-27కి అది 4.4 శాతానికి పెరిగింది. అయితే ఈ పెట్టుబడి వ్యయం పెరుగుదల కూడా ఒక భ్రమే. కేంద్ర ప్రభుత్వం స్వయంగా చేపట్టే పెట్టుబడి వ్యయం 2023-24లో, 2024-25లో 3.2 శాతం, 2025-26 (సవరించిన అంచనాలు)లో 3.1 శాతం ఉంటే ఇప్పుడు 2026-27లో కూడా 3.1 శాతమే ఉండనుంది. మరి పెరగనున్నది ఏమిటి ?

పెట్టుబడి ఆస్తులు (కాపిటల్ ఎసెట్స్) పెంచుకోడానికి సహాయంగా ఇచ్చే గ్రాంట్-ఇన్-ఎయిడ్ 0.8 శాతం నుంచి 2026-27లో 1.3 శాతానికి పెరగనుంది. అయితే ఇందులో ఉపాధి హామీ పథకం కింద ఇచ్చేది కూడా కలిసి వుంది. ఇప్పుడు ఆ పథకం కింద చేసే ఖర్చులో రాష్ట్రాల వాటా పెరిగింది. గతంలో కేంద్రం వాటా 90, రాష్ట్రాల వాటా 10 శాతంగా ఉండేది. ఇప్పుడు అది 60:40గా మారింది. ఇందులో రాష్ట్రాలు గనుక తమ వంతు ఖర్చుకు కావలసిన నిధులను సమీకరించుకోలేకపోతే అప్పుడు కేంద్రం తన వంతు ఖర్చు చేయనక్కర లేదు. ఇప్పటికే నిధుల లేమితో తిప్పలు పడుతున్న రాష్ట్రాలు ఏ మేరకు పెరిగిన ఈ అదనపు భారాన్ని మోయగలవన్నది ప్రశ్నార్థకమే. పైగా అనుకున్న విధంగా ఈ ఉపాధి హామీ పథకం కింద నిధులు ఖర్చు కాకపోవడానికి బాధ్యతను రాష్ట్రాల పైకి కేంద్రం నెట్టి వేసి తప్పించుకోవచ్చు. పోనీ ఈ విధంగా 90:10 నిష్పత్తిని 60:40గా మార్చేటప్పుడు రాష్ట్రాలను ఆ నిర్ణయంలో భాగస్వాముల్ని చేసిందా అంటే కేంద్రం ఆ పని చేయనేలేదు. కాని వైఫల్యానికి మాత్రం ఆ రాష్ట్రాల్నే బాధ్యులుగా చేయబోతోంది. "సహకార సమాఖ్యతత్వం" అంటే అర్థం ఇదేనేమో మరి !

కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల వనరుల విషయంలో, వాటి

బాధ్యతల విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసేసుకుంటూ, కొన్ని రాష్ట్రాల పట్ల పక్షపాతాన్ని ప్రదర్శిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. కేంద్రం పక్షపాతాన్ని చూపించేది బీజేపీ-పాలిత రాష్ట్రాలకు అనుకూలంగానని వేరే చెప్పనక్కరలేదు. బీజేపీ-యేతర పార్టీల పాలనలో వున్న రాష్ట్రాల పనితీరు సక్రమంగా లేదంటూ వాటికి నిధుల కోత పెడుతోంది. వై.వి.రెడ్డి అధ్యక్షతన నడిచిన 14వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాల వాటాను 2020 నాటికల్లా 32 నుంచి 42 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. కాని కేంద్ర ప్రభుత్వం పన్నులు పెంచడానికి సిద్ధపడ లేదు. ఒకవేళ పెంచితే అందులో రాష్ట్రాలకు వాటా పెంచవలసి వుంటుంది. దానికి బదులు సెస్‌లు, సర్‌చార్జిలు విధించడానికి పూనుకుంది. వాటిని రాష్ట్రాలతో పంచుకోవాలన్న నియమం లేదు. అందుకే రాష్ట్రాలకు ఎగనామం పెట్టడానికి ఈ ఎత్తుగడ పన్నింది. మొత్తం కలిపి చూస్తే ఇప్పుడు పన్నులు, సెస్‌లు, సర్‌చార్జిలు వసూలైన దానిలో రాష్ట్రాల వాటా 34 శాతానికి మించి లేదు. ఆ విధంగా ఆర్థిక వనరుల కేంద్రీకరణ పెరిగింది. ఇలా మోసపూరితంగా వ్యవహరించినా, కేంద్రం చేసే వ్యయం పెరుగుతోందాంటే అదీ లేదు. అది స్థిరంగానే ఉంది తప్ప పెరగడం లేదు. ఈ సారి గ్రాంట్-ఇన్ ఎయిడ్‌గా రాష్ట్రాలకు ఇచ్చేది ఉపాధి హామీ పథకంలోని మార్పుల కారణంగా బడ్జెట్‌లో చూపించిన మేరకు పెరగకపోవచ్చు. అదే జరిగితే ఈ ఏడాదీ ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల ఉండబోదు. ఆ విధంగా ఈ బడ్జెట్ మన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న మూడు ప్రధాన సమస్యలకూ పరిష్కారం చూపగల శక్తిని ప్రదర్శించలేదు.

మొత్తంగా చూస్తే కేంద్ర ప్రభుత్వ వ్యయం ఉపాధి కల్పనకు దోహదం చేసేదిగా లేదు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఖర్చు చేసే బదులు, భవనాలు నిర్మించడానికి ఖర్చు చేస్తే ఉపాధి పెరుగుదలకు అది ఎలా తోడ్పడుతుంది ? ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఖర్చుచేస్తే అటువంటి ప్రత్యక్ష ఉపాధి కల్పన వలన ఆర్థిక వ్యవస్థలో బహుళ దొంతరల్లో వృద్ధి నమోదయ్యే వీలుంటుంది. కాని బడ్జెట్‌లో ప్రతిపాదనలు నిరుద్యోగాన్ని అరికట్టే దిశగా లేవు. పైగా పెంచే దిశగా ఉన్నాయి. ప్రైవేటు రంగానికి పన్ను రాయితీలు పెంచారు. ఇక పెట్టుబడులను ఆకర్షించే పేరుతో బహుళజాతి కంపెనీలకు సైతం రాయితీలు కల్పించారు. మరోపక్క ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన కోసం కాకుండా మౌలిక వసతుల కల్పనకు కేటాయింపులు పెంచారు. ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పనకు కేటాయించి వుంటే, ప్రజలకు నేరుగా బదలాయించి వుంటే దాని ప్రభావం వేరేగా ఉంటుంది.

ప్రైవేటు రంగానికి ఎన్ని రాయితీలు ఇచ్చినా అక్కడి నుంచి పెట్టుబడులు పెరగవని, మార్కెట్‌లో డిమాండ్ పెరిగినప్పుడే ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతాయని ఈ ప్రభుత్వానికి తెలిసినట్టు లేదు. గత బడ్జెట్లలో ఇదే విధంగా పన్ను రాయితీలు ప్రైవేటు రంగానికి కల్పించారు. 2019లో అయితే భారీగా రాయితీలు ఇచ్చారు. కాని పెట్టుబడులు మాత్రం మందకొడిగానే ఉంటూ వచ్చాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే మందగించింది. దానితోబాటు పెట్టుబడులు మందగించాయి. ఇటువంటి సమయంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మన దేశంలోకి ప్రవహించేస్తాయని, అందుకే బహుళజాతి సంస్థలకు పన్నులు తగ్గించేస్తాం అని చెప్పడం బొత్తిగా అర్థం లేనిది. పైగా ఒక పక్క తన దేశం నుంచి పెట్టుబడులు బయటకు పోకుండా నిరోధించడానికి ట్రంప్ సుంకాలను తెగ పెంచేస్తున్న సమయంలో ఈ వాదన ఏ మాత్రమూ చెల్లేది కాదు.

ఇక ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారబోతోంది. ఇప్పుడు తలా ఐదు కిలోల చొప్పున పేదలకు ఉచితంగా ప్రతి నెలా ఇస్తున్న ఆహార ధాన్యాన్ని 2027లో నిలిపివేయనున్నట్టు ప్రకటించారు. గ్రామీణ ప్రాంత పేదలకు ప్రస్తుతం ఈ ఉచిత పథకం ప్రాణాధారంగా ఉంది. దానిని గనుక నిలిపేస్తే అది వారికి మరింత లోతుగా కష్టాల్లోకి నెడుతుంది. రెండవది అమెరికాతో సహా వివిధ దేశాలతో చేసిన వాణిజ్య ఒప్పందాల విషయం. ముఖ్యంగా అమెరికాతో చేసిన ఒప్పందం ప్రకారం (వస్తున్న వార్తలను బట్టి) భారతీయ సరుకుల మీద అమెరికా పద్దెనిమిది శాతం సుంకం వేస్తుంది. కాని అమెరికా నుంచి వచ్చే వస్తువుల మీద మన దేశం ఏ పన్నూ విధించదు. ఇటువంటి అసమాన వాణిజ్య ఒప్పందం మన భారతీయ రైతులకు ఎనలేని కష్టాలను కలిగించనుంది. ఇది ముఖ్యంగా పాడి రంగం మీద ప్రభావం చూపనుంది. కాని ఫాసిస్టు లక్షణం ఉన్న ఏ ప్రభుత్వమైనా ప్రజల సమస్యల పట్ల ఏమీ పట్టనట్టే వ్యవహరిస్తుంది తప్ప వాటి పరిష్కారం గురించి ఏ మాత్రమూ ఆలోచించదు. 1930ల నాటి ఫాసిజానికి, నేటి ఫాసిజానికి తేడా ఏమిటో ఈ బడ్జెట్ తెలియజేస్తుంది. 1930లలో ఫాసిస్టు దేశాలలో బడ్జెట్లలో లోటు భారీగా పెంచి సైనిక వ్యయాన్ని బాగా పెంచారు. దాని వలన ఆ దేశాలలో స్థూల డిమాండ్ బాగా పెరిగింది. దానివలన ఆ దేశాలు మహా మాంద్యం నుంచి బయటపడ్డాయి. ఆ సైనిక వ్యయంలో భాగంగా కేవలం యుద్ధ పరికరాలకు, వాహనాలకు, ఆయుధాలకు మాత్రమే కాకుండా పెద్ద ఎత్తున సైనికులను కూడా నియమించారు. అది నేరుగా ఉపాధి అవకాశాలను పెంచింది. కాని, ప్రస్తుతం ఉన్న ఫాసిస్టు ప్రభుత్వాలు, మన బీజేపీ ప్రభుత్వం వంటివి, ద్రవ్యలోటునూ పెంచడం లేదు, ప్రత్యక్ష ఉపాధి అవకాశాలనూ పెంచడం లేదు. ప్రజలకు నేరుగా ఆర్థిక తోడ్పాటునూ అందించడం లేదు. వాళ్లు రాబోయే కాలంలో పెంచేది ఏమైనా ఉందీ అంటే అది ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే ప్రచారాన్ని మాత్రమే. ❑ **(నవతెలంగాణ సౌజన్యంతో)**

# కేంద్ర బడ్జెట్ : సంపన్నులకే 'అచ్ఛేదిన్'



- షేక్ కరిముల్లా

అచ్ఛేదిన్ వారి కలర్ ఫుల్ బడ్జెట్-(2026-2027) ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 53,47,315 కోట్ల రూపాయలతో ఘనంగా ప్రవేశపెట్టారు. ఎప్పటిలాగే కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల జల్లులు కురిపించారు. కార్మికులు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి, సాధారణ పేద ప్రజలకు మొండిచేయి చూపించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం లాంటి సామాన్య ప్రజలకు ఉపయోగపడే కీలక రంగాలకు సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు విధించారు. చివరకు మహిళా సంక్షేమం అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బడ్జెట్' నిధుల్లోనూ కోతలు పెట్టారు. ఇక 'అచ్ఛేదిన్' సంపన్నులకే అంటూ మరోసారి చాటి చెప్పారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం నీరుగార్చారు. దీంతో రానున్న రోజుల్లో నిరుద్యోగం, అధిక ధరలు, జీవన వ్యయం పెరగటం, ఉపాధి లేమితో ప్రజలు బాగా ఇబ్బంది పడతారు.

ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయ, వ్యయాల పట్టిక బడ్జెట్. సర్కారు ఆర్థిక విధాన పత్రం. దేశ వార్షిక నివేదిక. రూపాయి రాక, పోకల చిట్టాపద్దునే బడ్జెట్ అంటారు. ప్రభుత్వం ప్రజల నుంచి పన్నులు, ఇతర రూపంలో వసూలు చేసిన ధనాన్ని వారి కోసం ఎలా వినియోగించబోతున్నదో వివరించే వార్షిక నివేదిక. ప్రతియేడూ బడ్జెట్ తంతూ ఎలా ఉంటుందంటే "మేడి పండు చూడు మేలిమై ఉండును. పొట్టవిప్పి చూడు పురుగులుండును" అన్న చందంగా ఉంటుంది. ఆర్భాటాలు, ఉత్తర కుమార ప్రగల్భాలతో కూడిన బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. అయితే కాస్త లోతుల్లోకి వెళ్లి చూస్తే బడ్జెట్లో చెప్పే అంకెలు వేరు, తర్వాత కేటాయించి ఖర్చు పెట్టే అంకెలు వేరు. అంతా మాయల ఫకీరు, టక్కు టమారా గారడీ విద్యలు తప్ప ఇందులో వాస్తవం ఉండదు. ఇంకా ఎన్నాళ్లు ఈ మోసం...?

1947లో స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ప్రతి యేటా బడ్జెట్లు వస్తున్నాయి. పోతున్నాయి. 'సింగడు అద్దంకి రానే వచ్చాడు, పోనే పోయాడు' అన్న సామెత చందంగా ఉంటుంది బడ్జెట్ వ్యవహారం.

ఇన్నేళ్లలో డెబ్బయి తొమ్మిది బడ్జెట్‌లలో కేటాయించిన కేటాయింపులకు ఖర్చులు, సాధించిన ప్రగతి అంచనా లెక్కలు ఏనాడైనా ప్రజల ముందు పెట్టారా ? పాలకులు చెప్పే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాయా ? కనీసం సమీక్షలు ఉన్నాయా ? దేశ ఆర్థిక వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, పారదర్శకంగా ఉండాల్సింది పోయి, అంకెల గారడీలు, తప్పుడు చిట్టా పద్దులతో, ముద్దు ముద్దు మాటలతో ప్రజల్ని ఏడాదికి ఒకసారి మోసపుచ్చే తంతే బడ్జెట్. 1991లో నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ మొదలైనప్పటి నుంచి బడ్జెట్ అర్థం పూర్తిగా మారిపోయింది. కడుపులో చల్ల కదలకుండా, సంపన్నులకు ఎర్ర తివాచీ పరచి మరి వారిపై వరాల జల్లులు, అనేక రాయితీలు కల్పిస్తూ బడ్జెట్లు తయారవుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బడ్జెట్లు మొత్తం ప్రపంచబ్యాంకు, దేశ, విదేశీ కార్పొరేట్‌ల కనుసన్నల్లోనే రూపుదిద్దుకుంటున్నాయి. లాంచనంగా తెచ్చి పార్లమెంట్‌లో చదవటమే ఆర్థిక మంత్రుల పని. ఇందులో సంపన్నుల ప్రయోజనాలే ఉంటాయి. 'నేతి బీరకాయలో నెయ్యి ఉంటుందా' ? కాబట్టి ఈ బడ్జెట్ల వలన సామాన్య ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదు.

వాస్తవానికి భారతదేశము పేద దేశం కాదు, అపార సహజ వనరులు, కష్టించి పని చేసే మానవ వనరులు కలిగిన సంపన్న దేశం. కానీ తీరని దారిద్రం అనుభవిస్తున్న పేద ప్రజల దేశం మనది. దాదాపు మూడు శతాబ్దాలు బ్రిటిష్ వలస పాలకులు మన దేశ వనరులను దోచుకువెళ్లారు. ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేశారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినా, దేశ పునర్ నిర్మాణం ఏదో కొద్దిగా తప్పితే సరిగా జరగలేదు. దీనికి కారణం సంకుచిత రాజకీయ నిర్మాణమే. ఇప్పటికీ ప్రజల ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, విద్య ఆరోగ్యం ఉపాధి దక్కలేదు. 79 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా ఇప్పటికీ ఇవే ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఆకలి, ఆరోగ్యం, విద్య, వైద్యం, న్యాయం, చట్టంతో సహా అన్నింటిలో అంతరాలు, అసమానతలు పెరిగిపోతున్నాయి. అంటే సరైన ప్రజా ఆర్థిక విధానాలు అనుసరించడం లేదని తేలిపోయింది. దేశ ప్రజల దుర్భర జీవితాలను, అసమానతలను అనేక అంతర్జాతీయ నివేదికలు చెబుతూనే ఉన్నాయి.

ఆక్స్‌ఫామ్ నివేదిక-2025 ప్రకారం దేశంలో అత్యంత ధనవంతులైన కొద్ది మంది వద్దే దేశ సంపదలో 90 శాతం పోగుపడి ఉంది. ఇందులో ఐదు శాతంగా ఉన్న అపర కుబేరుల వద్ద 62 శాతం సంపద కేంద్రీకృతమై ఉంది. ఒక శాతంగా ఉన్న ఆదానీ, అంబానీల వద్ద 40.6శాతం సంపద పోగుపడి ఉంది.

మిగతా దేశంలోని అశేష ప్రజానీకం వద్ద కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని నివేదిక ప్రకటించింది. దీన్ని బట్టి ఆర్థిక అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కేంద్రంలో 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారత్ అభివృద్ధి సాధించిందని, ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నదని, 'అచ్చేదిన్, వికసిత భారత్, సబ్ కా సాత్, సబ్‌కా వికాస్, డబులింజన్ సర్కార్ అంటూ గోదీ మీడియా పెద్ద ఎత్తున గోబెల్స్ ప్రచారం చేస్తున్నది.

కానీ వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రపంచ ఆకలి, సంతోష, మానవ అభివృద్ధి సూచికల్లో మన దేశ స్థానం గత పదేళ్లుగా మరింత దిగజారిందని నివేదికలు చెబుతున్నాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ఎకానమీ నివేదిక-2024 ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేటు 7.8 శాతం గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ నిరుద్యోగిత 8.06 శాతంగా ఉంది. పని చేయగలిగిన సత్తా ఉన్న తగిన ఉపాధి దొరకక, పొట్ట కూటి కోసం దేశ యువత అల్లాడిపోతున్నారు. ఈ పదేళ్లలో 24 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 7.5 లక్షల మందికి ఉపాధి దొరికింది. అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. యేటా ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో మోడీజీ జవాబు చెప్పాలి. ఇలా ఉపాధి కల్పనలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దేశంలో గత ఇరవై ఏళ్లుగా ఉపాధి రహిత అభివృద్ధి జరిగి ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చింది. ఈ బడ్జెట్‌ల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. గనుక, తమ మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలను నిర్మించుకోవడమే ప్రజల కర్తవ్యం కావాలి. ❑ **(నవ తెలంగాణ సౌజన్యంతో)**

## అందరి ప్రగతికి బడ్జెట్ ఎలా ఉండాలి ?

**(4వ పేజీ తరువాయి)**

బడ్జెట్ ఉద్యోగాలు లేని వృద్ధిని అంగీకరించదు. వ్యవసాయం, వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, నిర్మాణం, సంరక్షణ సేవలు వంటి కార్మికాధారిత రంగాలకు ప్రాధాన్యం ఇస్తుంది. గ్రామీణ మౌలిక వసతులు, పట్టణ గృహ నిర్మాణం, వాతావరణ మార్పులకు తట్టుకునే ప్రజా పనుల్లో పెట్టుబడులు పెట్టి, ఉద్యోగాలు సృష్టించడంతోపాటు జాతీయ ఆస్తులను నిర్మిస్తుంది. విద్య, ఆరోగ్యం ఖర్చుల భారంగా కాకుండా మౌలిక పెట్టుబడులుగా చూడాలి. నిధుల కొరతతో నడిచే పాఠశాలలు, ఆసుపత్రులతో ఏ దేశమూ ప్రపంచ పోటీలో నిలవదు. ప్రభుత్వ విద్య పేదలకు శక్తినిస్తుంది. ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ పేదరికం మరణశిక్షగా మారకుండా అడ్డుకుంటుంది. అయినా ఈ రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఖరీదైన ప్రైవేట్ సేవలపై ఆధారపడాల్సి వస్తోంది.

రాజ్యాంగపరమైన బడ్జెట్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పునరుజ్జీవింపజేస్తుంది. ఇప్పటికే ఆధిపత్యం కలిగిన పెద్ద కార్పొరేట్లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం కాకుండా, రుణ హామీలు, సరళమైన నియమాలు, సాంకేతిక మద్దతు, హామీ గల కొనుగోళ్ల ద్వారా అవకాశాలను విస్తరించాలి.

పన్ను విధానం కూడా రాజ్యాంగ ఉద్దేశాన్ని ప్రతిబింబించాలి. ప్రగతిశీల పన్నువిధానం విజయానికి శిక్ష కాదు. ప్రజా మౌలిక వసతుల నుంచి ఎక్కువ లాభం పొందేవారు సముచితంగా వాటా చెల్లించాలనే సూత్రం. సంపద పన్నులు, వారసత్వ పన్నులు, అకస్మాత్తు లాభాలపై పన్నులు ప్రజా అవసరాలకు నిధులు సమకూర్చగలవు. పునర్వితరణ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచదు. నిరాశతో నిండిన సముద్రాల మధ్య సంపన్న దీవులపై గణతంత్రం నిలబడదు. తీవ్ర అసమానత సామాజిక విశ్వాసాన్ని దెబ్బ తీస్తుందని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరం చేస్తుందని చరిత్ర స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో, వృద్ధిని న్యాయంతో, మార్కెట్లను నైతికతతో, సామర్థ్యాన్ని సహానుభూతితో కలిపే రాజ్యాంగ దృష్టిని మళ్లీ ఆవిష్కరించాల్సిన అవసరం ఉంది. నిజమైన సౌభాగ్యం సామూహికమే. ఇది సిద్ధాంత పిలుపు కాదు. రాజ్యాంగానికి విధేయతకు పిలుపు. మార్గదర్శక సూత్రాలు న్యాయపరంగా అమలు చేయదగినవి కాకపోయినా, రాజకీయంగా, నైతికంగా బంధనాత్మకమైనవే. సాంకేతిక మార్పులు, వాతావరణ సంక్షోభాలు, ప్రపంచ అస్థిరతల కాలంలో భారత్‌కు సామాజిక ఐక్యత అత్యవసరం. అది నినాదాలతో కాదు, న్యాయంతోనే సాధ్యమవుతుంది.

రాష్ట్రం శక్తిమంతుల పక్షాన మాత్రమే కాకుండా సామాన్యుల పక్షాన నిలుస్తుందని నమ్మకం కలిగించే బడ్జెట్ ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి మార్గం వేస్తుంది. అది యువతకు భవిష్యత్తుపై ఆశనిస్తుంది. రైతులు, కార్మికులు కనిపించకుండా పోయినవారు కాదని భరోసా ఇస్తుంది. గిగ్ కార్మికులకు గౌరవం హక్కేనని ధృవీకరిస్తుంది. ఇలా బడ్జెట్ వనరులను కేటాయించడమే కాదు, గణతంత్రం - ప్రజల మధ్య విశ్వాసాన్ని పునర్నిర్మిస్తుంది.

ఎంపిక స్పష్టంగా ఉంది. అసమానత విధిగా మారుతున్నప్పటికీ వృద్ధిని సంబరంగా జరుపుకునే దారిలో కొనసాగాలా ? లేక అందరికీ చెందిన ఆర్థిక వ్యవస్థ అనే రాజ్యాంగ వాగ్దానాన్ని తిరిగి స్వీకరించాలా ? మన రాజ్యాంగానికి తగిన గణతంత్రం రెండో మార్గాన్నే ఎంచుకోవాలి. ❑

# ప్రజాస్వామ్యం : విస్తరణ దశలోని సంక్షోభాలు - ప్రజల చైతన్యమే దానికి ప్రాణం



- ప్రొ ॥ కె.యస్.చలం

ప్రజాస్వామ్యం ఒకసారి స్థాపించబడితే చాలు అని భావించడం పెద్ద భ్రమ. అది ఒక స్థిర నిర్మాణం కాదు; నిరంతరం విస్తరిస్తూ, లోతుగా మారుతూ ఉండాల్సిన సామాజిక-రాజకీయ ప్రక్రియ. ప్రజల భాగస్వామ్యం పెరిగే కొద్దీ ప్రజాస్వామ్యం బలపడాలి. కానీ వాస్తవంలో, విస్తరణ దశలోనే అది తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను గుర్తించి, వాటికి ప్రజల చైతన్యంతో సమాధానం వెతకకపోతే ప్రజాస్వామ్యం రూపంలో ఉన్న వ్యవస్థ మాత్రమే మిగిలి, ఆత్మ మాయమవుతుంది.

ప్రజాస్వామ్యం విస్తరిస్తున్నప్పుడు ముందుగా ఎదురయ్యే సమస్య రూపకల్పన-ఆచరణ మధ్య ఉన్న అంతరం. రాజ్యాంగం ప్రజలకు సార్వభౌమాధికారం ఇస్తుంది. కానీ ఆ అధికారం ఎన్నికల రోజుకే పరిమితం అవుతోంది. ఐదేళ్లకోసారి ఓటు వేయడమే ప్రజాస్వామ్యంగా భావించే స్థితి ఏర్పడింది. ఫలితంగా నిర్ణయాలు ప్రజల చేతుల్లో కాకుండా కొద్దిమంది రాజకీయ నాయకులు, కార్పొరేట్ శక్తులు, అధికారి వర్గాల చేతుల్లో కేంద్రీకృతమవుతున్నాయి. ప్రజాస్వామ్యం ప్రజల పాలనగా కాకుండా ప్రజల పేరుతో జరిగే పాలనగా మారుతోంది.

ఇంకొక కీలక సమస్య ఆర్థిక అసమానతలు. **తీవ్ర పేదరికం, నిరుద్యోగం, అసురక్షిత జీవనం ఉన్న సమాజంలో రాజకీయ సమానత్వం వాస్తవంగా పనిచేయదు. ఓటు ఒక హక్కుగా కాకుండా ఒక వస్తువుగా మారుతుంది. డబ్బు, మద్యం, కుల--మత ప్రభావాలు ఎన్నికల ప్రక్రియను మలుపుతిప్పుతాయి.** ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడలేదన్న సత్యం ఇక్కడ స్పష్టమవుతుంది.

ప్రజాస్వామ్య విస్తరణకు మరో అడ్డంకి ప్రజల అవగాహన లోపం. ప్రజాస్వామ్యం అంటే హక్కుల జాబితా మాత్రమే అన్న భావన విస్తరించింది. బాధ్యతలు, ప్రశ్నించే హక్కు, భిన్నాభిప్రాయాల గౌరవం వంటి విలువలు పక్కకు నెట్టబడుతున్నాయి. దీనివల్ల భావోద్వేగాలు, అసత్య ప్రచారం, వ్యక్తి పూజ రాజకీయాలను ఆక్రమిస్తున్నాయి. **విమర్శను దేశద్రోహంగా, ప్రశ్నను శత్రుత్వంగా చిత్రీకరించే వాతావరణం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.** ఇదే సమయంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే సంస్థలు బలహీనపడుతున్నాయి. **పార్లమెంట్, న్యాయవ్యవస్థ, మీడియా, ఎన్నికల వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయకపోతే ప్రజాస్వామ్యం ఖాళీ గడపగా మారుతుంది. సంస్థల బలహీనత ప్రజల నమ్మకాన్ని దెబ్బ తీసి నిరాశను పెంచుతుంది. ఆ నిరాశే నియంతృత్వ ధోరణులకు దారి తీసే ప్రమాదం ఉంది.**

అలాగే కులం, మతం, భాష, ప్రాంతం వంటి గుర్తింపుల ఆధారంగా నడిచే రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని విభజన సాధనంగా మారుస్తున్నాయి. ప్రజల అసలైన సమస్యలు - ఉపాధి, విద్య, ఆరోగ్యం, భద్రత - పక్కకు పోయి గుర్తింపు రాజకీయాలే కేంద్రంగా మారుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని ప్రజల సమస్యల నుంచి దూరం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు ప్రజాస్వామ్యాన్ని అవగాహన చేసుకుని ఆచరించాలంటే విస్తృతమైన సామాజిక కృషి అవసరం. **మొదటగా** పౌర విద్య కీలకం. పాఠశాల స్థాయి నుంచే రాజ్యాంగ విలువలు, హక్కులు - బాధ్యతలు, ప్రశ్నించేతత్వం, భిన్నాభిప్రాయాల గౌరవం నేర్పాలి. ప్రజాస్వామ్యాన్ని పాఠ్యాంశంగా మాత్రమే కాకుండా జీవన విలువగా మలచాలి.

**రెండవది** ప్రజల నిరంతర భాగస్వామ్యం. ప్రజాస్వామ్యం ఎన్నికల ప్రక్రియకే పరిమితం కాకుండా రోజువారీ జీవితంలో ఆచరణలో ఉండాలి. స్థానిక స్వయంపాలన సంస్థల్లో ప్రజలు చురుగ్గా పాల్గొనడం, ప్రజా సమస్యలపై చర్చలు, సామూహిక నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తాయి.

**మూడవది** స్వతంత్ర మీడియా మరియు విమర్శనాత్మక ఆలోచన. వార్తను నమ్మే ముందు ఆలోచించే, ప్రశ్నించే ప్రజలే ప్రజాస్వామ్యానికి నిజమైన కాపలాదారులు. విమర్శ ప్రజాస్వామ్యానికి శత్రువు కాదు; అది దాని రక్షణ కవచం. అంతేకాదు, సామాజిక-ఆర్థిక న్యాయం లేకుండా ప్రజాస్వామ్యం బలపడదు. అందరికీ విద్య, ఆరోగ్యం, ఉపాధి లభించినప్పుడే రాజకీయ సమానత్వం వాస్తవంగా మారుతుంది. ఈ దిశగా ప్రభుత్వ విధానాలు, ప్రజా ఉద్యమాలు కీలక పాత్ర పోషించాలి.

చరిత్ర ఒక స్పష్టమైన సత్యాన్ని చెబుతుంది : **ప్రజాస్వామ్యం పాలకుల దయతో కాదు, ప్రజల ఆర్థిక-సామాజిక పోరాటాల ద్వారానే విస్తరించింది.** కార్మిక ఉద్యమాలు, రైతు ఉద్యమాలు, మహిళా ఉద్యమాలు, దళిత-బహుజన ఉద్యమాలు కేవలం కొన్ని డిమాండ్ల కోసం మాత్రమే కాకుండా ప్రజలను సంఘటితంగా ఆలోచించడానికి, చర్చించడానికి, నిర్ణయాలు తీసుకోవడానికి అలవాటు చేశాయి. ఈ పోరాటాల్లో పాల్గొనడం ద్వారా ప్రజలు నాయకత్వాన్ని ప్రశ్నించడం, సమూహ నిర్ణయాలను **(మిగతా 11వ పేజీలో)**

# సంపదల్లో సమానత్వం ఎందుకు ?



- రాహుల్‌కుమార్

మానవ సమాజంలో అసమానతలపై వచ్చిన వివరణలూ, సమర్థనలూ ఇంకే విషయంపైనా రాలేదు. మతాలు ప్రబోధాలనూ, తత్వశాస్త్రాల చర్చలనూ తరచి చూస్తే అవే ఎక్కువగా కనపడతాయి. అన్ని సందర్భాల్లో అవి ప్రత్యక్షంగా వ్యక్తం కాకపోవచ్చు. విశ్వ విద్యాలయాల్లో నిష్ణాతుల మధ్య చర్చల్లా అవి ఉండకపోవచ్చు. ఈనాటి వాదప్రతివాదాల్లాగా స్పష్టంగా వెల్లడి కాకపోవచ్చు. కానీ, మన సంప్రదాయ కథల్లో, పురాణాల్లో, కావ్యాల్లో, పాపపుణ్యాల వివేచనల్లో, ధర్మాధర్మ ఆలోచనల్లో.. అంతస్తుల్లో ఎక్కువ తక్కువలను వివరించి తాత్విక సమర్థనలు ఇవ్వటమే ప్రధానంగా ఉంటుంది.

మన కర్మ సిద్ధాంతమే ఇందుకు నిదర్శనం. గత జన్మలో చెడు కర్మలు చేసిన వారు కష్టాలను అనుభవిస్తున్నారనీ, మంచి కర్మలు చేస్తే వచ్చే జన్మలో ఉన్నతస్థాయికి వెళతారన్న భరోసా ఇవ్వటమే అందులో కనపడుతుంది. ఆ భరోసాతోనే సర్దుకుపోయే మనస్తత్వం ఏర్పడుతుంది. అన్ని దేశాల్లోనూ ఇలాంటి సిద్ధాంతాలు ఉన్నాయి. **'ధనికులను పేదలు చంపకుండా మతమే నిలువరిస్తోంది' అని నెపోలియన్ రెండు వందల ఏళ్ల క్రితమే చాలా నిక్కచ్చిగా చెప్పాడు. సాధారణ ప్రజలను నిశ్శబ్దంగా ఉంచటానికి అదొక అద్భుత సాధనమని కూడా నెపోలియన్ వ్యాఖ్యానించాడు.** ఈ అద్భుత సాధనం ఇప్పటికీ ఉన్నప్పటికీ ఒకనాటి పదునును కోల్పోతోంది. ఆధునిక సమాజంలో అసమానతలను ప్రశ్నించటం పౌరహక్కుగా మారిపోతోంది. ఒకస్థాయి వరకే అసమానతలను సహించే పరిస్థితి నెలకొంటోంది. మితిమీరిన అసమానతలపై ప్రపంచవ్యాప్తంగా ఏదో ఒక రూపంలో అలజడులు, ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యానికీ, ఆర్థికాభివృద్ధికీ, పర్యావరణానికీ అసమానతలు తీవ్ర ఆటంకాలుగా పరిణమించటంపై ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. అసమానతలు కలిగిస్తున్న విపరిణామాల విషయమై అంతర్జాతీయ వేదికలపై చర్చలూ మొదలయ్యాయి.

ఈ నెల 22, 23 తేదీల్లో దక్షిణాఫ్రికాలోని జోహానెస్‌బర్గ్‌లో జరిగే జీ-20 సదస్సులో అసమానతల అంశాన్ని ప్రధాన అజెండాలో చేర్చారు. జీ-20 కూటమికి అధ్యక్షత వహిస్తున్న దక్షిణాఫ్రికా సారథ్యంలో అసమానతలపై నివేదికను ఇవ్వటానికి స్వతంత్ర నిపుణులతో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన జోసెఫ్ స్టిగ్లిట్స్ నేతృత్వంలో ఏర్పడిన ఆ కమిటీ అసమానతలను పలు కోణాల్లో విశ్లేషించి నివేదికను రూపొందించింది. తీవ్ర అసమానతల కారణంగా వివిధ కీలక రంగాలకు ప్రమాదం ఎలా పొంచి ఉందో నివేదికలో స్పష్టంగా వివరించారు. సంపద, ఆదాయాలపరంగా పెరిగిపోతున్న అసమానతలను లోతుగా విశ్లేషించారు.

గత 40 ఏళ్లల్లో 50 శాతం ప్రజల సగటు వాస్తవ ఆదాయం 358 డాలర్లు మాత్రమే పెరిగింది. ఒక శాతమున్న బడా ధనికుల సగటు ఆదాయం అదే కాలంలో 191,000 డాలర్లకు చేరింది. సంపదలో అసమానతలు ఇంకా దారుణంగా తయారయ్యాయి. **2020-2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన మొత్తం సంపదలో 41 శాతం ఒక శాతంగా ఉన్న శ్రీమంతుల చేతుల్లోకి వెళ్లింది. దిగువనున్న 50 శాతం ప్రజలకు పెరిగిన సంపదలో లభించిన వాటా 1 శాతం మాత్రమే.** శ్రీమంతులకు సగటున 13 లక్షల డాలర్ల సంపద లభిస్తే అట్టడుగునున్న 50 శాతం ప్రజలకు సగటున 585 డాలర్ల సంపదే దక్కింది. అంటే 2,655 రెట్లు ఎక్కువ సంపద 1 శాతం శ్రీమంతుల చేతుల్లోకి వెళ్లింది. ప్రపంచ వస్తు, సేవల విలువలో (జీడీపీ) 16 శాతానికి సమానమైన సంపద 3,000 మంది కుబేరుల చేతుల్లో పోగుపడింది. ఇప్పటి వరకూ బిలియనీర్లను మాత్రమే మనం చూశాం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో పదేళ్లల్లో ట్రిలియనీర్లు రంగంపైకి వచ్చేస్తారు. బిలియనీర్లు అందరూ సొంతంగా పరిశ్రమలూ, కంపెనీలూ పెట్టి కిందా మీదా పడి సంపదను కూడబెట్టిన వాళ్లు కాదు. వారసత్వంగా సంపదను పొందిన వాళ్లే ఎక్కువ. అసమానతలు తీవ్రంగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్య క్షీణత ఏడు రెట్లు ఎక్కువగా ఉంది. పెరిగిపోతున్న అసమానతల వల్ల 2020ల నుంచి దారిద్ర్యం నుంచి ప్రజలను గట్టెక్కించే ప్రక్రియల్లో వేగం తగ్గింది. దీంతో 230 కోట్ల మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. సగం ప్రపంచ జనాభాకు అత్యవసర ఆరోగ్యసేవలు అందటం లేదు. వైద్య ఖర్చులకు సొంత డబ్బులు చెల్లించాల్సి రావటంతో 130 కోట్ల మంది ఆర్థిక పరిస్థితి దిగజారింది. అసమానతల వల్ల ప్రజాస్వామ్య సంస్థల్లో నమ్మకం తగ్గిపోతోంది. విభజన రాజకీయాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఉన్మాద రాజకీయాల ప్రాబల్యం విస్తరిస్తోంది. ప్రజాస్వామిక ప్రక్రియల్లో పాల్గొనాలనే ఆసక్తిలోనూ క్షీణత కనపడుతోంది. అసమానతలు ఎక్కువగా ఉన్న 23 దేశాల్లో 22

చోట్ల ప్రజాస్వామ్యం అన్ని రకాలుగా దిగజారింది.

చట్టసభలు, న్యాయవ్యవస్థల పనితీరు మందగిస్తోంది. అసమానతలు కలిగించిన అసంతృప్తిని ఆసరా చేసుకుని విపరీత పోకడలతో, జనాకర్షక నినాదాలతో, నియంతృత్వ లక్షణాలతో ఎన్నికల్లో గెలిచే నాయకుల సంఖ్యా ఎక్కువైంది. సంపన్న వర్గాల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావంతో రాజకీయాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. రాజకీయ అధికారాన్ని శాసించటం ద్వారా సంపన్న వర్గాలు తమ అనుకూల విధానాలనే అమలయ్యేలా చూస్తున్నాయి. సంపద బలం నుంచి రాజకీయ ప్రాబల్యం.. మళ్లీ ఈ ప్రాబల్యం అండతో సంపదను పెంచుకునే మార్గాలను సుస్థిరపరచుకోవటం.. ఇట్లా ఎడతెగని బంధం ఒకటి ఏర్పడుతోంది. ప్రభుత్వ జోక్యం లేకుండా మార్కెట్‌కే అన్ని వదిలేస్తే ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందనే భావన ఎంత తప్పో అనేక దేశాల్లో పరిణామాలను చూస్తే అర్థం అవుతుంది.

అసలు ప్రభుత్వం జోక్యం తగ్గిన తర్వాతే అసమానతలు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయి. 1990ల నుంచి ఇదింకా స్పష్టంగా కనపడుతోంది. అసమానతలు ఆర్థికాభివృద్ధికి ఆటంకాలు ఎలా అవుతున్నాయో ఏడు విషయాలను పరిశీలిస్తే తేలికగా అర్థం అవుతాయి.

- 1) అసమానతల వల్ల తగినంత డబ్బు కింది వర్గాల్లో లేకపోవటంతో వస్తు, సేవలకు గిరాకీ తగ్గిపోతుంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థకు కావాల్సిన వస్తు-సేవల డిమాండ్ ఉండదు. కింది వర్గాలు తమ దగ్గర ఉన్న మొత్తం డబ్బుని ఖర్చుచేసినా వారు సృష్టించే డిమాండు తక్కువగానే ఉంటుంది. పై వర్గాల చేతుల్లో డబ్బు ఉన్నా కొనుగోళ్లు పరిమితం అవ్వటం వల్ల అవసరమైన డిమాండును సృష్టించలేరు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యానికి అనుగుణంగా పనిచేయలేదు.
- 2) ఆదాయం అంతంత మాత్రంగా ఉండటం వల్ల సరైన పోషకాహారాన్ని ఎక్కువ మంది పొందలేరు. అవసరమైన వైద్యాన్నీ పొందలేరు. పిల్లల చదువుకూ ఇబ్బందులు ఏర్పడతాయి. అంతర్గత శక్తులు పూర్తిగా విప్పారని వారిగా ఆ పిల్లలు తయారవుతారు. దాంతో తక్కువ ఉత్పాదకత (లెస్ ప్రడక్టివ్) జీవులుగా మారతారు. దీని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది.
- 3) ఉద్యోగ భద్రత లేకుండా అసంఘటిత రంగంలో పని చేసేవారు ఆర్థికరంగంలో వచ్చే ఒడిదుడుకులకు తీవ్రంగా ప్రభావితం అవుతారు. ప్రభుత్వపరంగా వీరిని ఆదుకోటానికి సామాజిక భద్రతా పథకాల్లేని చోట పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఆందోళన చుట్టుముడుతుంది. దీంతో సరిగా పనిచేయలేరు. వాళ్ల ఉత్పాదకతా తగ్గిపోతుంది. మరోవైపు పిల్లల విద్యపై పెట్టే ఖర్చునీ తగ్గించి వేస్తారు. కొత్త నైపుణ్యాల కోసం ఖర్చు పెట్టి మరో ఉద్యోగాన్ని పొందటమూ కష్టమవుతుంది. భవిష్యత్తు కోసం నిర్ణయాలు తీసుకోలేని అశక్తతలో కూరుకుపోతారు.
- 4) తక్కువ ఆదాయం ఉన్న వాళ్లకు మంచి విద్య, వైద్యం లభించదు. ఇక వాళ్ల పిల్లలకు వయస్సుతోపాటు అందాల్సిన పోషకాహారం లభించకపోవటంతో వాళ్ల మేధో సామర్థ్యం పూర్తిగా వికసించదు. దీంతో పెద్దయ్యాక కూడా వాళ్లు పోటీలు పడి మంచి ఉద్యోగాలను సాధించలేరు. సామాజికంగా పై మెట్టును ఎక్కలేరు. అసమానతల వల్ల పేదరికం తరాలపాటు కొనసాగుతుంది. సామాజిక పురోగతి స్తంభించిపోతుంది. ప్రభుత్వాలు ఆరోగ్య ఖర్చుని 1 శాతం పెంచితే తరాల మధ్య అసమానత 14 శాతం తగ్గుతుంది. కానీ అదే చాలాచోట్ల జరగటం లేదు.
- 5) అసమానతలు మెజారిటీ ప్రజలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తాయి. దీంతో ఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది.
- 6) సంపద అధికంగా ఉన్న వర్గాలు తమ దగ్గరున్న డబ్బును ఉత్పాదకతను పెంచే రంగాల్లో పెట్టుబడులు పెట్టకుండా కూడా సమాజానికి హాని కల్గిస్తారు. సహజ వనరులపై గుత్తాధిపత్యం సాధించి లాభాలను సంపాదించాలని చూస్తారు. కొత్త పరికరాల సృష్టికో, అదనపు విలువను జోడించటానికో ప్రయత్నించకుండా ప్రభుత్వ యంత్రాగాన్ని ప్రభావితంచేసి లాభాలను (రెంట్ సీకింగ్) గడించాలని చూడటం ఆర్థిక వ్యవస్థకే కాకుండా ప్రజలకూ తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతుంది. గనులు, చమురు, సహజవాయువు వనరులపై ప్రభుత్వ నియంత్రణ తక్కువ ఉండేలా చూసి లాభాలను అధికం చేసుకుంటారు. స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ నాశనం, భవిష్యత్తు తరాల సంక్షేమం పట్టకుండా వ్యవహరిస్తారు.
- 7) ఇక ఒక దేశంలో ఉన్న అసమానతలు ఆ దేశానికే పరిమితం కావు. ఆరోగ్యసేవలు బలహీనంగా ఉన్నచోట వ్యాధులు వేగంగా వ్యాపించి ఇతర దేశాలకూ చేరతాయి. ఒక దేశంలో కాలుష్యం ఇతర దేశాలకూ వ్యాపిస్తుంది. ధనికుల అతి విలాసాల వల్ల అధిక కార్బన్ వినియోగం జరిగి వాతావరణం విపరీత మార్పులకు లోనవుతోంది. అమెరికా, యూరపుల్లో ధనికుల జీవనశైలి వల్ల పేద దేశాల ప్రజలు అతి వృష్టి, అనావృష్టిని ఎదుర్కొంటున్నారు.

అందుకే దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలను కట్టడిచేయకపోతే అస్థిరతలు, సంక్షోభాలు, తిరుగుబాట్లు, ప్రజాస్వామ్యం ముసుగులో **(మిగతా 26వ పేజీలో)**

# సామాజిక న్యాయంపై కనిపించని కుట్ర



- యోగేంద్ర యాదవ్

**ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను నివారించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గత నెల 13న జారీ చేసిన కొత్త నిబంధనలు తీవ్ర అలజడికి దారి తీశాయి. వాటిపై నెలకొన్న వివాదం ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం గురించి ఎంత మాత్రం కాదు. నిజ జీవిత పర్యవసానాలతో కూడిన రాజకీయ ప్రహసనమది. ఆరంభం నుంచి ముగిసే వరకు ఆ నాటకంలోని ప్రతి సన్నివేశం కూడా ద్వేష భావంతో నిండివున్నది.**

తొలుత పాటించిన వైఖరికి విరుద్ధమైన నిర్ణయం తీసుకుంది యూజీసీ. సామాజిక న్యాయం పట్ల ఉదాసీనత చూపే పాలనా వ్యవస్థ ఉన్నత విద్యా సంస్థలలో వివక్షను రూపుమాపేందుకు ఉద్దేశిస్తూ కొత్త నిబంధనలు జారీ చేసింది. ఆ తరువాత ఆ నిబంధనలకు వ్యతిరేకంగా భిన్నాభిప్రాయాన్ని ఉత్పత్తి చేశారు. పాలకులకు విధేయులు అయినవారు తమ సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలకు పూనుకున్నారు. ఆధిపత్యాన్ని చలాయించే వారే తాము వేధింపులకు గురవుతున్నామని ఆక్రోశించారు. అంతిమంగా సర్వోన్నత న్యాయస్థానం రంగప్రవేశం చేసింది. వివక్ష నివారణకు నిబంధనలు రూపొందించి అమలు పరచాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానమే తీరా అవి జారీ అయిన తరువాత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేవనే అభిప్రాయంతో వాటి అమలుపై స్టే విధించింది. యూజీసీ నిబంధనల అమలును సుప్రీంకోర్టు నిలిపివేయడం సాంకేతికంగా ఒక చిన్న విషయమే కావచ్చు. కానీ పౌరులు, ప్రభుత్వం మధ్య రాజ్యాంగంలో పొందుపరచిన ఒక సున్నితమైన సామాజిక ఒప్పందాన్ని ఉల్లంఘించే న్యాయ నిర్ణయమది.

యూజీసీ నిబంధనలపై వివాదం విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో సామాజిక వివక్ష ఉందా లేదా అనే విషయంపై కాదు. ఉందనేది ఒక తిరుగులేని వాస్తవమని ఇటీవలే ప్రచురితమైన ఎన్.సుకుమార్ పుస్తకం Caste Discrimination and Exclusion in Indian Universities : A Critical Reflection ధ్రువీకరించింది. ఆ అంశంపై ప్రస్తుతమున్న సమాచారంతోపాటు తాను స్వయంగా నిర్వహించిన సర్వే, విద్యార్థుల వ్యక్తిగత అనుభవాలు, సంస్థాగతమైన విశ్లేషణల ఆధారంగా ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్ష వ్యవస్థాగతమైనదని సుకుమార్ నిరూపించారు. సంప్రదాయిక కుల పరపతి ఎలా ఆధునిక అవకాశాలకు ఆలంబన అవుతుందన్న విషయమై ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ప్రతిపాదన ఆధారంగా వ్యక్తిగత మేధా విజయాలకు అది దోహదం చేస్తున్న తీరుతెన్నులను సుకుమార్ వివరించారు.

దేశంలోని కొన్ని ఉత్కృష్ట ఉన్నత విద్యా సంస్థలలో దళిత విద్యార్థులు ఏ విధంగా నిందలు, దుర్భాషలనెదుర్కొంటున్నదీ సుకుమార్ పేర్కొన్నారు. అగ్ర కులాలకు చెందిన విద్యార్థులు తమ సహచర విద్యార్థులు అయిన దళిత సామాజికులను 'కోటా సంతానం', 'కేటగిరీ వాలా', 'సర్కారీ దమాద్', 'సర్కారీ బ్రాహ్మిణ్', 'సద్దూస్' లేదా 'బెహెన్జీ' అని, ఇంకా చెప్పలేని మాటల్లో ఎత్తి పొడుస్తుంటారని సుకుమార్ తెలిపారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు, మూల్యాంకనాలు, పరిశోధన పర్యవేక్షణలు, పాలనా వ్యవహారాలు, క్రమశిక్షణా యంత్రాంగాలలో సర్వత్రా కుల ఆధారిత వివక్ష పరివ్యాప్తమై ఉంది. పది విశ్వ విద్యాలయాలలో 600 మంది విద్యార్థిని విద్యార్థులతో నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా సుకుమార్ ఈ వాస్తవాలు వెల్లడించారు. వైవాలు, ఇంటర్వ్యూలలో తాము వివక్షకు గురవుతున్నామని మూడింట రెండు వంతుల మంది విద్యార్థులు వెల్లడించారు. ఆ వివక్షకు ప్రాథమిక కారకులు అధ్యాపకులే అని 60 శాతం మంది విద్యార్థులు నిర్ధారించారు. అంతే శాతం మంది దళిత పరిశోధక విద్యార్థులు తాము పర్యవేక్షణాపరమైన దోపిడీకి గురవుతున్నామని తెలిపారు. మరి ఓబీసీల విషయంలో ఈ వివక్ష ఎలా ఉందని మీరు ప్రశ్నించవచ్చు. మన విశ్వ విద్యాలయాలలో ఆ విద్యార్థుల అనుభవాలు ఆ ఉన్నత విద్యా సంస్థలు ప్రజాస్వామిక నెలవులుగా లేవు అని మాత్రమే స్పష్టం చేస్తున్నాయి.

ఈ వివక్షను అరికట్టేందుకు 2012లో యూజీసీ జారీ చేసిన నిబంధనలను రూపొందించడంలో ఆ సంస్థ సభ్యుడిగా నేనూ పాలు పంచుకున్నాను. ఆ తొలి నిబంధనలను అమలు పరిచేందుకు నిర్దేశించిన సంస్థాగత ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవు. వాటితో పోల్చితే ఇటీవలి కొత్త నిబంధనలు సంస్థాగత

ఏర్పాట్ల విషయంలో చాలా మెరుగ్గా ఉన్నాయి. వివక్షను ఇవి విస్తృత ప్రాతిపదికన నిర్వచించాయి. వేధింపులు, వ్యక్తిగతంగా బాధించడం, వ్యతిరేకత చూపించడం మొదలైనవి కూడా వివక్ష కిందకు వస్తాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రత్యక్ష, పరోక్ష వివక్షలు అన్నిటినీ రూపు మాపడమే కొత్త నిబంధనల లక్ష్యంగా ఉన్నది. కొత్త నిబంధనలు ప్రశస్తమైనవి అనడంలో సందేహం లేదు. సమస్యల్లా వాటిని ఆచరణలోకి తీసుకురావడమే. ఇదిగో, ఈ విషయంలోనే సంకల్పం కొరవడుతోంది. 2012లో యూజీసీ జారీ చేసిన నిబంధనలు కాగితాల మీదనే ఉండిపోయాయి. వాటి గురించి విద్యార్థులకు తెలియనే తెలియదు. మరి 2026లో జారీ అయిన కొత్త నిబంధనల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుందా ?

ఈ వ్యవహారం ఒక న్యాయ వివాదం కాదు. ఒక న్యాయ వివాదంగా అది రూపొందకూడదు. విద్యా సంస్థల్లో వివక్షకు వ్యతిరేకంగా యూజీసీ జారీ చేసిన పాత నిబంధనలు, కొత్త నిబంధనలు రెండూ కూడా రాజ్యాంగం నుంచి స్ఫూర్తి పొంది నవే. 'కులం, సంప్రదాయం, మతం, భాష, జాతి, జెండర్, వైకల్యం' ఆధారంగా ఎటువంటి వివక్ష చూపడానికి వీలు లేదని పాతవీ, కొత్తవీ రెండూ స్పష్టం చేశాయి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు సంభావ్య వివక్ష నుంచి రక్షణ కల్పించాలని పాత నిబంధనలు నిర్దేశించాయి. ఆ సామాజిక వర్గాలకు తోడుగా ఓబీసీలకు అటువంటి రక్షణ కల్పించాలని కొత్త నిబంధనలు పేర్కొన్నాయి. గమనార్హమైన వాస్తవమేమిటంటే 2019లో రోహిత్ వేముల, పాయల్ తాడ్వి (విశ్వ విద్యాలయాలలో వేధింపులు, మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు)ల మాతృమూర్తులు దాఖలు చేసిన ఒక కేసులో సర్వోన్నత న్యాయస్థానం నిర్దిష్ట ఆదేశాల మేరకు కొత్త నిబంధనలను యూజీసీ జారీ చేసింది. జస్టిస్ (ఇప్పుడు సీజెఐ) సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం సెప్టెంబర్ 15, 2025న ఆ ఆదేశాలు జారీ చేసింది. 'విద్యార్థుల పట్ల వివక్ష నివారణకు ఒక కమిటీనేర్పాటు చేయాలని, ఆ కమిటీలో 50 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారే సభ్యులుగా ఉండాలని, కమిటీ చైర్మన్ కూడా ఆ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తే ఉండాల'ని సుప్రీంకోర్టు సిఫారసు చేసింది. ఆ సిఫారసుల మేరకు యూజీసీ కొత్త నిబంధనలు జారీచేసింది. తాము సిఫారసు చేసిన నాలుగు నెలల అనంతరం అదే ధర్మాసనం యూజీసీ జారీ చేసిన కొత్త నిబంధనలు రాజ్యాంగబద్ధంగా లేవంటూ వాటి అమలుపై స్టే విధించింది. ఈ స్టే ఉత్తర్వుల జారీకి సుప్రీంకోర్టు చెప్పిన కారణాలు ఈ తరహా వివక్షల విషయమై సర్వోన్నత న్యాయస్థానం దీర్ఘకాలంగా అనుసరిస్తున్న వైఖరికి అనుగుణంగా లేవని న్యాయశాస్త్ర కోవిదుడు గౌతమ్ భాటియా అభిప్రాయపడ్డారు.

ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను రూపుమాపేందుకు యూజీసీ జారీ చేసిన నిబంధనలపై రగులుతోన్న ఆందోళన నిస్సందేహంగా ఒక రాజకీయ పోరాటం. దానికి కారకులైన వారు తమ అసలు లక్ష్యాలను దాచిపెట్టారు. ఎన్నికలలో విజయాన్ని సాధించిపెట్టే ఒక సామాజిక సంకీర్ణాన్ని భారతీయ జనతా పార్టీ నిర్మించుకున్నది. తన ప్రధాన ఓటు బ్యాంకు అయిన అగ్రకులాల హిందువులను సంఘటితపరచడంతోపాటు హిందూ సమాజంలోని మిగతా సామాజిక వర్గాలపై గణనీయమైన పట్టు సాధించడం ద్వారా ఆ సామాజిక సంకీర్ణం సాధ్యమయింది. ఆ క్రమంలో కింది స్థాయి హిందూ సామాజిక వర్గాలు అయిన దళితులు, బహుజనులకు పలు రాజకీయ, ఆర్థిక రాయితీలు కల్పించింది. కుల గణన డిమాండ్‌ను ఆమోదించడం వాటిలో ఒకటి.

తమ రాజకీయ అధికారాన్ని, ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు దళిత, బహుజనులకు అటువంటి రాయితీలు కల్పించడం తప్పనిసరి అని బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకు అయిన అగ్రకులాల హిందువులు భావించారు, సహించారు. ఎన్నికలలో బీజేపీ వరుసగా తిరుగు లేని విజయాలు సాధిస్తూ వస్తోంది. ఎడతెగని ప్రచారోధృతితో తన భావజాలానికి విస్తృత ఆమోదాన్ని సాధిస్తోంది. ఈ కారణంగా దళితులు, బహుజనులకు ఇస్తోన్న రాయితీలు అనవసరమని, అవి ఇవ్వకపోయినా తమ రాజకీయ ఆధిపత్యానికి సవాళ్లు ఎదురుకావనే సునిశ్చిత విశ్వాసానికి బీజేపీ మద్దతుదారులు అయిన అగ్రకులాల హిందువులు వచ్చారు. ఏది ఎలా జరిగినప్పటికీ ఓబీసీలకు కల్పిస్తున్న ప్రయోజనాల విషయమై అగ్రకులాల హిందువులకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయి. ఫలితంగా బీజేపీ నిర్మించిన సామాజిక సంకీర్ణం బీటలు వారడం ప్రారంభమైంది. ఈ విచ్ఛిన్నాన్ని, లేదా అనైక్యతను దాచిపెట్టేందుకు బీజేపీ చాలా కష్టపడుతోంది. భారత రాజ్యాంగం ప్రవచించిన సామాజిక న్యాయ భావనపై ప్రచ్ఛన్న దాడులు జరుగుతున్నాయి. యూజీసీ నిబంధనలు అందుకొక సందర్భం మాత్రమే. ఆ అవకాశాన్ని సామాజిక న్యాయ వ్యతిరేక శక్తులు ఉపయోగించుకున్నాయి. వాటి అసలు లక్ష్యం రిజర్వేషన్ల సదుపాయాన్ని పూర్తిగా కూల్చివేయడమే. వివిధ రంగాలలో ఓబీసీల పురోగతి ఆ శక్తులకు తొట్రుపాటు కలిగిస్తోంది. కులగణన డిమాండ్ ఆ శక్తులను కలవరపరు స్తోంది. ఫలితంగానే యూజీసీ నిబంధనలపై వివాదం నెలకొన్నది. ఈ వివాదంతో తమ రాజకీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి కృతనిశ్చయంతో ఉన్నవారు, రాజకీయ అధికారాన్ని సాధించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారి మధ్య ఒక సామాజిక సమరం పునః ప్రారంభమయింది. ఈ పోరాటం మన రిపబ్లిక్ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది. ❑ **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# రెండు దేశాల భారత్



- మల్లేపల్లి లక్ష్మయ్య

**ఒక వైపు గిడ్డంగుల్లో ఆహారధాన్యాలు పుచ్చిపోతాయి. మరోవైపు పేద జనపు డొక్కలు తిండిలేక మాడిపోతాయి. ఒకవైపు సంపద పోగుపడి బిలియనీర్ల సంఖ్య ఎగబాకుతుంటుంది. ఆ పక్కనే మరికొన్ని కోట్ల పేదల ఆదాయం పడిపోయి, పేదరికం పెరిగిపోతుంటుంది. క్షీరసాగర మథనంలో కొందరికే అమృతం దక్కినట్టు స్వాతంత్ర్య ఫలాలు కొందరికే దక్కాయి. దేశం పేదది కాకపోయినా దేశంలో ఇంకా పేదవాళ్లున్నారు. విలువలకు పేరున్న దేశమైనా కులాల అసమానతలు న్నాయి. అందుకే ఈ దేశంలోని వైవిధ్యాలనే కాదు, వైరుద్ధ్యాల నూ తరచి చూసుకోవాలి. జనాల మధ్య అంతరాలను తగ్గించ డం ద్వారానే ఈ దేశాన్ని ఒక్కటిగా చేయగలం అని గుర్తించాలి.**

క్షీర సాగర మథనం. సముద్రం నుంచి అమృతాన్ని వెలికి తీసేందుకు ఇటు రాక్షసులు, అటు దేవతలు రెండు వర్గాలు కలిసి శ్రమించి, మంధర పర్వతంతో సముద్రాన్ని మథిస్తారు. అందులోంచి అనేక విశిష్ట వస్తువులు, మనుషులు, జంతువులు, అనంతరం విషం, చిట్టచివరకు అమృతం వచ్చాయి. ఇది అందరికీ తెలిసిన కథే కావొచ్చు. కానీ నేడు ఇదే అత్యంత సందర్భోచితమైన అంశం. ఏ అమృతం కోసమైతే ఇరు వర్గాలు సమంగా శ్రమించాయో, దాని ఫలితాలు మాత్రం ఇరు పక్షాలకీ సమంగా అందలేదు. చావును శాశ్వతంగా తరిమికొట్టే అమృతాన్ని దేవతలు చేజిక్కించుకుని, మరొక వర్గానికి మత్తులో ముంచెత్తే సురాపానం అంటగట్టారు. దేవతలు కదా ఏం చేసినా చెల్లుతుంది. మరో వర్గం కూడా అంతే శ్రమించినప్పటికీ అసలు ఫలితం దక్కక పోవడం కథలోని సారాంశం. అమృతం అందుకున్న వర్గం మరింత శక్తితో తమ ఆధిపత్యాన్ని నిలుపుకొంటూనే వచ్చింది. మరొక వర్గం కాలక్రమేణా దాడులకూ, దౌర్జన్యాలకూ గురై క్షీణించింది లేదా అధికారగణం చేతిలో బానిసలుగా మారిపోయింది.

అసలు విషయానికొద్దాం. భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి కావస్తోంది. మన భారత ప్రభుత్వం ఈ సంద ర్భాన్ని 'అమృత్ మహోత్సవ్' పేరుతో ఘనంగా సెలబ్రేట్ చేసుకోవా లని నిర్ణయించింది. అందుకుగానూ గతేడాది మార్చి 12 నుంచి వచ్చే సంవత్సరం అంటే ఆగస్టు 15, 2023 వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈ ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య ప్రయాణంలో పాల్గొన్న ప్రజలందరికీ ఈ ఉత్సవాలను అంకితం చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

75 ఏళ్ల ఉత్సవాలు కాబట్టి అమృత్ మహోత్సవ్ అనే పేరు పెట్టారు కానీ, సరిగ్గా సరిపోయింది అది. అమృతం కోసం సాగర మథనంలో పాల్గొన్న అందరికీ అమృతం అందనట్టే స్వాతంత్ర్య ఫలాలు సైతం కొందరికే దక్కాయన్న విషయానికి ఈ పేరు సరిగ్గా సరిపోతుంది. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య పాలన మన దేశ ప్రజలకు అందించింది ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అణచివేత. గత 75 ఏళ్ళలో జరిగిన ఆర్థికాభివృద్ధి, సమకూరిన సంపద, అతికొద్ది మంది సంపన్నుల, ఆధిపత్య వర్గాలకే వెళ్ళిపోయింది. సమాజంలో సంపద సమష్టిగానే వృద్ధి చెందుతుంది. కానీ ఫలితాలు అందరికీ అందడంలో మాత్రమే తేడా ఉంటుంది.

మన దేశంలోని కేవలం వంద మంది కోటీశ్వరులు 57 లక్షల కోట్ల రూపాయల ధనాన్ని కలిగివున్నారని గ్లోబల్ రిపోర్టు తెలియజేసింది. అంటే ఇది భారతదేశ రెండు సంవత్సరాల ఆర్థిక బడ్జెట్కు సమానమని గుర్తించాలి. అదేవిధంగా 50 శాతం మంది జనాభా కేవలం 6 శాతం సంపదను కలిగి ఉన్నారు. అంతేకాకుండా కేవలం ఒక సంవత్సరంలోనే, అది కూడా కోవిడ్ సమయంలోనే 102 మందిగా ఉన్న కోటీశ్వరులు (బిలియనీర్స్) 142కి పెరిగారు. మార్చి 2020 నుంచి, నవంబర్ 30, 2021 వరకు 23 లక్షల కోట్లు ఉన్న కోటీశ్వరుల సంపద 57.3 లక్షల కోట్లకు చేరినట్టు లెక్కలు చెబుతున్నాయి. అదే విధంగా కోవిడ్ సమయంలోనే ఇప్పటి వరకు ఉన్న పేదలకు అదనంగా, 4.6 కోట్ల మంది పేదరికంలోకి దిగజారి పోయారు.

అదేవిధంగా భారతదేశానికి మరొక అవలక్షణం ఉన్నది. అదే కులం. భారత దేశంలో సమకూరిన సంపద కూడా కొన్ని కులాలకే పరిమితమైపోయింది. ఇదే విషయాన్ని నితిన్ కూర్ బర్తి అనే విద్యావేత్త, 1961 నుంచి 2021 వరకు చేసిన అధ్యయనంలో కులాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు ఉన్నాయనీ,

మన దేశంలో ఉన్న ఆధిపత్య కులాలు ఆదాయంలోనూ ఖర్చులోనూ మిగిలిన కులాలకన్నా ముందు వరుసలో ఉన్నాయనీ తేల్చారు. 'వెల్త్ ఇన్ ఈక్వాలిటీ క్లాస్ అండ్ కాస్ట్ ఇన్ ఇండియా - 1962-2021' అన్న ఈ పరిశోధనా పత్రాన్ని ఆయన ప్యారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు 2018లో సమర్పించారు. 2011లోని ఎన్ఎఫ్‌హెచ్ఎస్ డేటా ప్రకారం, ఒక ఎస్సీ కుటుంబానికి ఒక సంవత్సర ఆదాయం 89 వేలు ఉంటే, ఎస్టీ కుటుంబ వార్షికాదాయం 75 వేలు ఉంది. ఓబీసీల్లో ఇది ఒక లక్షా నాలుగు వేలు. ఇక ఆధిపత్య కులాల్లో ఇది లక్షా 64 వేలు అని నితిన్ తేల్చారు. సంవత్సర ఖర్చు ఎస్సీల్లో 87 వేలు, ఎస్టీల్లో 72 వేలు, ఓబీసీల్లో లక్షా ఎనిమిది వేలు, అగ్ర కులాల్లో లక్షా 46 వేలుగా ఆయన లెక్కలు గట్టారు. సాధారణ ప్రజల్లోను ఆర్థిక వ్యత్యాసాలు చాలా ఎక్కువగానే ఉన్నట్టు మనకు ఈ లెక్కలు చెబుతున్నాయి. వీటితో పని లేకుండానే ఏ గ్రామం వెళ్లినా ఈ తేడాలు మనకు వీధుల్లో దర్శనమిస్తాయి. దళిత కుటుంబాల్లో, వారి ఇళ్లల్లో ఈ విషయాలు అత్యంత స్పష్టంగా మనం గమనించొచ్చు. ఇదే విషయం ఇటీవల మరొక సర్వేలో తేలింది. క్రానిక్ పావర్టీ రీసెర్చ్ సెంటర్ ద్వారా జరిగిన పరిశోధన ద్వారా ఇదే విషయం అక్షరసత్యమని రుజువయ్యింది. పేదరికం అనేది తరతరాలుగా వస్తున్న వారసత్వంగా కొందరికి మారిపోయిందని ఆ సంస్థ నిర్వహించిన సర్వే నిగ్గు తేల్చింది. ఇది భారతదేశానికే పరిమితమైన పరిణామంగా ఆ సంస్థ పేర్కొన్నది. ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలు, దళితవాడలు, ఆ వర్గాలకు చెందిన ప్రజలు పేదలుగానే పుట్టి, పేదలుగానే మరణిస్తూ, తమ పిల్లలకు సైతం పేదరికాన్నే వారసత్వంగా ఇచ్చి వెళుతున్నారని ఈ పరిశోధన అభిప్రాయపడింది.

ప్రపంచంలో వంద మంది పేదలుంటే అందులో 28 మంది మనదేశంలోనే ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. ఆకలితో అలమటించే భారతదేశ ప్రజల సంఖ్య తక్కువేమీ కాదు. ఐక్యరాజ్యసమితిలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అధ్యయనం ప్రకారం 18 కోట్ల మంది ఇంకా సరైన ఆహారం కూడా అందని స్థితిలో బతుకులీడుస్తున్నారని 2020 నివేదికలో పేర్కొన్నారు. ఇంకా మహిళల్లో ఆకలి బాధ తీవ్రస్థాయిలో ఉన్నట్టు కనిపిస్తోంది. 15 నుంచి 49 ఏళ్ల వయసు ఉన్న మహిళల్లో దాదాపు 51 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో 35 శాతం మంది సరైన ఎదుగదలను కలిగిలేరు. ప్రపంచ ఆకలి సూచీలో 116 దేశాల్లో మన ర్యాంకు 101 అని తేల్చారు.

మన దేశంలో ఆహార ధాన్యాల కొరత ఉన్నదనుకుంటే పొరపాటే. బియ్యం, గోధుమల ఉత్పత్తిలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించింది. భారత రైతాంగం కష్టపడి పండించిన ఈ ధాన్యమంతా ఎఫ్‌సీఐ గోదాముల్లో పడి మూలుగుతోంది. కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ఇచ్చిన లెక్కల ప్రకారం, గడచిన ఐదేళ్లలో 38 వేల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు పుచ్చి, పురుగుల పాలయ్యాయి. 2021 డిసెంబరు నాటికి 213 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, 378 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు నిల్వ ఉన్నాయి. కానీ ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య భారతావనిలో ఇంకా ప్రజలు ఆకలితో అలమటిస్తూనే ఉన్నారు. వరి, గోధుమల లాంటి ఆహారధాన్యాలు పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేదు. ఆకలితో కాలే కడుపునకు పిడికెడు అన్నం లేదు. ఇది భారత దేశ అమృతోత్సవ సంబరాల సత్యాలు. భారత దేశంలో క్షీరసాగర మథనం లాంటి సంప్రదాయాలే మనకు ఆద ర్శాలు. ఒక వైపు సంపద, మరోవైపు పేదరికం, ఒకవైపు ఆహార ధాన్యాల నిల్వలు పుచ్చిపోతోన్న స్థితి, మరోవైపు ఆకలితో మలమల లాడే కడుపులు. ఇన్ని సాక్ష్యాలున్నా ఇంకా మనది సమైక్య భారతమని అందామా? ముమ్మాటికీ అనలేం. ఇది వైరుధ్య భారతం. ఇక్కడ ఒక్క భారతం లేదు. ఇవి రెండు భారతాలు. ఇంకా చెప్పాలంటే మరెన్నో భారతాలు. నిజానికి ఈ దేశం పేదది కాదు. ప్రజలే పేదవాళ్లు. ఈ వైరుధ్యాలు ఇప్పటికైనా మనకు అర్థం కాకపోతే, పరిణామాలు ఎవరూ ఊహించలేరు. అమృతోత్సవాలు జరపడం కాదు, అందరికీ అమృతం అందించే గుణం కావాలి. ❑ **(సాక్షి సౌజన్యంతో)**

# ప్రజాస్వామ్యం : విస్తరణ దశలోని సంక్షోభాలు

**(9వ పేజీ తరువాయి)**

గౌరవించడం, మెజారిటీ-మైనారిటీ మధ్య సమతుల్యతను కాపాడటం వంటి ప్రజాస్వామిక పని పద్ధతులను ఆచరణలో నేర్చుకుంటారు. అంటే **ప్రజాస్వామ్యం పోరాటాల్లోనే శిక్షణ పొందుతుంది ; ఉద్యమాలే దానికి పాఠశాలలు.** అందువల్ల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం అంటే కేవలం ఎన్నికల వ్యవస్థను రక్షించడం కాదు. ప్రజలు తమ జీవన సమస్యలకు సంబంధించిన ఆర్థిక, సామాజిక పోరాటాల్లో చురుకుగా భాగస్వాములు కావడమే అసలైన ప్రజాస్వామిక ఆచరణ. అలాంటి పోరాటాల ద్వారానే ప్రజలు మౌన ప్రేక్షకులుగా కాకుండా చైతన్యవంతులైన పౌరులుగా మారుతారు. **ప్రజలు ప్రశ్నించడం మానేసినప్పుడు ప్రజాస్వామ్యం ఖాళీ నిర్మాణంగా మారుతుంది; ప్రజలు సంఘటితంగా పోరాడినప్పుడు మాత్రమే అది బలపడుతుంది, లోతుగా మారుతుంది. కాబట్టి ప్రజా స్వామ్యం బతకాలంటే ప్రజల ఆర్థిక-సామాజిక పోరాటాలు కొనసాగాలి.** ఆ పోరాటాల్లోనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది బలపడుతుంది, కాపాడబడుతుంది. ❑

# సామాజిక న్యాయమేదీ ?



- సంపతి రమేష్ మహారాజ్

సామాజిక న్యాయం అంటే.. సమాజంలోని సంపద, అవకాశాలు, హక్కులు, అధికారాలను అందరూ సమానంగా పొందడం. కానీ, వాస్తవంగా మెజారిటీ ప్రజలకు సమాన అవకాశాలు దక్కడం లేదు. దీంతో ప్రజల్లో అభద్రతా భావం పెరిగి నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సంఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజలకు సమాన అవకాశాలు దక్కి, సంపద పంపిణీ జరిగినప్పుడే సామాజిక న్యాయం చేకూరు తుంది. అప్పుడే జాతి, మతం, లింగం, ఆర్థిక నేపథ్యం ఆధారం గా ఎదుర్కొంటున్న వివక్ష దూరమవుతుంది. ప్రజలందరూ ఆత్మ గౌరవంతో జీవించే అవకాశం ఏర్పడుతుంది.

ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ఫిబ్రవరి 20న నిర్వహిస్తోంది. చట్టపరంగా ఎలాంటి వివక్ష, తారతమ్యం లేకుండా ప్రజలందరికి సమన్యాయం జరగాలని 2007 నుంచి ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ ఏడాది 'సమ్మిళిత సాధికారత. సామాజిక న్యాయం కోసం అంతరాలను తగ్గించడం' అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నాం. ప్రస్తుత ఆధునిక సమాజంలో దేశాల మధ్య, ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య రోజురోజుకూ అంతరాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా దేశాల మధ్య అంతర్యుద్ధాలు, సంక్షోభాలు, ప్రకృతి విపత్తులు, డిజిటల్ డివైడ్, మానవ హక్కుల ఉల్లంఘనలతో సామాజిక న్యాయం అందని ద్రాక్షగానే మిగిలి పోతుంది. పట్టణీకరణ, పారిశ్రామీకరణ, ప్రపంచీకరణతో ప్రపంచదేశాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నప్పటికీ.. సమాజంలో తరాలు తొలగిపోవడం లేదు. కనీస అవసరాలు కూడా నోచుకొని ప్రజలు ఇంకా ఉన్నారు. పేదరికం, ఆకలి, నిరుద్యోగం, లింగ వివక్ష వంటి అసమానతలు సమాజంలో వేళ్లూనుకొని ఉన్నాయి. వీటిని నిరూలించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు గండి సామాజిక న్యాయం సాధించడానికి రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చినప్పటికీ ఇంకా వాటి లక్ష్యం సంపూర్ణంగా నెరవేరడం లేదు. అన్నివర్గాలు సమానంగా పొందడం లేదు. ప్రైవేటీకరణతో రిజర్వేషన్ వ్యవస్థకు గండిపడుతున్నది. ప్రభుత్వాలు ప్రజలను ఉచితాలతో మభ్యపెడుతున్నారు తప్ప, సాధికారత వైపు తీసుకుపోవడం లేదు.


ఇటీవల భారత సర్వోన్నత న్యాయస్థానం సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఉచితాలు కాదు ప్రజలకు ఉపాధి కల్పించి సాధికారత వైపు నడిపించాలని పేర్కొన్నది. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలు రాజ్యాంగం అమల్లోకి వచ్చే వరకు సమానత్వానికి ఆమడదూరంలోనే ఉన్నారు. ఆనాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయకోసం చేసిన పోరాటం కోట్లాది ప్రజల విముక్తికి దారితీసింది. ఇప్పటికీ సామాజిక న్యాయం కోసం అనేక ఉద్యమాలు వస్తున్నాయి. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో తమ వాటా కోసం దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలు ఉద్యమాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు వీటిని గుర్తించి న్యాయం చేసినప్పుడే ప్రజల జీవితంలో మార్పు వస్తుంది

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలి. పౌరులందరికీ సమాన అవకాశాలు అందాలని ఉద్ఘాటిస్తూ భారత రాజ్యాంగం సామాజిక న్యాయానికి పట్టం కట్టింది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు పౌరులందరికీ సమానంగా వర్తిస్తాయి. విద్య, ఉద్యోగాల్లో బడుగు, వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం 1989 సామాజిక న్యాయ సాధనకు గొప్ప పునాది. మహిళలు, బాలలు, వృద్ధులు, వికలాంగుల సంరక్షణకు అనేక చట్టాలను తీసుకురావడం జరిగింది. ఇవి క్షేత్రస్థాయిలో ఆశించిన రీతిలో అమలుకు నోచుకోవడం లేదు. బాలలకు ఉచిత విద్యను అందించటానికి విద్యా హక్కు చట్టం (2009) సైతం సామాజిక న్యాయ సాధనలో భాగమే. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు విద్యాసంస్థలు 25% సీట్లు కేటాయించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది.

కాని అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. భౌగోళిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అసమానతలకు తావు లేకుండా చూడాలి. సంపన్నుల సంపదపై కన్నా, సామాన్య, మధ్యతరగతి వర్గాల ఆదాయంపై ఎక్కువగా పన్నులు విధించడం సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధం. పన్ను విధింపులో పేదలను తప్పించాలి. విద్య, వైద్య సౌకర్యాలు విస్తరించి పేద, అణగారిన వర్గాలు, స్త్రీల, బాలల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి. బడ్జెట్‌లో వైద్యంపై 3 శాతం, విద్యకు 6 శాతం నిధులను కేటాయించాలి. శాసన, కార్యనిర్వహణ, న్యాయ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయడం అత్యావశ్యకం. కోర్టులు ఇచ్చే తీర్పులు, శాసన వ్యవస్థ చేసే చట్టాలు సామాజిక న్యాయానికి చోదక శక్తులు కావాలి. వాటిని పకడ్బందీగా అమలు చేసే బాధ్యతను ప్రభుత్వ **(మిగతా 26వ పేజీలో)**

# సామాజిక పరిణామ క్రమంలో స్త్రీ - అంబేద్కర్ విశ్లేషణ

- అనూరాధ.బి



అంబేద్కర్ రచనలు, ప్రసంగాలలో వివిధ సందర్భాల్లో సమాజాన్ని గురించి, స్త్రీల గురించి ఎన్నో విషయాలు ప్రస్తావించారు. ముఖ్యంగా 'కులాల పుట్టుక' గురించి, 'బౌద్ధ మతం' గురించి, బౌద్ధ మతంపై జరిగిన 'ప్రతీఘాతుక విప్లవం' గురించి 'బ్రాహ్మణ మత విజయం' గురించి రాసిన సందర్భాలను అధ్యయనం చేస్తే వాటి ఆధారంగా భారత సమాజ పరిణామ క్రమాన్ని విశ్లేషించడానికి అంబేద్కర్ ఉపయోగించిన ప్రాతిపదికలను, స్త్రీల పరిస్థితులను గురించి రాసిన విషయాలను అర్థం చేసుకోవచ్చు. ముందుగా అంబేద్కర్ సమాజ పరిణామక్రమాన్ని విశ్లేషించడానికి ఉపయోగించిన ప్రాతిపదికలను చూద్దాం.

- మతం ఆధారంగా సామాజిక దశలను గుర్తించడం.
- భారత దేశానికే ప్రత్యేకమైన వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థల ఆధారంగా సామాజిక పరిస్థితిని విశ్లేషించడం.
- ఆయా సమాజాలలోని శాస్త్రకారులూ, స్మృతి కారుల రచనల ద్వారా శూద్రులూ, మహిళల పరిస్థితిని అంచనా వేయడం.

**మతం ఆధారంగా గుర్తించిన సామాజిక దశలు :**

"చారిత్రకంగా చూసినపుడు భారత సమాజాన్ని మూడు భాగాలుగా అర్థం చేసుకోవచ్చు అని కూడా ఒక సందర్భంలో అంటారు అంబేద్కర్. అవి 1.బ్రాహ్మణవాద భారతదేశం, 2.బౌద్ధ భారతదేశం, 3.హిందూ భారత దేశం". అయితే ఇక్కడ ప్రత్యేకంగా స్త్రీల గురించి మాట్లాడుతున్నాం కాబట్టి కూడా అంబేద్కర్ రచనలు, ప్రసంగాల్లోని ప్రస్తావించిన అంశాల ఆధారంగా మనం ఇక్కడ 4 దశలలో స్త్రీల పరిస్థితి గురించి మాట్లాడుకుంటాం. అవి 1. వేదకాలంలో స్త్రీల పరిస్థితి 2. కౌటిల్యుని కాలంలో స్త్రీల పరిస్థితి, 3. బౌద్ధ కాలంలో స్త్రీల పరిస్థితి 4. బౌద్ధానంతర కాలంలో స్త్రీల పరిస్థితి.

**వర్ణ-కుల వ్యవస్థలపై అంబేద్కర్ విశ్లేషణ :**

"హిందూ సమాజం అన్ని సమాజాల మాదిరిగానే వర్గాలతో ఏర్పడినదనే విషయాన్ని ముందు మనం గుర్తుంచుకోవడం చాలా అవసరం. అవి ఏమంటే 1 బ్రాహ్మణులు లేదా పురోహిత వర్గం 2 క్షత్రియులు లేదా యోధవర్గం 3 వైశ్యులు లేదా వాణిజ్య వర్గం 4. శూద్రులు లేదా చేతి పనివారు, సేవక వర్గం. ఇది ప్రధానంగా వర్గ వ్యవస్థ. ఇందులోని వ్యక్తులు అర్హత కలిగిన వారైతే వర్గాలు మార్చుకోవచ్చు. ఆ విధంగా వర్గాలు తమ సిబ్బందిని మార్చుకుంటూ ఉండేవన్న వాస్తవం పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలి". మరో మాటలో చెప్పాలంటే "వర్ణవ్యవస్థ వర్గ వ్యవస్థగా ఉంది. వర్ణాలు కులాలు రెండు ఒక వ్యక్తి హోదాని, వృత్తిని సూచిస్తాయి. అయితే వర్ణవ్యవస్థలో ఈ హోదా, వృత్తి వంశపారంపర్యం కాదు. ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారు ఆ వర్గంలో లేదా ఆ వర్ణంలో ఉండేవారు వారి హోదాని, వృత్తిని గురుకులాలలోనే వారి గురువులు నిర్ణయించేవారు. కానీ వర్ణాలు కులంగా మారిన తర్వాత ఇవి వంశ పారంపర్యం అయ్యాయి వారి హోదాని ఇక గురువుల నిర్ణయించే పద్ధతి కాకుండా ఒక వ్యక్తి తండ్రి నుంచి కొడుకుకు వంశపారం పర్యంగా లభించేది"

## వేద కాలంలో స్త్రీల పరిస్థితి :

(క్రీస్తు పూర్వం 1500-500 వరకూ అనుకోవచ్చు.) "బ్రహ్మచర్యాన్ని ముగించి వివాహానికి సిద్ధమైన యువతి ఉపనయనానికి అర్హురాలనే విషయం అథర్వణ వేదంలో స్పష్టంగా ఉంది. స్త్రీలు మంత్రాలు జపించవచ్చని స్త్రీలకు కూడా వేదాలు చదవడం నేర్పారని శ్రౌత సూత్రాలలో స్పష్టంగా ఉంది. స్త్రీలు గురుకులాలలో విద్య నేర్చారని వేదాలలోని వివిధ శాఖల ను అధ్యయనం చేసి మీమాంసలో(వ్యాఖ్యానం) ఆరితేరారు అనడానికి పాణిని రచించిన అష్టాధ్యాయ ఒక సాక్ష్యం. పతంజలి రచించిన మహాభాష్యంలో విద్యార్థినులకు గురువులుగా మహిళలే వేదాలు బోధించారని పేర్కొన్నాడు. మతం, తత్వ శాస్త్రం, అధిభౌతిక శాస్త్రం వంటి సంక్లిష్ట విషయాలపై స్త్రీలు పురుషులతో బహిరంగ చర్చల్లో పాల్గొన్న ఉదంతాలు కోకొల్లలు. జనకుడు-సులభల మధ్య, యాజ్ఞవల్కుడు-గార్గిల మధ్య, యాజ్ఞవల్కుడు-మైత్రేయిల మధ్య, శంకరాచార్య-విద్యాధరిల మధ్య జరిగిన బహిరంగ వాగ్వివాదాలు మనువుకు ముందు కాలంలో స్త్రీలు విద్య, అధ్యయనాలలో అత్యున్నత శిఖరాలను అధిరోహించారని తెలియజేస్తున్నాయి.

ఒకప్పుడు స్త్రీలను అత్యున్నతంగా గౌరవించారనటంలో సందేహం లేదు. ప్రాచీన భారతదేశంలో మహారాజు పట్టాభిషేక సమయంలో ప్రముఖ పాత్ర వహించిన పత్నులలో రాణి కూడా ఒకరు. ఇతరులకు అర్పించినట్టే రాజు రాణికి కూడా పూజలు అర్పించేవాడు. రాణికే కాకుండా పట్టాభిషిక్తుడు అవుతున్న రాజు కింది కులాలకు చెందిన తన ఇతర భార్యలకు పూజలు అర్పించే వాడు. పట్టాభిషేకం పూర్తయ్యాక తన శ్రేణులలోని ముఖ్య నాయకుల భార్యలకు కూడా నమస్కరించే వాడు"

## కౌటిల్యుని కాలంలో స్త్రీల పరిస్థితి :

"క్రీస్తుపూర్వం 642లో బీహార్‌లో మగధ స్థాపన భారతదేశ రాజకీయ చరిత్రలో తొలి మైలురాయిగా చెప్పవచ్చు. శిశు నాగ పేరుతో ప్రసిద్ధుడైన మగధ రాజ్య స్థాపకుడు ఆర్యేతర నాగజాతికి చెందినవాడు. మగధ సామ్రాజ్యం ప్రారంభంలో చిన్నదే అయినా ఆ తర్వాత శిశునాగ వంశీయులు దాన్ని బాగా అభివృద్ధి చేశారు. నాగ వంశీయుల పాలన క్రీస్తు పూర్వం 413 దాకా కొనసాగింది. తర్వాత నందులు మగధ సామ్రాజ్యాన్ని క్రీస్తు పూర్వం 322 వరకు పరిపాలించారు. తర్వాత మౌర్య వంశ స్థాపకుడైన చంద్రగుప్తుడు చివరి నందరాజుని పదవీచ్యుతుని కావించాడు. చంద్రగుప్తుడు శిశు నాగవంశంలో చివరి పాలక చక్రవర్తి కుటుంబానికి చెందినవాడు. ఆ రకంగా చంద్రగుప్తుడు మగధ నాగ సామ్రాజ్య పునస్థాపన చేశాడని చెప్పవచ్చు"

ఈ చంద్రగుప్తుని ఆస్థానంలోని ఆర్థికవేత్త చాణుక్యుడు లేదా కౌటిల్యుడు. కౌటిల్యుడు స్త్రీలకి సంబంధించిన అనేక చట్టాలు చేశాడు. ఈ విషయాలను బట్టి, ఆర్యేతరులు రాజ్యం స్థాపించి పాలించిన కాలంలో స్త్రీల పరిస్థితి సాపేక్షికంగా మెరుగైనది గానూ, స్వేచ్ఛగానూ ఉందని అంబేడ్కర్ కౌటిల్యుని రచనల నుండి విశేషంగా ఉటంకిస్తారు.

"కౌటిల్యుని కాలంలో స్త్రీలు 12 ఏళ్లకు, పురుషులు 16 ఏళ్లకు వయస్కులు అయినట్టుగా పరిగణించేవారు. వయస్కులయ్యే వయసు అంటే వివాహ యోగ్యమైన వయసు అనే అనుకోవాలి. వివాహాలు రజస్వల అయిన తరవాతే జరిగేవనేది బౌద్ధాయనుల 'గృహ్య సూత్రాల' నుండి స్పష్టం అవుతోంది. అందులో వివాహ సమయంలో వధువుకు రుతుక్రమం వస్తే అనుసరించవలసిన ప్రాయశ్చిత్త పద్ధతుల గురించి ప్రస్తావన ఉంది.

'ఏ వ్యక్తి అయినా అమ్మాయికి వివాహ పూర్వమే వేరొకరితో శారీరక సంబంధం కలిగి ఉన్నదన్న విషయాన్ని చెప్పకుండా ఆమెకు వివాహం చేస్తే అతనికి దండుగ విధించడమే కాకుండా అతను వధువు తరఫున పుచ్చుకున్న శుల్కం, స్త్రీ ధనాన్ని కూడా తిరిగి ఇవ్వాలి. అలాగే తన వైపు దోషాలను బయట పెట్టకుండా వివాహం చేసుకున్న అబ్బాయి రెట్టింపు దండగ చెల్లించడమే కాకుండా అతను చెల్లించిన కన్యాశుల్కం స్త్రీ ధనం కూడా కోల్పోతాడు.

రజస్వల అయిన మూడేళ్ల వరకూ అవివాహితగా ఉన్న ఒకే కులానికి, శ్రేణికి చెందిన కన్యతో సంబంధం పెట్టుకోవడం నేరం కాదు. అలాగే రజస్వల అయిన మూడేళ్ల వరకు కన్యగా ఉండి తన శరీరంపై ఆభరణాలు లేని వేరే కులానికి చెందిన యువతితో సంబంధం కలిగి ఉండడం తప్పు కాదు. కౌటిల్యుడు ఏకపత్నీత్వాన్ని సమర్ధిస్తాడు. పురుషులు కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ఒకరికంటే ఎక్కువ భార్యలను కలిగి ఉండొచ్చు. ఆ సందర్భాలను కౌటిల్యుడు ఈ విధంగా వివరిస్తాడు. 'ఒక స్త్రీ ప్రాణం ఉన్న పిల్లల్ని కనలేకపోయినా లేదా మగ పిల్లవాడు కలగకపోయినా లేక గొడ్రాలైనా ఆమె భర్త మరో వివాహం చేసుకోవడానికి కనీసం ఎనిమిదేళ్లపాటు ఆగాలి. ఆమె విగత జీవికి జన్మనిస్తే పదేళ్లపాటు ఆగాలి. ఆడపిల్లల్ని మాత్రమే కంటే పన్నెండేళ్ళపాటు ఆగాలి. అప్పటికీ మగపిల్లలు కావాలనుకుంటే మరో వివాహం చేసుకోవచ్చు. ఈ నియమాలను ఉల్లంఘించిన పక్షంలో ఆమెకు శుల్కం స్త్రీ ధనం మాత్రమే కాకుండా తగినంత పరిహారం ధన రూపంలో చెల్లించాలి. అంతేకాకుండా 24 పనల దండుగను ప్రభుత్వానికి చెల్లించాలి. వివాహ సమయంలో శుల్కం స్త్రీ ధనం పొందని స్త్రీలకు కూడా అది చెల్లించి తన భార్యలకు తత్సమానమైన పరిహారాన్ని, తగినంత పోషణ సొమ్మును చెల్లించిన పక్షంలో అతను ఎందరినైనా వివాహం చేసుకోవచ్చు. ఎందుకంటే స్త్రీలను సృష్టించిందే కొడుకులను కనడానికి.

కౌటిల్యుని కాలంలో స్త్రీలు పరస్పర ద్వేషం, అసహ్యం

కారణాలతో విడాకులు పొందవచ్చు. భర్తని ద్వేషించే ఒక స్త్రీ అతని ఆమోదం లేకుండా వివాహాన్ని రద్దు చేయడానికి వీలు లేదు. అలాగే భార్య అనుమతి లేకుండా భర్త వివాహాన్ని రద్దు చేయలేడు. కానీ పరస్పరం ద్వేషించుకొనే వారి విషయంలో విడాకులు పొందవచ్చు. భార్య నుంచి ప్రమాదాన్ని శంకించి విడిపోదలచుకున్న పురుషుడు వివాహ సమయంలో ఆమెకు ఇచ్చినవన్నీ ఆమెకు చెల్లించాలి. ఒకవేళ భర్త నుంచి ప్రమాదాన్ని శంకించి భార్యతో విడిపోదలుచుకున్న స్త్రీ ఆమెకు చెందే ఆస్తిపై హక్కులను కోల్పోతుంది. చెడు ప్రవర్తన ఉన్న భర్తను ఆమె వదిలి వేయవచ్చు.

కౌటిల్యుని కాలంలో ఒక స్త్రీ గాని వితంతువు గాని పునర్వివాహం చేసుకోవడంపై నిషేధం లేదు. "ఒక స్త్రీకి భర్త చనిపోయినప్పుడు ఆమె పవిత్ర జీవితం గడపదలచుకుంటే ఆమెకు ఒకేసారిగా ఆమె మాన్యం, ఆమె ఆభరణాలు మాత్రమే కాకుండా ఆమెకు చెల్లించవలసిన శుల్కం వెంటనే ఇవ్వాలి. ఇవి పొందిన అనంతరం ఆమె మరో వివాహం చేసుకుంటే ఆ ధనాన్ని, ఆభరణాలు అయితే వాటి విలువపై వడ్డీతో సహా చెల్లించాలి. ఒకవేళ వితంతువు తిరిగి వివాహం చేసుకోదలచుకుంటే ఆమె మామ గారు లేదా భర్త లేదా ఇద్దరు, ఆమెకు ఇచ్చిన వాటిని రెండవ వివాహం సందర్భంలో ఆమెకు చెల్లించాలి. స్త్రీలు పునర్వివాహం ఎప్పుడు చేసుకోవచ్చన్న విషయం "భర్తల సుదీర్ఘ ప్రయాణం" అన్న అంశం గురించిన ప్రస్తావించిన సందర్భంలో వివరంగా ఉంది.

"ఒక వితంతువు తన మామ గారు ఎంపిక చేసిన వ్యక్తిని కాకుండా వేరే వ్యక్తిని వివాహం చేసుకుంటే ఆమెకు మామగారు కానీ భర్త గాని ఇచ్చిన సొమ్మును కోల్పోతుంది. ఒకవేళ ఆ స్త్రీ (జ్ఞాతి) బంధువునే వివాహం చేసుకుంటే ఆమె పునర్వివాహ సమయంలో మామ గారు ఇచ్చినవి ఏమైనా ఆ బంధువు ఆమె మామ గారికి తిరిగి ఇచ్చేయాలి. ఒక స్త్రీ సంరక్షణ భారం వహించే వారు ఎవరైనా అంతే బాధ్యతతో ఆమె ఆస్తిని కాపాడాలి. పునర్వివాహం చేసుకున్న స్త్రీ మరణించిన భర్తకు చెందిన ఆస్తిపై హక్కును ఏర్పరుచుకోజాలదు."

"ఆమె ఒకవేళ పవిత్ర జీవితం గడప తలుచుకుంటే ఆమె ఆస్తిని అనుభవించవచ్చు. కొడుకు లేదా కొడుకులు ఉన్న స్త్రీ, తన స్త్రీ ధనాన్ని స్వేచ్ఛగా ఖర్చు పెట్టడానికి వీల్లేదు. ఎందుకంటే దానిపై ఆమె కొడుకులకు హక్కు ఉంటుంది. "భర్తతో విడిపోయిన స్త్రీ పునర్వివాహం తర్వాత మునుపటి భర్త ద్వారా కలిగిన కొడుకుల పోషణ కోసం ఆస్తిని ఉపయోగించ దలచుకుంటే దానిని కొడుకుల పేరు మీదకు మార్చవలిసి ఉంటుంది. ఒకవేళ ఒక స్త్రీ వేరు వేరు భర్తల నుండి అధిక సంఖ్యలో కొడుకులను కలిగి ఉంటే ఆమె తన భర్తల నుండి సంక్రమించిన ఆస్తిని యధాతథంగా ఉంచాలి. ఒక స్త్రీకి ఆస్తి మీద పూర్తి స్వతంత్రతతో స్వేచ్ఛగా అనుభవించి ఖర్చు పెట్టే సర్వహక్కులు ఉండి ఉన్నప్పటికి ఆమె పునర్వివాహం చేసుకుంటే ఆస్తిని ఆమె తన కొడుకుల పేర రాయవలసిందే."

"గొడ్రాలయిన ఒక స్త్రీ మరణించిన తన భర్త పడకకు విధేయంగా ఉంటే ఆమె తన గురువు రక్షణలో ఉంటూ జీవించి ఉన్నంత కాలం ఆస్తిని అనుభవించవచ్చు. ఆస్తి కలిగిన వితంతువుకు రాగల ప్రమాదాలను ఇది దూరంగా ఉంచుతుంది. ఆమె మరణానంతరం ఆస్తి దాయాదులకు చెందుతుంది. భర్త జీవించి ఉండగా భార్య చనిపోతే ఆమె ఆస్తిని కొడుకులు, కూతుళ్ళు పంచుకుంటారు. మగ పిల్లలు లేని పక్షంలో ఆడపిల్లలు పంచుకుంటారు. పిల్లలు లేని సందర్భంలో భర్త తాను వివాహ సమయంలో ఇచ్చిన శుల్కం తిరిగి తీసుకుంటాడు. బంధువులు బహుమతి రూపంలో గాని కట్నాల రూపంలో గాని ఆమెకు ఇచ్చిన వాటిని తిరిగి తీసుకోవచ్చు. ఆ రకంగా స్త్రీకి సంబంధించిన ఆస్తి వ్యవహారాన్ని పరిష్కరించాలి.

భర్తలు కొంత కాలం కోసం విదేశాలకు వెళ్లిన సందర్భాలలో శూద్రులకు వైశ్యులకు క్షత్రియులకు లేదా బ్రాహ్మణ కులాలకు సంబంధించిన భార్యలు వారికి పిల్లలు లేకపోయి ఉంటే వరుసగా ఒక ఏడాది, రెండు, మూడు, నాలుగు ఏళ్లు చొప్పున భర్తల కోసం వేచి చూడాలి. పిల్లలు కలిగి ఉంటే ఏడాదికంటే ఎక్కువ కాలం ఎదురు చూడాలి. వారికి పోషణ ఖర్చు అందుతూ ఉంటే పైన చెప్పిన సమయానికి రెట్టింపు సమయం వేచి చూడాలి. ఒకవేళ పోషణ అందకపోతే బంధువులు (జ్ఞాతులు) నాలుగు లేదా ఎనిమిదేళ్లపాటు పోషించాలి. తర్వాత వివాహ సమయంలో ఇచ్చిన వాటిని వెనక్కి తీసుకొని, వారిని పునర్వివాహం చేసుకోవడం కోసం వదిలి పెట్టాలి. ఆమె బ్రాహ్మణ స్త్రీ అయి ఉండి భర్త చదువుల కోసం విదేశాలకు వెళ్లి ఆమెకు పిల్లలు లేకపోయి ఉంటే పదేళ్లపాటు భర్త కొరకు ఎదురుచూడాలి. ఒకవేళ పిల్లలు ఉంటే పన్నెండేళ్లపాటు ఎదురు చూడాలి. ఒకవేళ భర్త రాజసేవకుడు అయి ఉంటే జీవితాంతం ఎదురు చూడాలి. ఒకవేళ జాతి అంతరించి పోకుండా కాపాడడం కోసం భర్త గోత్రానికి చెందిన సవర్ణ వ్యక్తితో ఆమె పిల్లల్ని కని ఉంటే ఆమె శిక్షార్హురాలు కాజాలదు. భర్త లేని సమయంలో ఆమెకు పోషణ ఖర్చు అందక పోయి, ఆమె సంపన్న బంధువులు ఆమెను ఆదరించకపోతుంటే ఆమె తనకు నచ్చిన, తనను పోషించగల వ్యక్తిని పునర్వివాహం చేసుకోవచ్చు.

మనువు లాగా కాకుండా కౌటిల్యుడు వివాహిత స్త్రీ ఆర్థిక స్వాతంత్రాన్ని వాగ్దానం చేసే ప్రతి జాగ్రత్తనూ తీసుకున్నాడనే విషయం కౌటిల్యుని అర్థశాస్త్రంలో వివాహిత స్త్రీల మాన్యాలు, పోషణ గురించి పొందుపరచిన విషయాల నుంచి స్పష్టం అవుతుంది. 'పోషణ లేదా ఆభరణాలు స్త్రీకి సంబంధించిన ఆస్తి అవుతాయి. పోషణ ఖర్చు నిమిత్తం నిర్ణయించిన విలువ ఆమె

పేరున రాయాలి. ఆభరణాలకు సంబంధించిన పరిమితి ఏమీ లేదు. ఆమె పోషణ నిమిత్తం భర్త ఏ ఏర్పాటు చేయని సమయం లో ఈ ఆస్తిని ఆమె తన కోసం కానీ తన కొడుకు కోసం కానీ కోడలి కోసం కానీ ఖర్చు పెట్టడం నేరం కాదు. విపత్తుల సందర్భంగా గాని, అనారోగ్యం కరువుల సందర్భంగా కానీ ప్రమాద నివారణ కోసం లేదా దానధర్మాల సందర్భంగా గాని ఈ ఆస్తిని భర్త కూడా వినియోగించవచ్చు. పిల్లలకు జన్మనిచ్చిన జంట పరస్పర అంగీకారంతో ఈ ఆస్తిని ఖర్చు పెట్టడం పట్ల కూడా ఫిర్యాదు ఉండదు. మొదటి నాలుగు పద్ధతుల్లోని ఏదో ఒక పద్ధతిలో వివాహం చేసుకున్న వారు మొదటి మూడేళ్ల ఈ ఆస్తిని అనుభవించడంపై కూడా ఫిర్యాదు ఉండదు. గాంధర్వ, అసుర పద్ధతుల్లో వివాహం చేసుకున్న వారు వడ్డీతో సహా ఈ మొత్తాన్ని తిరిగి సమకూర్చ వలసి ఉంటుంది. రాక్షస, పైశాచిక వివాహాలలో ఈ ఆస్తిని వినియోగించడం దొంగతనంతో సమానం. ఆ రకంగా వివాహ విధులకు సంబంధించిన విషయాలతో వ్యవహరించవలసి ఉంటుంది.'

'అపరిమిత కాలం వరకు పోషణను పొందే హక్కు కలిగిన స్త్రీ తనకు అవసరమైనంత తిండి, బట్ట లేదా తనకు భరణం ఇవ్వాల్సిన వ్యక్తి ఆదాయాన్ని బట్టి తన అవసరానికి మించి భరణం పొందవచ్చు. ఒకవేళ ఆ కాలం పరిమితం అయితే అతని ఆదాయాన్ని బట్టి నిర్దిష్ట మొత్తాన్ని నిర్ణయించి (ఆ కాలానికి సరిపడా తిండి బట్టతో పాటు అదనంగా పదవ వంతు మొత్తాన్ని) ఆమెకు చెల్లించవలసి ఉంటుంది. అలాగే వివాహ సమయంలో ఆమెకు ఇచ్చిన శుల్కం, స్త్రీ ధనం చెల్లించాలి. పునర్వివాహం చేసుకోవడానికి అనుమతించినందుకు పరిహారం కూడా చెల్లించాలి. ఒకవేళ ఆమె తన మామగారి సంరక్షణలో ఉన్నా లేదా స్వతంత్రంగా బతుకుతున్నా ఆమె భర్తపై పోషణ నిమిత్తం కేసు వేయజాలదు. ఆ రకంగా పోషణ విషయాన్ని పరిష్కరించాలి'. **ఆశ్చర్యం అనిపించవచ్చు కానీ కౌటిల్యుని కాలంలో భర్త కొట్టినా అవమానపరిచినా అతనికి వ్యతిరేకంగా భార్య కోర్టుకు వెళ్లవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే మనువుకు ముందు కాలంలో ఒక స్త్రీ స్వేచ్ఛగానూ పురుషునికి సమాన భాగస్వామిగానూ ఉంది.**

### బౌద్ధంలో స్త్రీలు :

చంద్రగుప్తుని తర్వాత పరిపాలించిన వారిలో బింబిసారుడు, అశోకుడు మగధ రాజ్యాన్ని చాలా విస్తరించారు. కాబట్టి ఇక అది మగధ రాజ్యంగా కాకుండా మౌర్య సామ్రాజ్యంగా విస్తరించింది. అశోకుడు బౌద్ధ మతాన్ని రాజ్యమతంగా చేశాడు. "బౌద్ధంలో మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు వుండేవి. మహిళలకు, పురుషులకు ఒకే రకమైన న్యాయ స్మృతి ఉండేది. బుద్ధుని కాలంలో కుందల్ కాషా, క్షేమ అనే ఇద్దరు బౌద్ధ భిక్షుణిలు ధర్మశాస్త్రాల్లో విద్వాంసులు. వాద ప్రతివాదాల్లో ఆరితేరిన వారు. జైన, బుద్ధ విశ్వాసాలలో మహిళలకు సమాన హోదా ఉండేది. మహిళలకు విద్యార్జన చేసే, బోధన చేసే, వృత్తి చేపట్టే, తమను తాము అభివృద్ధి చేసుకుని, నిర్వాణం పొందే స్వేచ్ఛ సైతం ఉండేది". "బుద్ధుడు స్త్రీలకు సమాన హోదాను, సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని కల్పించాడు. ఆ రకంగా బుద్ధ భగవానుడే స్త్రీల స్వాతంత్ర్యాన్ని ఎత్తిపట్టిన మొట్టమొదటివాడని చెప్పవచ్చు"

### బౌద్ధానంతర హిందూ సమాజంలో స్త్రీలు :

అశోకుడు బౌద్ధాన్ని రాజ్యమతంగా చేయడం బ్రాహ్మణ మతానికి తీవ్ర విఘాతం కలిగించింది. బ్రాహ్మణులకు రాజ్య పోషణ కరువైంది. జంతు బలుల నిషేధంతో బ్రాహ్మణులకు ఆదాయ మార్గాలు కరువయ్యాయి. 140 సంవత్సరాలపాటు మౌర్య సామ్రాజ్య పాలన ముగిసే వరకు అణచివేతకు గురైన వర్గంగా వాళ్ళు బతికారు. కాబట్టి బౌద్ధ రాజ్యంపై పుష్యమిత్రుడి నాయకత్వంలో తిరుగుబాటు జరిగింది. పుష్యమిత్రుడు శుంగ వంశపు బ్రాహ్మణుడు. "క్రీస్తు పూర్వం 185 నుంచి 149 వరకు ఇతను రాజ్యం చేశాడు. అధికారం చేపట్టగానే అశ్వమేధ యాగం చేశాడు. బౌద్ధుల మీద విపరీతంగా హింస ప్రయోగించాడు. బౌద్ధ ఆరామాలను నాశనం చేశాడు. భిక్షుల తలకు 100 బంగారు నాణేలు చొప్పున ప్రకటించాడు".

"ఆర్యచట్టం ప్రకారం 1.రాజరికం క్షత్రియుని హక్కు మాత్రమే. బ్రాహ్మణుడు రాజు ఎప్పటికీ కాలేడు. 2.ఏ బ్రాహ్మణుడు ఆయుధ సంబంధిత వృత్తి చేపట్టకూడదు. 3. రాజు అధికారానికి వ్యతిరేకంగా జరిగే విప్లవం పాపం. ఆ రకంగా విప్లవాన్ని నిర్వహించడం ద్వారా పుష్యమిత్రుడు ఈ 3 చట్టాలకు వ్యతిరేకంగా ప్రవర్తించి నేరాన్ని చేశాడు. అతడు బ్రాహ్మణుడు కాబట్టి పుష్యమిత్రుని నేరాలన్నిటినీ ఒప్పులుగా చేయడానికి చట్టాన్ని మార్చారు". "ఈ న్యాయపరమైన మార్పులు ఎంత విప్లవాత్మకమైనవో అంతగా అవశ్యకమైనవి. తుది మౌర్య రాజుని చంపి పుష్యమిత్రుడు సంపాదించిన స్థానాన్ని చట్టబద్ధం చేయటమూ క్రమబద్ధం చేయటమూ వారి లక్ష్యం. ఈ న్యాయపరమైన మార్పుల ద్వారా బ్రాహ్మణుడు న్యాయ సమ్మతంగా రాజు కాగలడు, న్యాయ సమ్మతంగా సాయుధుడు కాగలడు. చాతుర్వర్ణ వ్యవస్థను వ్యతిరేకించే రాజును న్యాయ సమ్మతంగా సింహాసనం దించేయగలడు. లేదా హత్య చేయగలడు. బ్రాహ్మణాధికారాన్ని వ్యతిరేకించే ఏ వ్యక్తినైనా న్యాయసమ్మతంగా చంపగలడు. స్వీయ ప్రయోజన రక్షణార్థం అవసరమైతే ఊచకోత కోసే హక్కును మనువు బ్రాహ్మణులకు ప్రసాదించాడు. "మౌర్యులకు వ్యతిరేకంగా పుష్యమిత్రుడు చేసిన విప్లవం మనస్మృతికి శాసన రూపం కల్పించడం

ద్వారా బ్రాహ్మణ మతాన్ని స్థాపించడానికి మార్గాన్ని సుగమం చేసింది". ఒకసారి కులాలంటూ ఏర్పడ్డాక అవి మనుగడ సాగించడానికి శాశ్వతంగా కొనసాగడానికి ఏం చేశారో అర్థం చేసుకోవడానికి అంబేడ్కర్ ఒక ఊహాజనిత సిద్ధాంతాన్ని (హైపొథీసిస్) ప్రతిపాదిస్తారు. "బహిర్ వివాహంపై అంతర్ వివాహ ఆపాదనం అంటే కులం పుట్టుక" అన్నది అంబేడ్కర్ ప్రతిపాదన. "కులంగా మారాలనుకుంటున్న ఒక ఊహ కల్పిత సముదాయాన్ని తీసుకొని దాని లక్ష్యం నెరవేరాలంటే అది ఏ విధానాలు పాటించాల్సి ఉంటుందో కొద్దిగా విశ్లేషణ చేద్దాం. కులాంతర వివాహాలను నిషేధిస్తూ ఒక ఉత్తర్వు జారీ చేయడం ద్వారా ఆ సముదాయం సాధించేదేమీ ఉండదు. ఎందుకంటే అంతర్ వివాహ పద్ధతికన్నా ఎంతో ముందు నుంచి బహిర్ వివాహ పద్ధతి బలంగా అమలులో ఉన్నది. అంతేకాక పరస్పర సన్నిహిత సంపర్కంతో సహజీవనం సాగిస్తున్న వివిధ సాంఘిక బృందాలు ఒకదానితో ఒకటి సంబంధ బాంధవ్యాలను పెంచుకొని ఒక సమరూప సమాజంగా విలీనమైపోయేందుకే ఎక్కువగా ప్రయత్నిస్తుంటాయి. కుల నిర్మాతలు ఈ సహజమైన ధోరణికి విరుద్ధంగా కుల నిర్మాణం దిశగా బలమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఒక సముదాయంలోని ప్రజలు మరొక సముదాయం వారితో పెళ్లి సంబంధాలు ఏర్పరచుకోకుండా ఒక శక్తివంతమైన పరిధిని గీయవలసి ఉంటుంది. అయితే బయట వారితో పెళ్లిను నిషేధించడం వల్ల అనేక గడ్డు సమస్యలు పుట్టుకొస్తాయి. వాటిని పరిష్కరించడం అంత తేలిక కాదు. సాధారణంగా ఏ సమూహంలోనైనా ఆడ, మగ జనాభా సమానంగా ఉంటుంది. వివాహ యోగ్యులైన ఆడ, మగ వారి సంఖ్య కూడా సాధారణంగా సమానంగానే ఉంటుంది. అయితే అనేక చారిత్రక ఆకస్మిక పరిస్థితుల కారణంగా వాస్తవ సమాజాలలో ఈ సమానత నియమానికి భంగం ఏర్పడుతుంది. కానీ అంతర్వివాహాన్ని ప్రవేశపెట్టాలనుకుంటున్న సమూహానికి స్త్రీ పురుషుల సంఖ్య ఎల్లప్పుడూ సమానంగా ఉండడం అనేది అత్యంత అవసరంగా మారుతుంది. అలా సమాన సంఖ్యను నిలుపుకోవడం అనేది పరమ లక్ష్యం అవుతుంది. లేకపోతే అంతర్ వివాహ పునాది బీటలు వారుతుంది. ఒక సముదాయంలోని వారందరికీ పెళ్లికి అవసరమైన జోడి లభించి తీరాలి. లేకపోతే వారు బయట సమూహాలలో తమ జంటను వెతుక్కుంటారు. వారిని ఆపడం ఏ కుల కట్టుబాటు తరమూ కాదు కాబట్టి కులంగా మార్పు చెందాలంటే సమూహంలో వివాహ యోగ్యమైన స్త్రీ పురుషుల సంఖ్య ఎప్పుడు సమానంగానే ఉండాలి. ఈ సంఖ్య సమానత్వాన్ని ప్రకృతికి వదిలేస్తే కుదరదు. ఎందుకంటే భార్య భర్త ఇద్దరూ ఒకేసారి మరణించినప్పుడు మాత్రమే సంఖ్యా సమానత్వం సాధ్యం. అది ఎప్పుడో ఒకసారి కానీ జరగదు. భార్యకన్నా భర్త ముందే మరణించవచ్చు. అప్పుడు ఆమె ఆ సమూహంలో అదనపు స్త్రీ అవుతుంది. ఆమెను ఎలాగో వదిలించుకోవాలి. లేకపోతే ఆమె అంతర్ వివాహ కట్టుబాటును ఉల్లంఘించే అవకాశం ఉంది. అదే విధంగా భార్య ముందుగా మరణించి భర్త మిగిలినప్పుడు అందరూ ఆయనపై సానుభూతి చూపవచ్చు కానీ అదనపు పురుషుడిగా అతని వల్ల తలెత్తే సమస్య నుంచి బయట పడాలంటే అతన్ని కూడా ఎలాగో వదిలించుకోవాలి. లేకపోతే అతను కులం కట్టును ధిక్కరించవచ్చు. అలా అదనపు స్త్రీ లేదా అదనపు పురుషుడు కులానికి ఎదురయ్యే అతి పెద్ద సవాళ్లు. వాళ్ల సంగతి పట్టించుకోకుండా వారి సమస్యకు పరిష్కారం చూపకుండా వదిలేస్తే వారు కులం బయట వారితో సంబంధాలు పెట్టుకుంటారు. అంతేకాదు కులం బయటి వారి ద్వారా సంతానాన్ని కూడా పొంది కులం లోపలికి తీసుకువచ్చే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో చూద్దాం. మొదటిది మరణించిన భర్త చితి మంటల్లో ఆమెను కూడా కాల్చేయడం. కానీ స్త్రీ పురుషుల సంఖ్యలో వ్యత్యాసాన్ని తగ్గించడానికి ఈ మార్గం ఆచరణ సాధ్యం కాని మార్గం. కొన్ని సందర్భాల్లో ఇది పనిచేయవచ్చు కొన్నిసార్లు ఇది సాధ్యం కాకపోవచ్చు. చూడటానికి ఇది అతి సులభ పరిష్కారంగా కనపడినా ఆచరణలో కష్టసాధ్యమైనది. ప్రతి అదనపు స్త్రీని ఈ మార్గంలో వదిలించుకోవడం కుదరని పని అంటే ఈ అదనపు స్త్రీ సమూహంలో ఉండిపోతుంది.

ఈమె మళ్లీ పెళ్లి చేసుకోకుండా జీవితాంతం వితంతువు గానే ఉండిపోయేలా కట్టడి చేయడం రెండవ మార్గం. ఇది ఆచరణలో సాధ్యమైన మార్గం. చంపడం కన్నా మానవీయమైనదే కాక మళ్లీ పెళ్లి అనే సమస్యను ఇది పరిష్కరిస్తుంది. కానీ సమూహంలోపల నైతిక విలువలను ఈ మార్గం కాపాడలేదు. బలవంత వైధవ్యాల్లో స్త్రీ బతికే ఉంటుంది. ఎవరికో ఒకరికి సక్రమమైన భార్యగా బతికే సహజమైన హక్కును కోల్పోయి ఉండడం చేత అక్రమ సంబంధం అనే ప్రవర్తనకు బలం చేకూరుతుంది. అయితే ఇదేమంత గడ్డు సమస్య కాదు. ఏ మగవానికీ ఆమెపై వ్యామోహం కలగని విధంగా ఆమె పరిస్థితిని దిగజార్చితే సరిపోతుంది. ఇక అదనపు పురుషుని సమస్య. భార్య చనిపోయిన మగవాడిని ఆజన్మ బ్రహ్మచారిగా ఉంచడం ఒక పరిష్కారం. సాంప్రదాయకమైన ఈ పురుషాధిక్యత వల్ల మగవారి ఇష్టా ఇష్టాలకు సముదాయాలు ఎక్కువ విలువ ఇస్తాయి. అదే స్త్రీలు మాత్రం మతపరంగా సాంఘికంగా ఆర్థికంగా రకరకాల అన్యాయమైన నిషేధాలను ఆంక్షలు ఎదుర్కొంటూ ఉంటారు. ఈ ఆంక్షలు, నిషేధాలను మగవాళ్లే తయారు చేస్తారు. కాబట్టి అవి అతని మీద పెద్దగా పని చేయవు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక కులం లోపల అదనపు స్త్రీతో వ్యవహరించినట్టే అదనపు పురుషునితో వ్యవహరించడం

కుదరని పని కాబట్టి అతనిని ఎప్పుడూ గృహస్థునిగా ఉంచడమే ఒక పరిష్కారం. అంటే కులం లోపలే అతనికి ఒక భార్యను సమకూర్చవలసి ఉంటుంది. దానికి మిగిలిన ఒకే ఒక మార్గం పెళ్లీడు ఇంకా రాని బాలికతో అతనికి వివాహం చేయడం. అప్పుడు అతను కులం లోపలే ఉండిపోతాడు. ఆడ మగల మధ్య సంఖ్యాపరమైన సమానత్వాన్ని సాధించడానికి నాలుగు మార్గాలు కనబడుతున్నాయి ఒకటి భర్తతోపాటే భార్యను కాల్చేయడం. రెండు బలవంతంగా వైధవ్యం విధించడం. మూడు భార్యను కోల్పోయిన మగవానిపై ఆజన్మ బ్రహ్మచర్యం విధించడం. నాలుగు పెళ్లీడు రాని బాలికతో అతనికి పెళ్లి చేయడం. ఈ ఆచారాలు లేకుండా అంతర్వివాహాన్ని కట్టుదిట్టంగా అమలు చేయలేరు. అంతర్ వివాహం లేకుండా కులమే లేదు." బౌద్ధం భారతదేశంలో ఒక విప్లవం అని బౌద్ధంపై బ్రాహ్మణ మతం చేసిన తిరుగుబాటుని ప్రతీఘాతుక విప్లవం అని అంబేద్కర్ విశ్లేషిస్తారు. ఈ ప్రతీఘాతుక విప్లవంలో స్త్రీల పరిస్థితిని మనువు ఎలా దిగజార్చాడో అంబేద్కర్ మనుస్మృతిని విశేషంగా ఉటంకించడం ద్వారా వివరిస్తారు.

"స్త్రీల గురించి గురించి మనువు చెప్పిన దానిలో దిగ్భ్రాంతి కలిగించే కొత్త విషయమేమీ లేదు. భారతదేశంలో బ్రాహ్మణీయం పుట్టినప్పటి నుంచి ఉన్నవే. ఈ అభిప్రాయాలన్నీ బ్రాహ్మణులవే. మనువుకు ముందు ఇవన్నీ సామాజిక సిద్ధాంతాలు గానే ఉనికిలో ఉన్నాయి. మనువు చేసింది ఏమిటంటే సామాజిక సిద్ధాంతంగా ఉన్నదాన్ని రాజ్యాంగ చట్టాలుగా రూపొందించడం. రెండో విషయం ఏంటంటే ఈ అనర్హతలను మనువు స్త్రీలకు ఎందుకు ఆపాదించాడనే విషయం. బౌద్ధ ధర్మం వైపు పెద్ద ఎత్తున మళ్లడం ద్వారా బ్రాహ్మణీయ మతం పునాదులను కదిలిస్తున్నది ఆర్య సమాజంలో ముఖ్య సమూహాలైన స్త్రీలు, శూద్రులే. బౌద్ధం వైపు వెల్లువలా దూకుతున్న స్త్రీల ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలనేదే మనువు కోరిక.

**ఈ కారణంగానే మనువు స్త్రీలపై ఈ అనర్హతలను విధించి వారిని శాశ్వతంగా అశక్తులను చేశాడు. సందేహం ఉన్నవారెవరైనా మనుస్మృతిలో ఉటంకించిన ఈ క్రింది నిషేధాలను పరిశీలించవచ్చు.**

- V. 88. వర్ణ సంకరం వల్ల జన్మించిన వారికి, సన్యాసం స్వీకరించిన వారికి, ఆత్మహత్యలు చేసుకొని చనిపోయిన వారికి అంత్యక్రియలనూ కర్మలనూ జరపరాదు.
- V. 89. భిన్న మతాలలో చేరిన స్త్రీలకు, స్వేచ్ఛగా వ్యవహరించే స్త్రీలకు, గర్భస్థ శిశువునూ భర్తనూ గాయపరిచిన స్త్రీలకు, మద్యం సేవించే స్త్రీలకు ఈ అంత్యక్రియలు నిషిద్ధం.

ఈ నిషేధం ఇతరులతోపాటు సన్యాసం స్వీకరించిన వారిపట్లా మత భ్రష్టులైన వారిపట్లా ఎక్కుపెట్టాడు. సన్యాసుల పట్ల విధించిన నిషేధం పరివ్రాజకులను ఉద్దేశించినది. భిన్న సంప్రదాయాలలో చేరిన మహిళలు అంటే మనువు దృష్టిలో ఉన్నది బౌద్ధమతమే అనడంలో సందేహం లేదు. అందువల్ల సన్యాసులకు, మతం మారిన స్త్రీలకు అంత్యక్రియలు కర్మ కాండలు జరపరాదని అన్నాడంటే అది బౌద్ధ మతం స్వీకరించిన స్త్రీ లేదా పురుషుని కుటుంబాన్ని ఉద్దేశించినదే ననేది స్పష్టమే. మరోమాటలో చెప్పాలంటే వారిని కుటుంబం నుంచి వెలి వేయాలని చెప్పడమే. మనువు బౌద్ధ మతానికి బద్ధ వ్యతిరేకి. స్త్రీలపై అనేక రకాలైన అసమానతలను గుప్పించడం వెనుక రహస్యం అదే. ఎందుకంటే కుటుంబాన్ని బౌద్ధ మతం నుండి కాపాడాలంటే స్త్రీలను అదుపు చేయాలని మనువుకు తెలుసు. అందుకే ఆ పనిచేశాడు. భారతదేశంలో స్త్రీల అధోగతికి కారణం మనువుకు ఆపాదించాలి".

**మనుస్మృతిని మొదలుపెట్టడమే స్త్రీల పట్ల చాలా చులకన భావనతో మొదలుపెడతాడు.**

- 213. పురుషులను వశపరచుకోవడం (ప్రపంచంలో) స్త్రీల నైజం. ఆ కారణంగానే తెలివైన పురుషులు స్త్రీల సన్నిధిలో ఏమరుపాటుగా వ్యవహరించరు.
- 214. మూర్ఖులనే కాదు స్త్రీలు విజ్ఞులను కూడా తప్పుదోవ పట్టించి కోరికలకు క్రోధానికి బానిసలను చేయగలరు.
- 215. పురుషుడు తల్లితో గాని, చెల్లితో గాని, కూతురుతో గానీ ఏకాంత ప్రదేశాలలో ఉండరాదు. ఎందుకంటే ఇంద్రియాలు శక్తివంతమైనవి. అవి విజ్ఞుడిని సైతం లొంగదీయగలవు.
- IX. 14. స్త్రీలకు అందంతోనూ వయసుతోను పని లేదు. మగవాడైతే చాలు. అందగాడి కైనా సరే, పూర్తి కైనా సరే, కురూపికైనా సరే తమని తాము అర్పించుకుంటారు.
- IX. 15.పురుషుల పట్ల వ్యామోహం వల్లా చంచల స్వభావం వల్లా సహజంగానే ఉండే కర్కశత్వం వల్ల ఎంత జాగ్రత్తగా రక్షించినప్పటికీ స్త్రీలు తమ భర్తల పట్ల అవిధేయంగా ఉంటారు.
- IX. 16.సృష్టికర్త వారి స్వభావాన్ని ఆ విధంగా సృష్టించాడు కాబట్టి పురుషుడు పట్టుదలతో శ్రమించి వారికి కాపలా కాయడం తప్పనిసరి.

**స్త్రీలకి వ్యతిరేకంగా మనువు ఈ ఉద్దేశంతోనే చట్టాలు తయారుచేశాడు. స్త్రీలు ఎటువంటి పరిస్థితుల్లోనూ స్వేచ్ఛగా ఉండకూడదు. మనువు అభిప్రాయంలో..**

- IX.2.స్త్రీలను పగలు, రాత్రి తమ కుటుంబంలోని మగవాళ్లపై ఆధారపడేలా ఉంచాలి. ఒకవేళ వాళ్లు ఇంద్రియ

సుఖాలకు అలవాటు పడితే వారిని అదుపు చేయాలి.

- V.147. బాలిక కానీ యువతి గానీ వృద్ధురాలు గానీ ఆమె సొంత ఇంట్లోనైనా సరే స్వతంత్రంగా ఏదీ చేయకూడదు.
- V.149. ఆమె తండ్రి నుండి కానీ భర్త నుండి కానీ కొడుకుల నుండి కానీ వేరు పడాలని ప్రయత్నించకూడదు. వారిని వదిలి పెట్టడం ద్వారా ఆమె రెండు కుటుంబాలకు (తనది తన భర్తది) అప్రతిష్ట కలుగచేస్తుంది. స్త్రీ కి విడాకుల హక్కు ఉండరాదు.
- IX.45. "వివాహానంతరం భార్యాభర్తలు ఒకటవుతారు. దానర్థం ఒకసారి వివాహం అయిన స్త్రీ ఇక విడిపోవడం అనేది ఉండకూడదు."

చాలామంది హిందువులు విడాకుల విషయంలో మనువు చెప్పిన చట్టం విషయంలో ఇక్కడే ఆగిపోయి మనువు వివాహాన్ని చాలా పవిత్రంగా భావించాడని అందువల్లనే విడాకులను అనుమతించలేదని భావిస్తూ ఆత్మ సంతృప్తి పొందుతుంటారు. ఇది చాలా వాస్తవ దూరమైన విషయం. అతను విడాకుల చట్టం రూపొందించిన ఉద్దేశం పూర్తిగా వేరు. అది పురుషులను స్త్రీకి కట్టబెట్టడం కోసం కాదు. స్త్రీని పురుషుడికి కట్టబెట్టి పురుషుని స్వేచ్ఛగా వదిలిపెట్టడానికే ఉద్దేశించినవి. ఎందుకంటే పురుషుడు తన భార్యను వదిలిపెట్టడాన్ని మనువు నిరోధించలేదు. పురుషుడు స్త్రీ ని వదిలి పెట్టడానికే కాదు అమ్మి వేయడానికి సైతం అనుమతిస్తాడు. భార్య మాత్రం విడిపోయి స్వతంత్రురాలు కావడాన్ని నిరోధిస్తాడు. మనువు ఏం చెప్పాడో చూడండి.

- IX. 46. అమ్మకం వల్ల గానీ, పరిత్యజించడం వల్ల గానీ భార్య భర్త నుండి విడుదల కాజాలదు.

దీనర్థం భార్యను అమ్మివేసినా విడిచి పెట్టినా తనను కొనుక్కున్న వారికి గాని వేరొకరికి గాని చట్టబద్ధమైన భార్య కాజాలదు. దీనికన్నా దుర్మార్గం మరొకటి లేదు. మనువు తన న్యాయ సూత్రాలు రూపొందించేటప్పుడు న్యాయాన్యాయాలను గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. బౌద్ధం స్త్రీలకు అనుమతించిన స్వేచ్ఛను వారికి దక్కకుండా చేయాలని అతను తలచాడు. స్త్రీలకు స్వాతంత్రం ఉండడాన్ని మనువు సహించలేక పోయాడు. దానిని అరికట్టడానికే ఆమెకు స్వేచ్ఛ లేకుండా చేశాడు. ఆస్తికి సంబంధించి మనువు భార్య స్థాయిని ఒక బానిస స్థాయికి దిగజార్చాడు. స్త్రీలకు మేధోపర జిజ్ఞాస కానీ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ గానీ ఆలోచించే స్వేచ్ఛగానీ ఉండకూడదు. బౌద్ధం వంటి ఇతర మతాలలో చేరకూడదు. ఒకవేళ అలా చేరి మరణించేవరకూ ఆ మతంలోనే కొనసాగితే చనిపోయాక తర్పణాలు వదలకూడదు.

**చివరగా జీవితాదర్శంగా మనువు స్త్రీల ముందు ఉంచిన విషయం గురించి ఒక్క మాట. అది మనువు మాటల్లో చెప్పడమే ఉత్తమం.**

- V. 151. తండ్రి గానీ తండ్రి అనుమతితో సోదరుడు గానీ ఆమెను వివాహబంధంలో ఎవరికి ఇస్తారో అతను జీవించి ఉన్నంత కాలం ఆమె అతనికే విధేయురాలుగా ఉండాలి. అతను మరణించాక అతని స్మృతిని అవమానపరచకూడదు. విధివంచితుడైనా వేరే చోట సుఖాలను వెతుక్కుంటున్నా, మంచి అలవాట్లు లేకున్నా విధేయురాలైన భార్య భర్తని ఎల్లప్పుడూ దైవంలాగా పూజిస్తూ ఉండాలి.
- V. 155. స్త్రీలు భర్తలను వదిలిపెట్టి ఏ క్రతువులూ ఏ నోములూ ఏ ఉపవాసాలూ చేయనవసరం లేదు. భర్తకు విధేయురాలుగా ఉండడం అనే ఒక్క విషయం తోటే ఆమెకు స్వర్గం ప్రాప్తిస్తుంది.

**ఈ ఆదర్శం సారాంశంగా మనువు అనేక ధర్మపన్నాలు నిర్దేశించాడు.**

- V. 153. పవిత్ర మంత్రాలతో వివాహం చేసుకున్న భర్త తోనే రుతుకాలంలోనూ ఋతుకాలం కానికాలంలోనూ ఇహలోకంలోనూ పరలోకంలోనూ ఆమె సుఖ సంతోషాలు ఉంటాయి.
- V. 150. ఆమె ఎల్లప్పుడు సంతోషంగానూ అతని కుటుంబ వ్యవహారాలు చక్కపెట్టడంలో తెలివిగానూ గిన్నెలు శుభ్రం చేయడంలో జాగ్రత్తగానూ ఖర్చు పెట్టడంలో పొదుపరిగానూ ఉండాలి.

**ఇవీ హిందువులు స్త్రీలకు చూపించిన గొప్ప ఆదర్శం!!!**

స్త్రీల అనర్హతల గురించి మనువు నిర్మించిన ఈ కట్టడానికి గోపురం లాంటి మరొక చట్టాన్ని ప్రకటించాడు. అది స్త్రీలను చంపడం ఉపపాతకమే అంటే చిన్న నేరం అన్నాడు. తాగడం, స్త్రీలను, శూద్రులను, వైశ్యులను, క్షత్రియులను, నాస్తికులను చంపడం చిన్నపాటి నేరాలే. శూద్రులను వైశ్యులను క్షత్రియుల ను చంపడం ఉపపాతకములు అని మనువు ఎందుకన్నాడో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే బ్రాహ్మణులు వీరంద రికంటే ఉన్నతులు అని నిరూపించదలుచుకున్నాడు. అందువల్ల బ్రాహ్మణుడిని చంపడం "మహాపాతకం" అన్నాడు. మరి ఇదే విషయం స్త్రీలకు ఎందుకు అన్వయించలేదు? ఎందుకంటే మనువు దృష్టిలో స్త్రీ ఏ విలువా లేనిది."

స్త్రీల ప్రతి చిన్న కదలికని నియంత్రించేలా శాసనాలు రాయడం వల్ల స్త్రీలకూ పురుషులకూ కూడా అవి నరనరానా జీర్ణించుకుపోయి ఒక బలమైన భావజాలంగా స్థిరీకరించుకు పోయాయి. "శూద్రుల గురించీ, మహిళల గురించీ మనుస్మృతి పేర్కొన్న ఆదేశాల ముద్ర హిందూస్థాన్‌లోని పితృస్వామిక సంస్కృతిపై ఉంది. తద్వారా సమాజం స్త్రీల సాధికారత అనే

భావనలకు దూరంగా ఉండిపోయింది".

**స్త్రీల సాధికారతపై అంబేడ్కర్ అభిప్రాయాలు :**

1938లో ఒక విద్యార్థి బృందంతో మాట్లాడుతూ "స్త్రీ ఒక వ్యక్తి. అందుకే ఆమెకు కూడా వ్యక్తిగత స్వేచ్ఛ ఉండాలి" అని ప్రకటించారు. "చిన్న వయసులోనే పెళ్లి చేసి తల్లిదండ్రులు పిల్లల జీవితాలను పాడు చేయకూడదు. తన భార్య కాబోయే వ్యక్తి విషయంలో భర్తలకి ఎలా ఎంపిక స్వేచ్ఛ ఉంటుందో అలాగే తన భర్తను ఎంచుకొనే విషయంలో ఆడ పిల్ల అభిప్రాయాలు తెలుసుకోవాలి".

1942లో జరిగిన మహిళా పరిషద్‌లో కొన్ని విషయాల గురించి ఆయన నొక్కి చెప్పారు. "ఆడపిల్లకి, మగపిల్లలకీ చిన్నప్పుడే పెళ్లిళ్లు కుదర్చకండి. ముందు వాళ్లను ఆర్థికంగా స్వతంత్రులు కానివ్వండి. ఎక్కువ మంది పిల్లలు ఉండడం వల్లే వచ్చే అనర్థాల గురించి వివరించండి. పెళ్లి అనేది ఒక ఆడపిల్ల ఎదుగుదలకి అడ్డంకి. ఆమెపై పెళ్లిని రుద్దకండి. పెళ్లి తరవాత ఆమె తన భర్తకి స్నేహితురాలిగా, సమాన హక్కులున్న ఇల్లాలిగా ఉండాలి. ఆమె తన భర్తకు బానిసగా మారకూడదు". "మీ జీవితం ఎంత కష్టభూయిష్టమైనదైనా సరే మీ కొడుకులనూ కూతుళ్లను బడికి పంపండి. ఇంటిలోని మగ వాళ్లు చచ్చిన గొడ్డు మాంసం తీసుకువస్తే ఖచ్చితంగా వ్యతిరేకించండి. మీ బట్టలు చిరిగిపోతే వాటిని వేసుకొనే ముందు కుట్టుకొని, ఉతికి వేసు కోండి. సవర్ణ కులాల మహిళలకూ మీకూ మధ్య ఎటువంటి తేడాలూ కనపడకూడదు. ఈ మాత్రం చేసినా సరే మన కులాల ను విముక్తి చేయడంలో మీరు ముఖ్యమైన పాత్ర నిర్వహించి నట్టే." పేదరికం, ఎక్కువ సంఖ్యలో పిల్లల్ని కలిగి ఉండడం తమ జాతిని వేగంగా అభివృద్ధి చెందకుండా నిరోధిస్తాయని గుర్తు చేశారు. "ఒక్క బిడ్డనైతేనే సరిగ్గా పెంచగలం. తక్కువ మంది పిల్లలుం టే స్త్రీలు పిల్లల్ని కనే భయంకరమైన బరువు నుండి విముక్తమై ఇతర కర్తవ్యాల కోసం తమ శక్తిని వినియోగించగలుగుతారు." దళితులపై సవర్ణులు చేసే దాడులను ఎదుర్కోవడానికి వారు శారీరకంగా దృఢంగా ఉండాలనీ, మల్ల యుద్ధం, కర్ర సాము వంటి విద్యల్లో నిపుణులు కావాలని బోధించారు. దళితవాడల్లో అటువంటి విద్యలు నేర్పే వారి కోసం తిరిగారు. అటువంటి విద్యలను నేరుస్తున్న మహిళా కార్యకర్తలని అభినందించి ఆదర్శంగా చూపించారు. స్త్రీలు కీలక పాత్ర వహించినపుడే సమాజం ముందుకుపోతుందని బలంగా విశ్వసించారు. ❑ **(కొలిమి సౌజన్యంతో)**


# సామాజిక న్యాయమేదీ ?

**(17వ పేజీ తరువాయి)** వ్యవస్థ తీసుకోవాలి. ఆధునిక అవసరాలకు అనుగుణమైన సామాజిక న్యాయ విధానాలను అమలు చేయాలి. అప్పుడే సమానత్వానికి బాటలు పడతాయి. పెరుగుతున్న సామాజిక అసమానతలు భారత్‌లోని మొత్తం సంపదలో 40 శాతం కేవలం ఒక శాతం ధనవంతుల దగ్గరే ఉందని ప్రముఖ హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్' పేరిట వెలువడిన నివేదిక తెలిపింది. అట్టడుగున ఉన్న సగం జనాభా వద్ద దేశ సంపదలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని చెబుతూ ఆర్థిక అసమానతలను ఈ నివేదిక స్పష్టం చేసింది. భారతదేశంలో ఆనాదిగా పాతుకు పోయిన కుల వ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనం వలన బడుగు, బలహీన వర్గాలు వివక్షకు గురైనారు. సమాజంలో కుల వివక్ష పూర్తిగా సమసిపోవడం లేదు. నేటికీ దళితులు అవమా నాలు ఎదుర్కొంటున్న సందర్భాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ గణాంకాల ప్రకారం పారిశుధ్య కార్మి క వృత్తిలోనే 68.9 శాతం దళితులు కొనసాగుతున్నారు. జైల్లో కూడా కుల వివక్ష కొనసాగుతోందని ఇటీవల సుప్రీంకోర్టు తప్పు పట్టింది. షెడ్యూల్డ్ కులాల ఖైదీలతో పారిశుద్ధ్య పనులైన మరు గుదొడ్లు కడిగించడం వంటి అవమానకరమైన పనులు చేయిం చడం, ఉన్నత కులాల ఖైదీలకు సులభమైన పనులు అప్పగిం చడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ❑

# సంపదల్లో సమానత్వం ఎందుకు ?

**(11వ పేజీ తరువాయి)** నియంతల వీరవిహారాలు చేయటం సర్వసాధారణం అవుతాయి. అసమానతలు ఉన్నచోటే.. పైకి ఎదగాలన్న ఆర్తి రగులుతున్న చోటే.. ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందన్న సిద్ధాంతమే ఇప్పటికీ చెలుబాటు అవుతోంది. ప్రభుత్వ నియంత్రణలు తక్కువగా ఉంటే కొత్త ఆవిష్కరణలతో, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో, ప్రయోగశీల మనస్తత్వంతో ఆర్థిక వ్యవస్థ కొత్తదారులు పడుతుందన్నది స్థూలంగా నిజమే కావచ్చు! కానీ ఆ కొత్తదారులతో అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజాస్వామ్యానికీ, పర్యావరణానికీ, ఆర్థికాభివృద్ధికీ అడ్డంకులుగా మారుతున్న దృశ్యం ప్రపంచవ్యాప్తంగా కనపడుతోంది. అసమానతలు కలగచేసే విపరిణామాలపై ప్రసరిస్తున్న కొత్త వెలుగులతోనైనా వాటిని కట్టడి చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోతే మానవాళి మనుగడే ప్రమాదంలో పడిపో తుంది. సామాజిక జీవితం సాఫీగా నడవాలంటే ఆ జీవితంలో భాగస్వాములైన వారి మధ్య పరస్పరం మంచి జరుగుతుందనే నమ్మకం ఉండాలి. సమానత భావం ఎంతో కొంత ఉండాలి. సౌహార్దత నెలకొనాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ లూ, సంస్థలూ మన కోసం పనిచేస్తాయనే భరోసా ఉండాలి. మితిమీరుతున్న అస మానతలు వీటన్నిటినీ దెబ్బతీస్తున్నాయి. అందుకే అన్ని అనర్థాలకు మూలం అసమానతలేనన్న భావం బలపడుతోంది! ❑ **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# మహాత్ముడివి మూడు బాధలు!



- డొక్కా మాణిక్యవరప్రసాద్

సత్యమే దేవుడని నమ్మిన మహామనిషి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. మన దేశపు భిన్నత్వంలోని ఏకత్వాన్ని మనసా వాచా కర్మణా నమ్మి ప్రజల మధ్య వైషమ్యాలు లేని సమైక్య భారతావనిని కలగన్న దార్శనికుడు. ఆయన సంప్రదాయవాది కాదు. అదే సమయంలో అభ్యుదయవాదీ కాదు. కేవలం ఇంగిత జ్ఞానంతో పనిచేసిన ఒక ఆదర్శవాది. గాంధీని జీవితాంతం బాధించిన విషయాలు ప్రధానంగా మూడు ఉన్నాయి. ఒకటి, హిందూ ముస్లిం ఐక్యత లేకపోవడం. రెండు, దళితులు అభ్యున్నతి పొందకపోవడం. మూడవది, దరిద్ర నారాయణుల్ని పేదరికం నుంచి బయట పడవేయలేకపోవడం.

గాంధీ రచనలన్నిటా ఈ విషయాలే కీలకంగా ఉంటాయి. "నేను నమ్మే సిద్ధాంతాలు, ఆదర్శాలు వ్యాప్తిలో ఉన్నంత కాలం, మరణానంతరం సైతం జీవించే వుంటాను" అని చెప్పారాయన. 20వ శతాబ్ది రాజకీయ నాయ కుల్లో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన నాయకుడు గాంధీ. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే విలువలతో ప్రపంచవ్యాప్తంగా నైతిక రాజకీయానికి మార్గదర్శిగా నిలిచాడాయన.

దేశ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచాక నేడు, గాంధీని హత్య చేసిన గాడ్సేను కీర్తిస్తూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు భారతజాతి నైతికత మీద దాడి చేయడమే. అన్ని జాతులు, మతాలు కలగలిసి సమైక్యంగా జీవించాలనే ఆకాంక్ష కోసం ఆయన చెల్లించిన మూల్యం - ప్రాణం. ప్రజాస్వామ్యంలో హింసను, హత్య చేసిన వారిని కీర్తించడం అంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే. దేశానికి గాంధీ లేకున్నా స్వాతంత్ర్యం వచ్చేదేమో కానీ, గాంధీ ఐడియాలజీ లేకుండా దేశం ఇంతటి ప్రశాంతతను పొందేది కాదు. మార్టిన్ లూథర్‌కింగ్ అమెరికాలో నల్ల జాతీయులకు హక్కులు సాధించినా, నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాకు స్వాతంత్ర్యం తెచ్చినా మహాత్ముడి అహింసా మార్గమే వారికి ఆదర్శం.

గాంధీ సత్యాగ్రహం అంటే - తనను తాను ఆత్మపరిశీలన, ఆత్మ పరివర్తన చేసుకోవడం. మనిషిలో హింస, కోపం, అహంకారం, ద్వేషం ఉన్నప్పుడు ఇతరులకు మార్గదర్శిగా నిలవడం నైతికంగా సరైంది కాదని ఆయన నమ్మారు. ఇదే గాంధీ సత్యాగ్రహానికి పునాది. తనతో తాను నిజాయితీగా ఉండకపోతే, సత్యం కోసం సమాజంతో పోరాడే నైతిక హక్కు ఉండదని నమ్మారు. చౌరీ-చౌరా సంఘటనలో హింస జరిగిందని, తాను నైతికంగా సమాజాన్ని అహింస వైపు నడిపించడంలో విఫలమయ్యానని భావించి ఉద్యమాన్ని ఆపేశారు. ఇది గాంధీలోని ఆత్మపరిశీలనకు ఒక గొప్ప తార్కాణం. అలాగే గాంధీ దృష్టిలో ధర్మం అంటే - సత్యం, అహింస, నైతికతపై ఆధారపడిన జీవన విధానం. ధర్మం - వ్యక్తిగత, సామాజిక రాజకీయ రంగాలన్నిటిలోనూ నైతిక బాధ్యతను సూచిస్తుంది. వ్యక్తికీ-వ్యక్తికీ, వ్యక్తికీ - సమాజానికీ, సమూహానికీ - సమూహానికీ మధ్య సంబంధాలను నిర్వచించే విలువగా ధర్మాన్ని ప్రస్తావించారు. గాంధీ దృష్టిలో సన్యాసి అంటే అంతర్ముఖ నైతికత, సామాజిక బాధ్యత, బాహ్యజీవన రీతిగా ఆచరించే వారు; ముఖ్యంగా బలహీనుల పక్షాన నిలబడే ఆధునిక వేదాంతి; సమాజం నుంచి పారిపోయేవారు కాదు, ఒక నైతిక పోరాట యోధుడు.

స్వదేశీ గురించి విస్తృతంగా ప్రచారం చేసిన గాంధీ కేవలం దేశీయ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల బహిష్కరణ మాత్రమే కాదు. దానిని ఒక సామాజిక, ఆర్థిక కార్యక్రమంగా ముందుకు నడిపారు. ఖద్దరు ఉత్పత్తి, సత్యాగ్రహం, రైతు ఉద్యమాలు, దేవాలయ ప్రవేశాలు ఇవన్నీ కూడా ప్రజలను కుల, మత రహితంగా ఐక్యం చేయడానికి ఉద్దేశించిన కార్యాచరణలు. తోటి మానవుల పట్ల ప్రేమ, దయ, గుణాలతో వ్యవహరించడం, మానవసేవే మాధవ సేవగా ఆచరించడం గాంధీ దృష్టిలో సనాతనం. గాంధీ సనాతనవాదం ఏ విషయాలపైనా మొండిగా వ్యవహరించదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆధ్యాత్మిక మార్గాన్ని చూపుతుంది. "నా హిందూయిజం ఎవరినీ వెలివేయదు. అన్ని తరగతులను కలుపుకుపోయే సమగ్రతా సిద్ధాంతం" అంటారు గాంధీ.

అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీ పెద్ద యుద్ధం చేశారు. హిందూ శాస్త్రాల భావం సమానత్వాన్ని ప్రసాదించేదే తప్ప అస్పృశ్యతను ప్రోది చేసేది కాదని పలు సందర్భాల్లో అన్నారు. 'హరిజన' పేరుతో ఒక పత్రికను స్థాపించి, అహింసా సిద్ధాంతానికి అస్పృశ్యత విరుద్ధమని చాటారు. సాటి మనిషిని తక్కువగా, అవమానకరంగా చూడడం భగవద్గీత సందేశానికి కూడా వ్యతిరేకమని హిందూ సమాజాన్ని హెచ్చరించారు. హిందూ మతంలో అంతర్గత సంస్కరణల కోసం పోరాటం చేసిన చిట్టచివరి నాయకుడు మహాత్మాగాంధీ. సత్యమే దేవుడని నమ్మిన ఆయన దైవాన్వేషణలో **(మిగతా 40వ పేజీలో)**

# అమృతకాలంలో అయోధ్యరాముడే జాతిపిత!

- కె.శ్రీనివాస్



**పిస్తోలు గుండు తగిలి నేలకూలుతున్నప్పుడు, గాంధీగారు 'హే రామ్' అన్నారట. ఆయనకు రాముడంటే చాలా భక్తి. ఈశ్వర అల్లా తేరే నామ్ - అంటూ అందరికీ సద్బుద్ధి ఇవ్వమని భజనల్లో రాముడిని అభ్యర్థిస్తాడు. మంచి వైష్ణవుడు, రామ నామాన్ని జపించే వైష్ణవుడు. ఇతరుల బాధను తనదిగా భావించి సహాయం చేస్తాడని చెప్పే పాటను గాంధీజీ చాలా ఇష్టపడేవారు. భారతీయ జనగాథల్లో జీవించే అనేక రాముళ్లలో, గాంధీ రాముడు ప్రత్యేకం. జాతీయోద్యమ ఆశయాలకు, ఆధునిక భారతానికి అవసరమైన రాముడిని గాంధీ తీర్చిదిద్దుకున్నారు. సందేహం లేదు, గాంధీ ఆధ్యాత్మికత రాజకీయమైనది.**



పేరులోనే రాముడున్న నాథూరామ్ కూడా రామభక్తుడే అయి ఉంటాడు. అతనిలాగా ఆలోచిస్తూ, గాంధీని ద్వేషించిన వాళ్లు, ఆ హత్య ఒక కర్తవ్యమని భావించినవాళ్లు అనేకులు ఉండి ఉంటారు. ఉన్నారు. వాళ్లు బాగా బలపడి, అధికారపీఠాల మీద స్థిరపడిన తరువాత గాంధీ అవశేషాల మీద కూడా అసహనం పెంచుకుని ఉంటారు. పెంచుకున్నారు. ప్రాణత్యాగం చేసిన గాంధీని, ఆయన అధికారంలో కూర్చోబెట్టిన శిష్యులను జాతీయ చిహ్నాలుగా తొలగించి, కొత్త ప్రతీకలను ప్రతిష్ఠించాలని అనుకున్నారు. సాంస్కృతిక, మత జాతీయవాదానికి అవసరమైన చిహ్నంగా భావించి, ఒక పరాక్రమ రాముడిని నిర్మించుకున్నారు. అతని జన్మభూమిని ఆవిష్కరించుకున్నారు. ఈ రాముడు గాంధీ గారి రాముడు కాదు, గాంధీ స్థానంలోకి వచ్చి చేరుతున్న రాముడు. అయోధ్యరాముడు.

నరేంద్రమోదీ మాటలే అందుకు ఆధారం. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాగిన భారత జాతీయోద్యమాన్ని దాదాపుగా విస్మరిస్తూ, వెయ్యేళ్ల పరపాలనకు, ఐదు వందలేళ్ల అవమాన భారానికి అయోధ్య తెరదించిందని, ఇదే కొత్త విముక్తి అని ఆయన ఆలయ ప్రారంభ కార్యక్రమంలో చెప్పారు. భారతీయ స్వాతంత్ర్య, జాతీయ ఉద్యమాలకు కొత్తకాలపరిధులను ఆయన నిర్వచించారు. మోదీ ఆ మాటను స్పష్టం చేయకముందు, నిజమైన స్వాతంత్ర్యం 2014లో మాత్రమే వచ్చిందని ముఖస్తుతి సాధకులు ప్రకటనలు చేస్తూ వచ్చారు. హంతకుడు గాడ్సే ఆరాధనలకు, అనుకూల వాదనలకు మౌనాంగీకారం, నెహ్రూ మీద నిలకడగా లేపుతూ వస్తున్న వ్యతిరేక దుమారం, అహింసను ప్రతిపాదించిన అవైదిక బుద్ధుడే భారత పరాధీనతకు కారణమన్న చాపకింద నీరు ప్రచారం-వీటన్నిటినీ కొనసాగిస్తున్నా- చరిత్ర నుంచి గాంధీని పూర్తిగా తొలగించే సాహసానికి మాత్రం ఇంతకాలం ఒడికట్టలేకపోయారు. ఇప్పుడది మొదలయింది.

"ఏది ఏమైనా, రామభక్తుడైన తనకు, ఒకానొక రాముడు ప్రత్యర్థిగా నిలబడతాడని మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ ఎప్పుడూ అనుకుని ఉండరు. నా పేరు పక్కకు తోసి, తన పేరు పెట్టుకోవలసిన స్థితి ఎందుకు కలిగిందా ఆ రాముడికి అని ఎంత బాధపడేవారో!.."

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించి, జీరామ్‌జీని జోడించడం యథాలాపంగానో, రహదారుల పేర్లు మార్చినట్టుగానో జరిగింది కాదు. గాంధీజీ పేరిట ఉన్న ఒక దేశవ్యాప్త పాపులర్ పథకానికి కొత్త పేరు పెట్టడం వెనుక, భారత జాతీయోద్యమానికి చెందిన ఒక శిఖరాయమాన విగ్రహాన్ని కూడా కూల్చివేసే తెగింపు ఉన్నది. పొడవైన పేరు నుంచి కూర్చిన పొడి అక్షరాలే అయినప్పటికీ, కొత్తపేరులోని రామ్‌జీ యాదృచ్ఛికంగా వెలిసినది కాదు. గాంధీ ఒక తరహా జాతీయ వాదానికి ప్రతినిధి. ఈ రాముడు నూతన జాతీయ వాదానికి సారథి. 1947లో విజయాన్ని అందుకున్న జాతీయోద్యమానికి గాంధీజీ నాయకులు అయితే, 2022 నుంచి 2047 దాకా నడుస్తున్న వికసిత భారత ప్రస్థానానికి రాముడే

నాయకుడు. రాముడి పాదుకల పేరిట రాజ్యం చేసే అభినవ భరతులే సూత్రధారులు. విశేష ఆమోదనీయత కలిగిన నైతిక మూర్తి తమ చరిత్రలో, వర్తమానంలో ఎవరూ లేనందున, తీవ్ర భావనలు దట్టించిన ఒక దైవమూర్తిని స్ఫూర్తిగా తీసుకోవలసిన అగత్యం వికసిత భారతవాదులకు కలిగిందని అనుకోవచ్చునా? లేక, నలభై ఏళ్ల నుంచి తాము ఇటుక ఇటుకగా నిర్మిస్తూ వస్తున్న ఒక మహాభావోద్వేగానికి మించి మరేదీ తమ రాజకీయార్థిక లక్ష్యాలకు చోదకశక్తి కాలేదన్న నిర్ధారన కలిగిందా?

ఏది ఏమైనా, రామభక్తుడినైన తనకు, ఒకానొక రాముడు ప్రత్యర్థిగా నిలబడతాడని మోహన్ దాస్ కరంచంద్ గాంధీ ఎప్పుడూ అనుకుని ఉండరు. నా పేరు పక్కకు తోసి, తన పేరు పెట్టుకోవలసిన స్థితి ఎందుకు కలిగిందా ఆ రాముడికి అని ఎంత బాధపడేవారో! పేరులో లేకపోతే ఏమైంది, పథకంలో నెరవేరుతున్నవి గాంధీ గారి ఆశయాలే కదా, అంటున్నారు కేంద్ర ప్రభుత్వ పెద్దలు. 2005లో మొదలయిన పథకానికి 2009లో కదా, గాంధీ పేరు పెట్టారు, మధ్యలో వచ్చింది మధ్యలో పోతే తప్పేమిటి? అని, ఉపాధి రోజులను నూరు నుంచి నూట పాతిక రోజులు పెంచుతున్నాము కదా, కష్టమేమిటి? అని అమాయకంగా ప్రశ్నిస్తున్నారు.

"ఇప్పుడు గాంధీ గారి పేరుతో ఉన్న పథకం స్థానంలో కొత్త పేరును అమలు చేయడానికి, ఉనికిలో ఉన్న స్టేషనరీలో, బోర్డులలో, ప్రచార సామగ్రిలో మార్పులు చేయాలి. అందుకు కొన్ని వందల కోట్లు ఖర్చు అవుతుందట. అంటే, ఈ ఉపాధి హామీ పథకం ఎంతటి విస్తృతమైనదో, భారీదో అర్థం చేసుకోవచ్చు. అంతటి ప్రచారం, ప్రభావం ఉన్న పథకాన్ని తమ చిహ్నాలతో ఊరేగించాలని ఎవరికి మాత్రం ఉండదు? జాతి పిత, జాతీయోద్యమ నాయకుడు అని అనుకుంటున్న గాంధీ ఇప్పటి పాలకులకు కాకుండా పోయారే అన్న ఆశ్చర్యపోవడం తప్ప ఏమి చేయగలం?"

గాంధీ పేరుతో సహా మొత్తంగా పేరు మార్పు, చేయడం వెనుక, సైద్ధాంతిక, వ్యూహాత్మక లక్ష్యాలు తెలుస్తూనే ఉన్నాయి. అంతమాత్రమే చేసి ఊరుకోలేదు ప్రభుత్వం! గ్రామీణ ఉపాధి పథకం సారాంశాన్ని మార్చివేస్తోంది! గ్రామీణ మనుగడలు, ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల జీవనాధారాలు, తీవ్ర సంక్షోభంలో పడడం మొదలయినప్పుడే అంటే, 1980ల మొదటిలోనే మహారాష్ట్రలో గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేశారు. మధ్యలో అనేక ఇతర పథకాలు, పనికి ఆహారం వంటివి, గ్రామాలలో పరిస్థితులు చేయిజారకుండా ఉండడానికి ప్రవేశపెట్టారు. గ్రామాల నుంచి పట్టణాలకు విపరీతమైన వలసలను నివారించడానికి, కనాకష్టంగా అయినా పల్లె కుటుంబాలు బతికి బట్టకట్టడానికి ఉద్దేశించిన ఇటువంటి పథకాల వెనుక, తాత్కాలిక ఉపశమనదృష్టి, సంక్షేమ దృష్టి తప్ప మరేవీ లేదు. ఇవేమీ విప్లవాత్మకాలు కావు, కానీ, ప్రాణాధార ఔషధాల వంటివి.

2005లో యూపీఏ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఏ (నరేగా) చట్టం, ఏడాదికి కనీసం వంద పని రోజులను హక్కుగా గ్యారంటీ చేసింది. దరఖాస్తు పెట్టుకున్న పదిహేను రోజులలోగా ఆ హక్కును అమలు చేయవలసి ఉంటుంది. ఒక సంక్షేమ చర్యను హక్కుగా మలచడం ఒక విశేషమైన, అపూర్వమైన చర్య. ఇప్పుడు, ఆ చట్టం స్థానంలో ఆమోదం పొందిన బిల్లు, వీబీ – జీరామ్‌జీ బిల్లు, ఆ హక్కు భావనను చేర్చలేదు. పథకాన్ని కేవలం కార్యక్రమంగా మాత్రమే భావించింది. పైగా, ఉపాధి పనుల కల్పనకు అనేక నిబంధనలను విధించింది. వ్యవసాయ పనులు జరిగే సమయంలో ఉపాధి హామీ పనులు కల్పించకూడదనే విధానం తీసుకుంది.

గాంధీ గారికి, ఈ గ్రామీణ ఉపాధి హామీకి ఏమి సంబంధం? ఆయన మాత్రం పనిహక్కును గుర్తించారా ? అన్న సందేహాలు రావచ్చు. హక్కులు కోరని పౌర బాధ్యతల గురించి అమృత కాలంలో జరిగే వికసిత ప్రయాణం వక్కాణిస్తుంది. గాంధీ కూడా నెరవేర్చే బాధ్యతల నుంచే హక్కులు లభిస్తాయని చెప్పినవారే. కానీ, రెండు వాదనలకు ఎంతో వ్యత్యాసం ఉన్నది. గాంధీది నైతికమైన, న్యాయాన్యాయ విచక్షణల దృష్టి. ఎంత కాల్పనిక మైనదైనా, లేదా, ఎంత భూస్వామ్య భూయిష్ఠమైనదైనా, గ్రామం స్వయం పోషకంగా ఉండాలని గాంధీ కోరుకున్నారు. గ్రామం నుంచి బయటకు వలసలు జరగకూడదని అన్నారు. శరీర శ్రమ ప్రతి ఒక్కరి కర్తవ్యం అన్నారు. పరస్పరత నుంచి గ్రామంలో ఆహార భద్రతల నుంచి అన్ని భద్రతలు సమకూరాలన్నారు. గ్రామ నిర్ణయాలలో అందరి భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నారు. గ్రామాలలో గౌరవప్రదమైన మనుగడలకు గ్యారంటీ అక్కడి సమష్టి నుంచే సమకూరుతుందని చెప్పిన గాంధీ మాటను హక్కులలోకి అనువదిస్తే, ఆ స్ఫూర్తి ఉపాధి పూచీకి దగ్గరగానే ఉంటుంది.

ఇన్నేళ్ల స్వతంత్రం తరువాత కూడా పల్లె ప్రజలను గుంతలు తవ్వే పనుల ద్వారా బతకమని చెప్పడం ఏమి అభివృద్ధి అని కేంద్ర అధికారపక్షం విమర్శిస్తూ వచ్చింది కానీ, నరేగా ను రద్దు చేయలేకపోయింది. పైగా ఇప్పుడు మరో పాతిక రోజులను పథకానికి జోడించింది కూడా. దేశాన్ని కొత్త ఎత్తుల మీదకు నడిపించే పాలనలో కూడా పల్లె జనాలకు పనులు కల్పించి అన్నం పెట్టడమేనా అన్న ప్రశ్న మాత్రం వారికి కలగడం లేదు.

ఎప్పుడో త్రేతాయుగంలో, మహా మహా రావణాసురుడినే ఢీకొన్న రాముడితో, కలియుగ రాజకీయ వాదులు చిత్రవిచిత్ర విన్యాసాలు చేయిస్తున్నారు. బాబర్‌తో యుద్ధం చేయించారు. ఇప్పుడు గాంధీతో కుస్తీ పట్టిస్తున్నారు ! ఓట్ల బొమ్మని చేసి ఆడిస్తున్నారు ! హే రామ్ ! ❑ **(ప్రజాతంత్ర సౌజన్యంతో)**

# దేశ నాయకుల అబద్ధాలను బట్టబయలు చేస్తున్న గ్రోక్..!



- దేవరాజు మహారాజు

**"దేశాన్ని చూస్తుంటే భయమేస్తుంది" అని నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. దేశంలో కలిసి మెలిసి జీవిస్తున్న హిందూ-ముస్లిం ప్రజల మధ్య చీలికకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రత్నిస్తున్నాయని అమర్త్యసేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే ప్రశ్నించే గొంతులు అవసరముందని, అయితే ప్రశ్నించే వారిని కేంద్ర ప్రభుత్వం జైల్లో వేస్తోందని, అనేక రకాల హింసలకు గురి చేస్తోందని, లేదా సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో చంపేస్తుందని వాపోయారు.**

న హిందు బురా హై న ముసల్మాన్ బురా హై

ఓ దోనోంకొ ఆపస్‌మె లడారహా హై, ఓ సైతాన్ బురా హై

**హిందువు చెడ్డవాడు కాదు, ముస్లిం చెడ్డవాడు కాదు. వారిద్దరి మధ్య చిచ్చు పెట్టి, గొడవలు సృష్టించే ఆ 'సైతాన్' (చెడు ఆలోచన లేదా స్వార్థపూరిత శక్తులు) మాత్రమే చెడ్డది.**

జిస్ దిన్ గీతా ఔర్ ఖురాన్‌కొ జాన్ జావోగే

ఉస్ దిన్ దంగా కర్‌వానే వాలోంకో పహచాన్ జావోగే

**భగవద్గీత, ఖురాన్‌లలో ఏముందో తెలుసుకున్న రోజు ఈ అల్లర్లు, దొమ్మీలు జరిపించే వారెవరో తెలుసుకుంటారు.**

ఇలా కవులు సమాజాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. జాగృతం చేస్తూనే ఉన్నారు. సమాజం వాటిని స్వీకరించే స్థితిలో ఉండాలి కదా ? బుల్లెట్‌ను ఓ కవిత ఆపలేదు. బాంబును ఓ నవల నిర్వీర్యం చేయలేదు. అయినా కూడా కవులూ, రచయితలు బలహీనులు కాదు. వారు గొంతెత్తి నిజాన్ని పాడతారు. అబద్ధాల కోరు ఎవరన్నది ఎలుగెత్తి ప్రపంచానికి చాటుతారు.

"ఎంతో మంది మనుషులను చూశాను. తమ శరీరాన్ని కప్పుకోవడానికి వారికి సరిపోయిన గుడ్డలే లేవు. మరో వైపు రోడ్ల మీద అందంగా తిరుగాడే రంగు రంగుల ఖరీదైన గుడ్డలనూ చూశాను. అందులో మరి మనుషులే లేరు" అని సులభమైన మాటల్లో ప్రపంచ పరిస్థితిని పర్షియన్ కవి షేక్ సాది షిరాజి వివరించారు. అలాగే అలెగ్జాండ్రియా మహిళా తత్త్వవేత్త, ఖగోళ శాస్త్రవేత్త హైపాటియా అలెగ్జాండ్రియా (350-415 సీఈ) చెప్పిన విషయం గురించి ఆలోచించడానికి ఈ 21వ శతాబ్దంలో కూడా కొందరు భయపడుతున్నారు. "సరదా కథలను సరదా కథల్లాగానే ఉండనివ్వండి. విశ్వాసాలను విశ్వాసాలలానే చెప్పండి. అద్భుతాలను కవితా కల్పనలను చెప్పండి. అంతేకానీ-అంధ విశ్వాసాలను వాస్తవాలుగా, నిజాలుగా చెప్పడమంత నికృష్ట చేష్ట మరొకటి ఉండదు" అని ఆమె అన్నారు. ఈ మాటల్లో ఎంత వాస్తవం ఉందో ఒకసారి ఆలోచించండి.

## గ్రోక్ రంగ ప్రవేశం..

కవులు, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు వరుసగా హత్యలకు గురైనందుకు నిరసనగా ఈ దేశంలో పదేళ్ల క్రితం "అవార్డు వాపసీ" అనే ఒక కార్యక్రమం జరిగింది. అప్పుడు ఇదే ప్రభుత్వం అధికారంలో ఉంది. సత్యం కోసం సంఘర్షిస్తున్న ఇలాంటి వారి వెనుకిప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) గ్రోక్ కూడా నిలబడింది. గ్రోక్ అనే ఇంగ్లీషు పదానికి అర్థం- ఏదైనా అంశాన్ని ఎవరైనా లోతుగా అర్థం చేసుకోవడం. ఈ పదాన్ని మొదట రాబర్ట్ ఏ హెన్లీన్ అనే రచయిత, "అపరిచితుడు ఒక అపరిచిత దేశంలో" అనే తన సైన్స్ ఫిక్షన్ నవలలో వాడాడు. ఆ పదాన్నే తీసుకుని ఎలెన్ మస్క్ తన ఎక్స్ ఏఐ టూల్‌కు "గ్రోక్" అని పేరు పెట్టుకున్నాడు.

మన దేశంలో అబద్ధాలు ప్రచారం చేస్తూ, మత విద్వేషాలు రెచ్చగొడుతూ అధికారంలో కొనసాగుతున్న ఆర్ఎస్ఎస్-బీజేపీల బండారాన్ని ఇప్పుడు ఆ గ్రోక్ బయట పెడుతోంది. గత పదకొండేళ్లలో ఎంతో మంది మేధావులు, రచయితలు, కవులూ, కళాకారులూ, రైతులు, మహిళలు, బాధ్యత గల పౌరులందరూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం అణిచి వేస్తూనే ఉంది. కొందరిని జైలులో వేయించింది. మరి కొందరిని హత్యలు చేయించింది. ఇప్పుడు వీరందరి పక్షాన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ చాట్‌బాట్ రంగంలోకి దిగింది. బీజేపీ, వారి పెద్ద పెద్ద నాయకుల అబద్ధాలను ; వికృత చేష్టలను గ్రోక్ బయటికి తీస్తోంది. శిక్షిద్దామనుకుంటే, ఇది మనిషి కాదు. ఏం చేద్దామని ప్రభుత్వ పెద్దలంతా తలలు పట్టుకున్నారు. నిజాలన్నీ ప్రజలకు తెలుస్తూ ఉంటే, ఇక తమ మాట చెల్లుబాటయ్యేది ఎట్లా ? అని బెంగ పెట్టుకుంటున్నారు. దీన్ని విదేశీయుల కుట్రని అన్నా అనగలరు. నాలుగు వేల ఐటీ ఉద్యోగులతో ఐటీ సెల్‌ను రూపొందించి, రోజుకు లక్షల కొద్ది తప్పుడు వార్తలను, తప్పుడు

వీడియోలను ప్రపంచానికి అందిస్తున్న తెలివిగల ధనిక పార్టీ కదా..! దేశంలోని ప్రధాన మీడియానంతా కొనేసి, వాస్తవాలను బయటికి రాకుండా ఎంత కట్టడి చేసినా ఇదేమిటి ఇలా జరిగిందని కుమిలిపోతున్నారు. ప్రతి విషయాన్నీ వక్రీకరించి, అబద్ధపు కథనాలతో దేశ ప్రజలను ముఖ్యంగా యువతను తప్పుదారిన నడిపించే కార్యక్రమానికి అడ్డకట్ట పడింది. గాంధీ, నెహ్రూ కుటుంబాలపై అల్లిన తప్పుడు కథనాలన్నీ పటాపంచలయ్యాయి.

## సవాలుగా మారిన గ్రోక్

సావర్కర్, గోల్వాల్కర్‌ల నిజ స్వరూపం యువతకు చూపిస్తోంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏ మాత్రం పాల్గొనని ఆర్ఎస్ఎస్-బీజేపీలు చెప్పే కల్పిత కథలు, కుహనా దేశభక్తి జనం తెలుసుకోగలుగుతున్నారు. ఇన్నేళ్లుగా కొందరు కవులూ, రచయితలూ, వక్తలు, చరిత్రకారులు, స్వతంత్ర జర్నలిస్టులు మర్యాదగా, మెత్తగా చెపుతూ ఉంటే జనాల మెదడుకు ఎక్కడం లేదు. ఇప్పుడీ గ్రోక్ ఏం చేస్తుందంటే, తిడితే తిడుతుంది. అరిస్తే అరుస్తుంది. దెబ్బకు దెబ్బ అన్నట్టు సమాచారమందిస్తోంది. నిజాలను కుప్పబోస్తోంది. గ్రోక్ ఉద్ధృతిని, వేగాన్నీ ఈ చదువు రాని అవివేక మూర్ఖ శిఖామణులు ఎలా ఎదుర్కొంటారో మరి. ఆవలిస్తే పేగులు లెక్కబెట్టే రకం కాదిది. ఆవలించుకున్నా, ఆపరేషన్ చేసి రుగ్మతలను బయట పెట్టే రకం.

డ్రైవర్ లేకుండానే ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌తో నడిచే కార్ల గురించి మనకు తెలుసు. సర్జన్ లేకుండానే ఏఐ పరికరం ఆపరేషన్‌లు చేస్తుందని విన్నాము. కాళ్లు బలహీనమై, నడవలేని స్థితిలో ఉన్న ఒక వృద్ధుడికి కాళ్లు బాగు చేసిన ఏఐ అతణ్ణి నడిపిస్తోందన్న వార్త కూడా చదివాము.

మనిషి కేంద్రంగా సాధిస్తున్న విజయాల ముందు వైజ్ఞానిక ప్రగతి ముందు-మతం కేంద్రంగా నడిచే దురహంకారుల పాలన ఎంత కాలం సాగగలదు ? తమలోని కుట్రలను, కుతంత్రాలను రాల్చేసుకుని-మనుషులను ప్రేమించే, గౌరవించే "మనుషులు"గా మారక తప్పదు.

"ఒకవేళ ఈ గ్రోక్‌ను బ్యాన్ చేసి నోరు మూయించి-అధికారంలో ఉన్న వారు మరిన్ని అరాచకాలకు దిగితే ఎలా?" అని బెంబేలు పడాల్సిన పనే లేదు. అప్పుడు సత్యాన్ని సత్యంగా నిక్కచ్చిగా చెప్పే గ్రోక్‌లాంటి వర్షన్లు రూపం మార్చుకుని మరో పది వస్తాయి. అబద్ధపు కూతలు కూసేవాడెవడైనా సరే- గ్రోక్ కమాండ్‌తో ఏ డ్రోన్ వచ్చి, వాణ్ణి అమాంతం తీసుకుపోయి ఏ సముద్రంలోనో విసిరేయవచ్చు. లేదా ఏ పర్వతాల మీదో, కీకారణ్యంలోనో ఒంటరిగా బతకమని వదిలేసి రావొచ్చు. చెప్పలేం - ఇలా గ్రోక్ అనే ఏఐ వచ్చి తమ మాడు పగలగొడుతుందని నేటి దేశ నాయకులేమైనా కలగన్నారా? లేదు కదా ? మనదే తెలివి అని ఎవరైనా సరే అనుకోగూడదు. మన కన్నా తెలివిగల వాళ్లు ప్రపంచంలో చాలా మంది ఉన్నారన్నది గ్రహిస్తే మంచిది.

ఇదిగాక పోతే, మరోలా కూడా జరగొచ్చు. గ్రోక్ ద్వారా నిజాలేమిటో తెలుసుకుంటున్న జనం అబద్ధాలు చెపుతున్న వారి మీదికి తిరగబడొచ్చు. ప్రజా ఉద్యమాలే వచ్చి ప్రభుత్వాలను మార్చుకోవచ్చు. ప్రపంచ దేశాల్లో ఎన్నో చోట్ల చూస్తూనే ఉన్నాం కదా? మొదటి నుంచి చెప్తున్నట్టుగానే మనం జనాన్ని వివేకవంతులుగా చేస్తూ ఉండాలి. రచనలు, ఉపన్యాసాల ద్వారానే కావొచ్చు. లేదా ఇప్పుడు కొత్తగా వచ్చిన, వస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పరికరాల ద్వారానే కావొచ్చు. "సమాదరణ అనేది భారతదేశపు ఆత్మ" అనేది ఇటీవలి కాలం నాటిది కాదు. శతబ్దాల నుంచి ఈ దేశపు ఆత్మ ఇదేనని శిలా శాసనాలు కూడా ఘోషిస్తున్నాయి.

అశోక చక్రవర్తి 12వ శిలాశాసనంలో, **"ఒక పాషాండ మతానికి చెందిన వారు తమ మతాన్ని తామే పొగడుకుంటూ ఉంటారు. పైగా ఇతరుల మతాల వారిని నిందిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తమ మతానికే ఎక్కువ నష్టం కలుగుతుంది. ఇతర మతాలను, ధర్మాలను గౌరవించడం వల్ల తమ మతానికి గౌరవం పెరుగుతుంది. తమ మతం అభివృద్ధి చేసుకోవడానికి అవకాశముంటుంది. జనులందరి అభివృద్ధి ముఖ్యం. అది ధర్మ(న్యాయ) బద్ధంగా జరగాలి-దానాలు, పూజలు అంత ముఖ్యం కాదని దేవానాం ప్రియ(అశోకుడు) భావిస్తున్నాడు"** అని పేర్కొనబడింది. సాధారణ శకానికి ముందే అశోకుడు ఈ దేశపు ఆత్మ గురించి చెప్పాడు. ఆ తర్వాత కాలంలో వచ్చిన ఎందరో మహానుభావులు ఈ విషయాన్నే ఆధునీకరించి విస్తృతపరిచారు.

మనుషులందరికీ సమాన స్థాయినిస్తూ - విద్య, ఉద్యోగం, ఆరోగ్యంపై దృష్టి పెట్టని ప్రభుత్వాలని సమాజం సహించలేదు. మనుషుల మధ్య ద్వేషాన్ని పెంచే ప్రభుత్వాలు ఏం సాధించాలని అధికారంలో ఉండాలి? అవసరమా? అన్న ఆలోచన సగటు మనిషిలో వస్తే, ప్రతి ఒక్కడూ ఒక విప్లవకారుడవుతాడు. ఆధునికుడి శక్తి సామర్థ్యాలను మతాలూ, యోగులు, బాబాలు, స్వాములు, ముల్లాలు, ఫాదర్‌లు, పురోహితులు ఎవరూ అదుపులో పెట్టలేరు. వారే ఆధునికుడి వైజ్ఞానిక కృషి ముందు మోకరిల్లి శరణు వేడాల్సిన సమయం వచ్చింది.

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ భవిష్యత్తులో ఎలా రూపుదిద్దుకుంటుందో అవివేకులు ఊహించలేరు. వివేకవంతుడి ఊహను, ప్రణాళికను అందుకోనూ లేరు. రాబోయే యుగం, వైజ్ఞానిక దృక్పథం గల పౌరులదీ, వైజ్ఞానికులదీ కాక తప్పదు. తప్పదుగాక తప్పదు. ❑ **(ది వైర్ సౌజన్యంతో)**

# మూఢత్వ పోకడలపై ఖడ్గధారి వేమన



\- తెలకపల్లి రవి

**నా**టికి నేటికీ తెలుగు వాడికీ, వేడికీ వడికీ వరవడి వేమనే. ఆ నాటికి బహుశా ఈ నాటికి కూడా తనతో పోల్చదగిన మరో ప్రజాకవి మనకు కనిపించరు. తమ తమ కోణాల్లో, బాణీల్లో మహోన్నత శిఖరాలధిరోహించిన మహాకవులు ఆయన పదును ముందు, పలుకుల ములుకుల ముందు నిలవడం కష్టం. అందులోనూ అన్ని రంగాలనూ స్పృశించిన వారు అనుక్షణం గుర్తుకు వచ్చే శాశ్వత వాక్యాలు సృష్టించిన వారు మరిలేరు. తెలుగు భాషలో వేమన పద్యచరణాలు సామెతలుగా మారిపో యాయి. నానుడులుగా స్థిరపడిపోయాయి. ఎందుకంటే అవి జీవితంలో నుంచి వచ్చాయి. జీవితంలో నిలిచిపోయాయి. జీవిత సత్యాలై పోయా యి. ఇన్ని తరాలపాటు తెలుగు జాతికి ఉత్తేజ కారకంగా నిలిచిన వేమన పద్యాలు పాడేసుకుంటున్నాం.. వాడేసుకుంటున్నాం. కాని వాటి కర్త వేమన గురించి మనకు తెలిసిందెంత ? తెలుసుకున్నదెంత ? తెలుసుకోవాలనే ప్రయత్న మెంత ? తెలిసిన దాన్ని తెలివిడితో ఉపయోగించినదెంత ? అదైనా ఎంత కాలం తర్వాత ?

ఎంత కొద్ది మంది పరిశోధకులు, ఎంత పరిమితంగా ఆయనపై దృష్టి పెట్టారు ? మరి మన నరాల్లో, స్వరాల్లో భాగమైపోయిన ప్రజాకవి జీవితం పట్ల ఇంత అలసత్వం, ఆలస్యం ఎందుకు ప్రదర్శితమైంది ? ఈ ప్రశ్నలలోనే వేమన ఔన్నత్యం మనకు చాలా వరకూ తెలిసిపోతుంది. సనాతన మహామహోపాధ్యాయులు అనేక మందికి ఆయన పద్యాలు మరఫిరంగుల్లా తోచాయి. వాటిని చూడటానికే వెరచి సమాధి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నం చేసి విఫలమైనారు. జాతిని జాగృతం చేసే జయపతాకల్లా ఆయన పద్యాలు దాచి పెట్టిన కొద్ది ధగధగలాడాయి. ఆయన జీవితం గురించి అవాస్తవాలు చెప్పిన కొద్ది అసలు విషయాలపై ఆసక్తి ప్రబలింది. సిపి బ్రౌన్‌తో సహా పాశ్చాత్య పరిశోధకులు, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, నార్ల వెంకటేశ్వరరావు, ఆరుద్ర, బంగోరె వంటి వాళ్లు అందరి కృషికి క్రోడీకరణగానే గాక అపురూప విషయ సేకరణకు ప్రతిరూపంగా ఎన్.గోపి వేమన సమగ్ర సందర్శనం చేయించారు. ఉన్న పరిమిత ఆధారాల ప్రాతిపదికన అధ్యయనాలు చేసి హేతుబద్ధమైన అవగాహన ఇవ్వగలిగారు. వారు చేసిన కృషికి ధన్యవాదాలు చెబుతూ. వేమన ప్రభావంతో పోలిస్తే దొరికింది చెప్పుకుంటున్నది తక్కువేనని గుర్తిస్తూ పరిశోధనలు కొనసాగించాల్సిందే.

### వేమన పద్యాల ప్రభావం

వేమన అంటే వేమన పద్యాలే. ఎవరు వేమన, ఏవి వేమన పద్యాలు తేల్చడానికి చాలా కాలం పట్టింది. ఇంత విస్తారంగా, అనుకరణ పద్యాలు కూడా తనవే అనిపించేంత శక్తివంతంగా వచ్చాయంటే వేమన ప్రభావం ఎంత గొప్పదో తెలుస్తుంది. వేమన పద్యాలను ఇంత కాలం చీకట్లో అట్టిపెట్టిన వారు ఎన్ని అకృత్యాలకు పాల్పడి వుంటారో ఊహించడం కష్టం కాదు. ఊహించడం అవసరం కూడా. చార్వాకులు, లోకాయతు ల రచనలను వారి విమర్శకుల నుంచి తెలుసుకున్నట్టే వేమన ప్రతులను వ్యతిరేక కుల గుప్పిటి నుంచి విడిపించాల్సి వచ్చిం ది. పరస్పర విరుద్ధంగా ఇలా వేమన చెప్పి ఉంటాడా ? అనే సందేహం కలిగిన చోట్ల ఈ అంశం కూడా గమనంలో ఉంచుకోవ డం అవసరం. ఆ భావాలను సహించలేని వారు భాష్యాలు మార్చడానికి ప్రయత్నించి ఉంటారనడంలో ఆశ్చర్య మేమీ లేదు. పండితులూ, పరిశోధకులందరూ ఇంచుమించుగా వేమన 1650వ ప్రాంతంలో వాడని తేల్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19ని వేమన జయంతిగా నిర్వహించాలని నిర్ణయించిం ది. రకరకాల వేమన అభిమానులు ఆ తేదీని చాలా కాలంగా పాటిస్తూ వస్తున్నారు. 16వ శతాబ్దం తెలుగు వారి చరిత్రలో అంతకు ముందెన్నడూ ఎరుగని సంక్షోభాలను చూసింది. అదే కల్లోలం అనేక రూపాలలో మరో మూడు వందల ఏళ్లు కొనసాగింది. ఒక వెలుగు వెలిగిన విజయనగర సామ్రాజ్యం బలహీనపడిపోతున్న దశ అది. దాని పతనంతో దక్షిణ భారత చరిత్రలో కొత్త మార్పులు వచ్చాయి. అయినా 500 ఏళ్ల తర్వాత కూడా విజయనగర కాలం ప్రజల మనసుల్లో పచ్చగా ఉండిపోయిందంటే ఆ రాజుల రాజనీతి నైపుణ్యం, తమ పాలనా ప్రాంతంలో సానుకూల ఆర్థిక సామాజిక సాంస్కృతిక అభివృద్ధి కోసం వారు అనుసరించిన విధానాలే కారణం. ఒక దశలో మొత్తం దక్షిణ భారతదేశం స్థానిక తేడాలు భాషా సాంస్కృతిక నైతిక విలువల వ్యత్యాసాలతో ఈ ప్రభావాన్ని చూసింది. విజయనగర రాజులు స్థానికంగానూ, అంతర్జాతీయంగానూ వర్తక వాణిజ్యాలను ప్రోత్సహించారు. రేవు పట్టణాలలో విదేశీయులకు ద్వారాలు తెరిచి వ్యాపార సంబంధాలు పెంచుకు న్నారు. వేమన కవిత్వంలోని సంక్లిష్టతను, సంఘర్షణను సమగ్రంగా అర్థం చేసుకోవాలి. అందుకు విజయనగర సామ్రా జ్య పతనం ప్రభావాన్నే గాక ఆ

రాజ్య విధానాల వల్ల ఏర్పడిన వాతావరణ ప్రభావాన్ని కూడా గమనంలో ఉంచుకోవాలి. ఎందుకంటే కల్లోల కాలమెప్పుడూ కవిత్వానికి కవివాక్కుకూ పదును పెడుతుంది. సంక్షోభంలో వంవేదనలు సాంద్రమవు తాయి. సంక్లిష్టతలు సాహిత్యసృజనగా మారతాయి. వేమన కవి త్వంలో మనం స్థిర సమాజాన్నే గాక మారుతున్న విలువలను కొత్తపాతల ఘర్షణను కూడా చూస్తాం. గురజాడ చెప్పిన కొత్త పాతల మేలుకలయిక అన్న అర్థంలో కాదు. పుడమితల్లికి పురిట నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపచేస్తున్న దశ. అదే వేమన పద్యా లకు అంతటి వైవిధ్యాన్ని నైశిత్యాన్ని ఆవేదనాగ్రహాలను తెచ్చిపెట్టింది.

### కల్లోలంలో కాంతిధార

17వ శతాబ్దమంతా యుద్ధాల మయమే. కేంద్రంలో రాజులు ఎవరనే దానితో నిమిత్తం లేకుండా స్థానిక ప్రభువులు పాలె గాళ్లుగా పేరొందిన పాళియగార్లు దిగువన పెత్తనం చేస్తూ ప్రజలను పీడిస్తూ వచ్చారు. నిజానికి ఈ పాలియగార్లు చిల్లర రాజులు పొరుగు ఊళ్లను దోచుకున్న ఉదంతాలు కోకొల్లలు. విజయనగర రాజులు విపరీతమైన వికేంద్రీకరణ విధానాన్ని అనుసరించారు. మండలాధిపతులు పూర్తి అధికారం చెలాయిం చడమే గాక స్వంత నాణేలు కూడా ముద్రించుకునే వారు. సైనిక బలం ఎక్కువగా ఉన్న వారి పెత్తనమే జరిగేది. వారు వసూలు చేసిన దానిలో సగం పైకి పంపించేవారు. రైతులు పన్నులు కడుతుంటే పైవర్గాల వారు విలాస జీవితం గడిపేవారు. కంసాలి చేనేత వంటి వృత్తుల వారు కొంత నిలదొక్కుకుంటున్నా గ్రామీణ వృత్తులు మాత్రం చితికిపోతున్నాయి. ఇవన్నీ వేమన పద్యాలలో ప్రతిబింబించాయి. సామాజికంగా ఈ కల్లోలిత పరిస్థితులు ప్రజలలో అభద్రతను పెంచి మూఢనమ్మకాలకు పాలు పోశాయి. వర్ణవ్యవస్థ వికృతరూపం దాల్చింది. క్రీ.శ. 1600లో ఈస్ట్ ఇండియా వర్తక సంఘం ఏర్పడగా 1611లో నిజాంపట్నం, మచిలీపట్నంలతో వ్యాపార సంబంధాలు పెరిగా యి. పైన చెప్పుకున్న వృత్తికారుల జీవితాలను కంపెనీ ప్రభావి తం చేయడం పెరిగింది. ప్రభుత్వం ఒకవైపు, కులీన పాలక వర్గాలు మరోవైపు, కొత్తగా పెంపొందుతున్న వాణిజ్యవర్గం ఇంకోవైపు వృత్తిదారులతో చెలగాటమాడాయి. సమాజంలో ఉత్పత్తి వ్యవస్థలూ ఆర్థిక సాంస్కృతిక జీవనం ఊహాతీతమైన మార్పులకు గురైంది. కుల, మత భేదాలను వారు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మొదలుపెట్టారు. బ్రిటిష్ వారు ప్రత్యేకించి మన బంగారు నిల్వలపైన, నూలు బట్టలపైన కన్నేయడంతో పైకి వస్తున్న ఆ వర్గాలే ఎక్కువగా చితికిపోయా యి. ఈ పరిస్థితులన్నిటిలో ప్రజలకు ఎంతో కొంత ఊరట కలి గించవలసిన మతం ఆధ్యాత్మికత కూడా అంత:కలహాల్లోనూ పర స్పర విద్వేషాల్లోనూ కూరుకుపోయాయి. ఇవన్నీ వింటుంటే మన కు ఇప్పటి పరిస్థితులు గుర్తుకు వస్తే ఆశ్చర్యం లేదు. ప్రపంచీక రణ నేపథ్యంలో పల్లె కన్నీరు పెడుతుందో గోరటి వెంకన్న పాట గుర్తుకు వస్తే వింత అంతకన్నా ఉండదు. వీటి నేపథ్యంలో పుట్టిన క్రాంతదర్శి వేమన.

"శతక కవుల్లో శీర్షికలా నిలిచిన వేమన-ఏకపక్ష నీతికి వ్యతిరేకంగా నిలిచిన శేష ప్రశ్న- సోకాల్డు భారతీయ సంస్కృతి కుళ్లును బయటపెట్టిన ధిక్కారం వేమన- అదృష్టవంతులనబడే స్వార్థపర కూటమి చేతుల్లో పడిన ఫ్యూడల్ సమాజ అశాంతి వేమన-కాలజ్ఞాన చైతన్యం వేమన-యుగ అరాచకంలో మొలు చుకువచ్చిన తత్కాల సంస్కారం వేమన-ఫ్యూడల్ యుగ స్వభావాన్ని నిలదీసిన ఆందోళన-అసాధ్య భావజాలం-అపార భాషా నుడికారం-యుగస్వభావ సాక్షాత్కారం-అలజడిని అక్షరీకరించిన ఆక్రోశం-ఆక్రోశాన్ని నుడికారం చేసిన సామెత-అభివ్యక్తి నభూతో నభవిష్యతి."(జ్వాలాముఖి)

### నేటికీ వెలుగుజాడ

హేతుశీలత, మానవీయత, సామాజిక న్యాయం, ధిక్కార తత్వం, శ్రమ గౌరవం, ప్రతిఘటనల ప్రతిబింబమైన వేమన ఈనాటి అవసరాలకూ ఆలంబమే. అంతెందుకు ? వేమన పద్యాలలో ఉన్నన్ని ప్రశ్నలు మరే కవిలోనూ మనకు కనిపిం చవు. భక్తి తెచ్చిన బాధలో కనిపించని దేవుడిని ప్రశ్నించిన వారున్నారు గాని, కనిపించే సమాజ దుర్లక్షణాలపై కత్తిదూసిన వారు, రాజులనూ యాజులనూ బూజులనూ ప్రశ్నించిన వారు వేమనలా ఎందరో లేరు. అందుకే ఆయన వారసత్వం అమూ ల్యం. అసమానం. వేమన తన కాలం కన్నా చాలా చాలా ముందుకు నడిచాడు. కుండ కుంభమయ్యె కొండ పర్వతమయ్యె అంటూ సంస్కృతీకరణను కూడా ఎత్తి చూపాడు. మాలల గురించి మరో మూడు వందలేళ్ల తర్వాత గురజాడ చెప్పింది అప్పుడే చెప్పేశాడు. మాలవాని నంట మరి నీళ్ల మునిగేరు అనీ, మాల వానినేల మహిలోన నిందింప అనీ చాలాచోట్ల ఆ ప్రస్తావనలు చేశారు. పైగా పండితులమని విర్రవీగే వారిని ఉద్దేశించి వాస్తవికతతో సంబంధం లేని చిలకపలుక వంటిదనని గురజాడ చెప్పింది కూడా వేమన కూడా రాసిందే. శ్రమములోన పుట్టి సర్వంబు తానౌను అన్నప్పుడు శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదన్న శ్రీశ్రీ గుర్తుకు రాకుండా ఉండదు. అల్పబుద్ధివానికధికారం ఇవ్వడం, గణకులొప్పుకున్న గవ్వలు చెల్లడం, రాతిబొమ్మలకు రంగైన వలువ లేలని ఆక్షేపించడం, శకునాలను ముహూర్తాలను తోసిపుచ్చడం ఇవన్నీ ఈనాటికి కూడా పూర్తిగా వర్తించేవే. ప్రవచనకారులు, వందల శ్లోకాలు వల్లె వేసే వారు జనం నోట నానే వేమన పద్యాలను ఎందుకు తల్చుకోరంటే అదే కారణం మరి, అందుకే ప్రజా కళాకారులు ఉద్యమకారులు వేమనను మరింతగా తలుచుకోవాలి. ఆ పదును పెంచుకోవాలి. ❑ **(నవ తెలంగాణ సౌజన్యంతో)**

# అభ్యుదయ సాహిత్య విమర్శకుడు చందు సుబ్బారావుకు నివాళి

## సాహిత్య సీమలో వైజ్ఞానికుడు

- ప్రొఫెసర్ కె.యస్.చలం




ఆచార్య చందు సుబ్బారావు జనవరి 29న విశాఖపట్నంలోని తన గృహంలో మరణించారు. ఈ హఠాత్పరిణామానికి సాహితీ లోకం ఘొల్లుమంది. అందరూ ముద్దుగా పిలిచే 'చందు' లేకుండా విశాఖపట్నంలో ఏ సాహితీ సమావేశం జరిగేది కాదు. చందు సుబ్బారావు ప్రసంగాలు, పుస్తకాలు, సాహితీ విమర్శనా బాణాలు అందుకున్న వారు – ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయం లో తెలుగు ఆచార్యులేమోనని అనుకునేవారు. కానీ ఆయన భూభౌతిక శాస్త్ర ఆచార్యుడు. అనేక పరిశోధనలు చేసి, పుస్తకాలు, వ్యాసాలు ప్రచురించి, పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేసిన సైంటిస్ట్. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చదలవాడ గ్రామంలో 1946 మే 18న సుబ్బారావు జన్మిం చారు. తల్లిదండ్రులు వెంకటకృష్ణయ్య, రాజ్యలక్ష్మి. వీరిద్దరూ కమ్యూనిస్టులుగా కొనసాగుతున్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. అలా పెళ్లి చేసుకున్న వారిలో వీరు తొలితరం దంపతులు. తండ్రి ఉపాధ్యాయుడు, మేనమామ ప్రఖ్యాత రచయిత బొల్లిముంత శివరామకృష్ణ కావడంతో సుబ్బారావుకు చిన్నప్పటి నుంచే వామపక్ష భావజాలం, సాహిత్యం అబ్బినవి.

సమాజంలో చెడు పోకడలు, సాహితీ ప్రపంచంలో వస్తున్న పెడధోరణులు, సైన్సు అనుకున్నంత గొప్పగా భారతదేశంలో అభివృద్ధి చెందకపోవడం.. వంటి వాటితోపాటూ దళిత, బహు జన, మహిళల స్థితిపై చందు నిత్యం మానసిక ఘర్షణ పడేవారు. ఆ ఆవేదనలోంచి వచ్చిన ఉపన్యాసాలు జనాన్ని ఉర్రూతలూగించేవి. చందు వలే అటు ప్రాచీన సాహిత్యాన్ని, ఇటు ఆధునిక సాహిత్యాన్ని సమపాళ్లలో రంగరించి మాట్లాడేవారు తెలుగు రాష్ట్రాల్లో బహు అరుదు. చందు – శ్రీశ్రీ అభిమాని. 1970లో శ్రీశ్రీ పుట్టినరోజు సందర్భంగా విశాఖలో నిర్వహించిన 'విశాఖ విద్యార్థుల సభ'లో జ్వాలాముఖి ప్రసంగం విన్నవాళ్లలో చందు, నేనూ ఉన్నాం. తరువాత విశాఖ రచయితల సంఘంలో చేరి పురిపండా, రాచకొండ, కాళీపట్నం, చలసాని ప్రసాద్ అప్పుడప్పుడూ గొల్లపూడి, భమిడిపాటి వంటి అనేక సీనియర్ రచయితలతో కలిసి ఆయన సాహితీ చర్చలు చేసేవారు. ఆంధ్రా యూనివర్సిటీలో అప్పటికి తూమాటి దోణప్ప, పరిశోధకులుగా ఉన్న వెల్చేరు నారాయణరావు, బంగొరెతోపాటు కొర్లపాటి శ్రీరామమూర్తి, మలయవాసిని, అత్తలూరి నరసింహరావుతో సాహితీ సమాలోచనలు జరుపుతుంటే – ఈయనెవరు ? ఆర్ట్స్ కాలేజీలో ఏ డిపార్టుమెంటు వారు ? అనుకునే వారంతా. చందు సుబ్బారావు సైన్స్ కాలేజీ మనిషి. ఫ్యాకల్టీ క్లబ్ నుంచి ఎక్కువగా సామాజిక శాస్త్రాలు, తెలుగు భాషా సాహిత్యం, ఆంగ్ల భాష అధ్యయనంతో పాటు, హిందీలో ఆదేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వంటి వారితో ఎక్కువ సమయం గడిపేవారు.

చందు తన సబ్జెక్ట్ అయిన భూ భౌతికశాస్త్రానికి సంబంధించి విశాఖ ప్రాంతంలో నీటి వనరులు, అక్కడి కాలుష్యంపై పరిశోధనలు చేశారు. గ్రౌండ్ వాటర్ పెరుగుదలకు సంబంధించి జాతీయ సెమినార్లు ఏర్పాటు చేయటం, దానికో సంఘాన్ని ఏర్పాటు చేసిన వాళ్లలో చందు ప్రముఖ పాత్ర పోషించారు. ఆ సందర్భంలోనే – 'చందూ! నువ్వు తెలుగు సాహిత్యంపై కృషి చేస్తున్నా, మంచి గుర్తింపు ఉన్నా, మనం యూనివర్సిటీ అధ్యాపకులం... మన పరిశోధనలు, ప్రచురణలు, పరిశోధక నిర్వహణ ఆధారంగానే మనకు గుర్తింపు ఉంటుంది' అని నేనాయనతో అంటే, అప్పుడు ఇంగ్లీషులో మూడు పుస్తకాలు ప్రచురించారు. బల్గేరియాలో పరిశోధన నిమిత్తం కొంతకాలం ఉండి, కమ్యూనిస్టు దేశాలు పర్యటించారు.

చందు సుబ్బారావు సుమారు 20 పుస్తకాలు ప్రచురించారు. కొన్ని వందల వ్యాసాలు రాశారు. ఆయనే రాసుకున్నట్లు "రాసే

గుణంతోపాటు గుర్తుంచుకునే బుర్ర ఉండడం వల్ల అయిదు దశాబ్దాల చరిత్రను(సాహితి) తెల్ల కాగితాలకు ఎక్కించాను. 1968లో మహీధర రామమోహనరావు, శివరాం మావయ్య, మోహన్, గులాం గౌస్, పెద్దిబొట్ల, ప్రకాశ్ తదితరులు విశాలాంధ్ర వారిచ్చిన పేరుతో ఇతర పత్రికల్లో ప్రవేశించి ప్రఖ్యాతి కోసం ప్రయత్నించటం వాస్తవం." ఇంత నిర్మొహమాటంగా తన గురించి ఎలా చెప్పుకున్నారో సాహిత్య విమర్శ రాసేటప్పుడు, మాట్లాడేటప్పుడు అంతే కచ్చితంగా మాట్లాడేవారు. శ్రీశ్రీ కవిత్వంపై మాట్లాడేటప్పుడు... అలవోకగా ఆయన కవిత్వం పలుకుతూ మధ్యమధ్యలో విశ్వనాథ సత్యనారాయణ సంస్కృత భూయిష్ఠమైన ఆంధ్ర భాషా పద్యాలు చదివి రంజింపజేసేవారు. ఆయన ప్రచురించిన సుమారు నాలుగు సాహితీ పుస్తకాలు, అందులో ఎక్కువ వ్యాసాలుగా వివిధ పత్రికల్లో అచ్చయినవి. అవి ఎప్పటికీ చందును తెలుగు సాహితీ విమర్శకుల జాబితా తొలి వరుసలో ఉండేలా చేశాయి. పాఠకులు తప్పనిసరిగా చదవాల్సిన గ్రంథాలుగా తెలుగు శాఖ వారు ఈ పుస్తకాలను పేర్కొంటారని ఆశిస్తున్నా. 'కవికి విమర్శకుడు శత్రువు కాదు' అన్న మకుటంతో వెలువడిన పుస్తకం ప్రతి కవి, విమర్శకుడు చదవాల్సిన పుస్తకం. ముఖ్యంగా తాను అనువదించి, విశాలాంధ్ర ప్రచురించిన 'డా. బాబాసాహెబ్ అంబేడ్కర్' గొప్ప అనువాదం.



ఒక సందర్భంలో వేగుంట మోహన్ ప్రసాద్ కవితా సంకలనాన్ని యూనివర్సిటీలో ఆవిష్కరింపజేసి, అద్భుతంగా మాట్లాడారు. నేను అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు మన రాష్ట్రం, వివిధ రాష్ట్రాల అధ్యాపకులు ముఖ్యంగా తెలుగు భాషా ఉపన్యాసకులు పునశ్చరణ తరగతులకు వచ్చినప్పుడు చందు సుబ్బారావు ప్రసంగాలు ఉండేవి. ఆ విధంగా తెలుగు రాష్ట్రాల్లో ఉండే తెలుగు, ఆంగ్ల, హిందీ ఉపన్యాసకులు అందరూ చందును గుర్తుపెట్టుకుంటారు. కొర్లపాటి శ్రీరామమూర్తి, మలయవాసిని కో ఆర్డినేటర్లుగా నేను తెలుగు సాహిత్యంపై జాతీయస్థాయిలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంలో అందరం ఆలోచించి 1989-90లో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంపై వారం రోజులు జరిపిన సభలు ఇప్పటికీ గుర్తున్నాయి. 'అరసం'కు అధ్యక్షుడిగా కొంత కాలం పనిచేసినా, విశాఖపట్నం అరసంను పురిపండా, చందు, ఉప్పల అప్పలరాజు చాలాకాలం నడిపించారు. 14వ రాష్ట్ర మహాసభలు విశాఖలో జరిపినప్పుడు రాష్ట్రంలోని అన్ని సాహితీ సంస్థల సభ్యులు, అరసం, విరసం, స్థానిక సంఘాల వారు పాల్గొని మరపురాని స్మృతులను మిగిల్చారు. ముఖ్యంగా తెలుగు పరిశోధకులు చేయని ఒక మంచి పని పరిశోధనలపై పరిశోధన

## చందు సుబ్బారావుకు అరసం నివాళి

**మా**ర్క్సిస్టు రచయిత, అభ్యుదయ రచయితల సంఘంలో ప్రముఖుడు, ఆచార్య చందు సుబ్బారావు విశాఖపట్నంలో మృతి చెందారన్న వార్త దిగ్భ్రాంతి కలిగించిందని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, వల్లూరు శివప్రసాద్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా, మార్క్సిస్టు రచయితగా, భూభౌతిక శాస్త్రవేత్తగా, అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలక సభ్యులుగా ఆయన స్త్రీవాద, రాజకీయ మరియు శాస్త్రీయ అంశాలపై అనేక వ్యాసాలు మరియు పుస్తకాలు రచించారని వారు అన్నారు.

### వ్యక్తిగత మరియు వృత్తి జీవితం

ఆయన మే 18, 1946న ఆంధ్ర ప్రదేశ్‌లోని చదలవాడలో జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. 1974లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో లెక్చరర్‌గా చేరి, ఆ తర్వాత రీడర్‌గా, 1993 నుంచి హైడ్రాలజీ అండ్ వెల్-లాగింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి 1979-82 మధ్య కార్యదర్శిగా వ్యవహరించారు. మరియు ఇండియా మెటియరలాజికల్ సొసైటీలో సభ్యులుగా ఉన్నారు. డాక్టర్ చందు సుబ్బారావు సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. "సైన్స్ అండ్ సివిలైజేషన్"(1997), "కవికి విమర్శకుడు శత్రువు కాదు"(1997), "శ్రీ శ్రీ కా ఆధునిక్ తెలుగు సాహిత్య పర్ ప్రభావ్"(హిందీలో) "ఇండియన్ నవలికలు" వంటి అనేక రచనలు చేశారు. ఇటీవలే నాలుగు విమర్శా గ్రంథాలను ఒకే పుస్తకంగా వెలువరించారు. 1966లో తాపీ ధర్మారావు అవార్డు అందుకున్నారు. 1999లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లా శాఖ నుంచి కొండేపూడి సాహితీ సత్కారం పొందారు. ఆయన జ్యోతిష్యాన్ని విశ్వవిద్యాలయాలలో ఒక కోర్సుగా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించి, హేతువాద దృక్పథాన్ని ప్రోత్సహించారు. ఆచార్య చందు సుబ్బారావు మృతిపట్ల అరసం రాష్ట్ర నేతలు ఉప్పల అప్పలరాజు, ఏఎమ్ఆర్ ఆనంద్, కొమ్మూల పాటి శరత్, జి.ఎస్.చలం తదితరులు విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేసారు. ❑

అంటూ ఒక పీహెచ్‌డీని సమీక్షిస్తూ “అంకెలొక్కటే ప్రమాణాలు కావు, కాని ప్రమాణ సూచికలే” అన్నారు చందు. అంతేకాదు సామాజిక పరిశోధనలపై పరిశోధనలు చెయ్యాలని, ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు, భాషా సాహిత్యాల నుంచి రాబట్టవలసిన రాజకీయ, సాంఘిక శాస్త్రీయ నిర్ధారణలు అవసరం అన్నారు. నగ్నముని కొయ్యగుర్రంపై రాసిన చక్కటి విశ్లేషణ అరసం వారు, విరసం వారే కాదు, తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని ప్రేమించేవారు తప్పక చదవవలసిన వ్యాసం. తెలుగువారి సామ్యవాద ఉద్యమాలు, భారతీయ వైజ్ఞానిక పరిశోధనలలో తెలుగువారి కృషిని సవివరంగా గ్రంథస్థం చేయడమే కాదు, తాను అందులో ఒకడిగా నిలిచిన చందు సుబ్బారావు చిరస్మరణీయుడు. ❑

# సాహితీ విమర్శకు దారిదీపం

**– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు**



వర్తమాన తెలుగు సాహితీ విమర్శకుల్లో తనదైన స్థానాన్ని పదిలంగా నిలుపుకొన్న ఉత్తమ విశ్లేషకులు ఆచార్య చందు సుబ్బారావు. సాహిత్య విస్తృత ప్రయోజనాలకు విమర్శ ఉపయోగపడాలన్నది ఆయన అభిప్రాయం. ఉత్తమ విమర్శకుడిగా ఆలోచనాపరులైన సాహితీవేత్తగా గుర్తింపు పొందిన సుబ్బారావు మొన్న గురువారం కీర్తిశేషులయ్యారు. అభ్యుదయ రచయితగా తెలుగు సాహితీలోకంలో మంచి గుర్తింపు ఉన్న డాక్టర్ చందు సుబ్బారావు 1946 మే 18న తెనాలి సమీపంలోని చదలవాడ గ్రామంలో జన్మించారు. ప్రగతిశీల సాహితీవేత్తగా ఎదగడానికి మేనమామ అభ్యుదయ రచయిత బొల్లి ముంత శివరామకృష్ణ రచనలు, వ్యక్తిత్వం, స్ఫూర్తినిచ్చాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి భూభౌతిక శాస్త్ర విభాగంలో 1968లో అధ్యాపకులుగా చేరి ఆచార్యుడిగా, విభాగాధిపతిగా సేవలందించారు. 2006లో ఉద్యోగ విరమణ చేశారు. ఈ ఏడాది జనవరి 28న కన్నుమూశారు. ‘బేషరతుగా ప్రశంసించు. పావో పరకో కీర్తి నాశించు ఇస్తారు. ఆనందించు. నిజాన్ని పలకవద్దు. నిప్పులాంటిది, కాలుతుంది’ అని విమర్శకుల దుస్థితిని తనదైన బాణీలో ఎత్తి చూపారు.


## విమర్శకుడు శత్రువు కాదు


గాంధీ తత్వం, నెహ్రూ రచనలు, రష్యన్, ఆంగ్ల నవలలు, కార్ల్ మార్క్స్ మ్యానిఫెస్టో, భారతభాగవతాలు, శతకాలు వంటివన్నీ చందు అధ్యయన చైతన్యానికి మూలాలు, తొలినాళ్లలో కరుణశ్రీ. మలినాళ్లలో వేమన, గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర, రాచకొండ, గోపీచంద్... సాహిత్య చైతన్యాన్ని ప్రోదిచేసిన వారుగా ఆయన చెప్పే వారు.

1968లో రాసిన ‘విష వాయువులై అనే కథ ఆయన తొలి రచనగా చెబుతారు. కథ, నవల, విమర్శ, అనువాద ప్రక్రియల్లో రచ నలు చేశారు. శిలా ఖండం సుబ్బారావు కథల సంపుటి, హిమపుత్రి నవలికల సంపుటి, కవి–విమర్శకుడు, సాహిత్యాభినివేశం, చందన చర్చ, నవ్యాలోకనం, శిల్పదృష్టి, సాహిత్యమూ–సైన్సూ వంటివి విమర్శ గ్రంథాలు తన హృదయంలో శ్రీశ్రీ కవిత్వాన్ని అధిష్ఠాన రూపంగా నిలుపుకొన్న చందు సుబ్బారావు మహాప్రస్థానంలోని కొన్ని కవితలను ఆంగ్లీకరించారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి, అరసం కార్యవర్గ సభ్యులుగా చిరకాలంగా ఉంటూ వామపక్ష భావ జాలాన్ని జీర్ణించుకున్న సుబ్బారావు... ఆ కోవ లోని రచయితల రచనలనూ నిర్మాణాత్మకంగా విమర్శించడానికి సంకోచించలేదు. ఏదో వంక పెట్టి ఒక రకం సాహిత్యాన్ని తృణీకరించడంకన్నా, సాహిత్యం నిర్వహించిన చారిత్రక భూమికను గుర్తించమంటారు. తాపీ ధర్మారావు, రా.రా.లను గౌరవిస్తూనే విమర్శ విధానాలను ఆక్షేపించారు. రచనను సమాజపరం చేయడం విమర్శ కర్తవ్యం మనిషికి వైద్యుడు ప్రాణదాత అయినట్టే విమర్శకుడు రచయితలకు హితైషి, అందుకే చందు కవికి విమర్శకుడు శత్రువు కాదు’ అని గట్టిగా చెప్పారు. శిల్పం. కొరవడితే వస్తువు ఎంత గొప్పదైనా జనంలోకి వెళ్లదన్నారు. ప్రేమ, శృంగారం స్వల్ప విషయాలు కావని చందు వంటి వామపక్ష మేధావి అభిప్రాయపడటం ఒకింత ఆశ్చర్యం కలిగించినా, ఆయన విశ్లేషణకు ముగ్ధులమవుతాం.

## వక్తగానూ ప్రసిద్ధులే...

భారతీయ కవితాత్మను చందు సుబ్బారావు పట్టుకున్న తీరు ఆయన విస్తృతమైన అధ్యయన, వివిధ భాషా సాహిత్యాల పరిజ్ఞానానికి నిదర్శనం. ఆధ్యాత్మిక భౌతిక మానవతావాద హృదయ సంస్కారాల్ని పోగు చేసేది సాహిత్యకళ అని చందు విశ్వాసం. ఆయన గొప్ప వక్త కూడా ప్రాచీన కావ్యాల్లోని పద్యాలనూ, ఆధునిక వచన కవిత్వాన్ని, సినిమా పాటలనూ ఉదహరిస్తూ అనర్గళంగా ప్రసంగించే వక్తృత్వ కళ ఆయన సొంతం. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం సభ్యుడిగా విధులు నిర్వహించిన సుబ్బారావును ఆవంత్స సోమసుందర్ పురస్కారం వంటివి ఎన్నో వరించాయి. సాహితీ సమాజానికి భౌతికంగా దూరమైనా ఆయన భావాలు, ప్రతిపాదనలు, విమర్శ ప్రస్థానం విస్మరించలేనివి. ❑ **(“ఈనాడు” దినపత్రికలో ప్రచురితం)**



ఆహ్వానం

చందు లిటరరీ ట్రస్ట్, విశాఖపట్టణం
జాతీయ వేదిక, తణుకు
సంయుక్త ఆధ్వర్యంలో

**సమకాలీన సాహిత్య సదస్సు**

తణుకు సురాజ్య భవన్ (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫీసు) లో
03.04.2022 ఆదివారం సాయంత్రం 4 గంటలకు

అధ్యక్షులు
**డివివియస్ వర్మ**
జాతీయ వేదిక అధ్యక్షులు

ప్రసంగాలు

**ఆచార్య చందు సుబ్బారావు**
ప్రముఖ సాహితీ విమర్శకులు
చందు లిటరరీ ట్రస్ట్ వ్యవస్థాపకులు, విశాఖపట్టణం
అంశం : ఆధునిక సాహిత్య విమర్శ

**యల్ ఆర్ స్వామి**
కేంద్ర సాహిత్య అకాడెమి అనువాద పురస్కార గ్రహీత, విశాఖపట్టణం
అంశం : తెలుగులో అనువాద సాహిత్యం

**కొప్పర్తి వెంకటరమణమూర్తి**
ప్రముఖ కవి, విమర్శకులు, తణుకు
అంశం : తెలుగులో అస్తిత్వవాద కవిత్వం

చందు సాహిత్య పురస్కారం 2022 ప్రదానం
గ్రహీత : కొప్పర్తి వెంకటరమణమూర్తి

అందరికీ ఆహ్వానం

**డా. బి. రమేశ్ చంద్రబాబు**
జాతీయ వేదిక, తణుకు.



## కవి కొప్పర్తికి సాహిత్య పురస్కారం

తణుకు: సాహిత్యానికి జీవితమే ప్రమాణం అనీ జీవితాన్ని మెరుగుపరచేందుకు సాహిత్యం, సాహిత్యాన్ని మెరుగుపరచేందుకు సాహిత్య విమర్శ తోడ్పడాలని ప్రముఖ సాహిత్య విమర్శకులు చందు సుబ్బారావు అన్నారు. విశాఖ పట్టణానికి చెందిన చందు లిటరరీ ట్రస్టు, తణుకు జాతీయ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సురాజ్యభవన్‌లో నిర్వహించిన సమకాలీన సాహిత్య సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ వర్తమాన సాహిత్యం, వర్తమాన సమాజాన్ని, సంఘర్షణలను వాస్తవిక దృక్పథంతో చిత్రీకరించి కొత్త ఆలోచనలు కలిగించాలని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం అభివృద్ధికి తోడ్పతున్న తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తికి చందు సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు ఆచార్య చందు సుబ్బారావు చేతుల మీదుగా పురస్కారం, రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత ఎల్ఆర్ స్వామి, డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కవి కొప్పర్తికి పురస్కారం అందజేస్తున్న సంస్థ వ్యవస్థాపకులు



## విమర్శ సాహిత్యాన్ని ఉన్నతీకరించాలి: చందు సుబ్బారావు

విశాలాంధ్ర-తణుకు: సాహిత్యానికి జీవితమే ప్రమాణమనీ జీవితాన్ని మెరుగుపరిచేందుకు సాహిత్యం, సాహిత్యాన్ని మెరుగుపరిచేందుకు సాహిత్య విమర్శ తోడ్పడాలనీ ప్రముఖ సాహిత్య విమర్శకులు చందు సుబ్బారావు అన్నారు. చందు లిటరరీ ట్రస్ట్, విశాఖపట్నం, జాతీయవేదిక, తణుకుల సంయుక్త అధ్వర్యంలో ఆదివారం తణుకులో జరిగిన 'సమకాలీన సాహిత్య సదస్సు'లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని 'ఆధునిక సాహిత్య విమర్శ' అనే అంశంపై ప్రసంగించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డీవీవీఎస్‌వర్మ వర్తమాన సాహిత్యం వర్తమాన సమాజాన్ని, సంఘర్షణల్ని వాస్తవిక దృక్పథంతో చిత్రించి కొత్త ఆలోచనలు కలిగించాలన్నారు. అనువాద సాహిత్యం గురించి ప్రసంగించిన కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత ఎల్ ఆర్ స్వామి రెండు భాషలు తెలిసినంత మాత్రాన అనువాదం సాధ్యం కాదనీ అందుకు రెండు సంస్కృతులు తెలిసి ఉండాలని అనువాదకులు సాంస్కృతిక రాయబారులన్నారు. తెలుగులో అస్తిత్వవాద కవిత్వం గురించి మాట్లాడిన కొప్పర్తి వెంకట రమణమూర్తి వామ పక్ష భావజాలం సాంస్కృతిక వివక్షను విస్మరించడంలోనుంచి అస్తిత్వవాదం పుట్టిన వైనాన్ని చెబుతూ ఇటీవల వెలుగులోకి వస్తున్న మార్క్స్ రాతప్రతుల్లో అముద్రిత రచనల్లో అది విస్మరణకు గురికాలేదని రుజువవుతున్న సందర్భాన్ని వివరించారు.



కొప్పర్తి వెంకటరమణమూర్తికి సాహితీ పురస్కారం అందిస్తున్న దృశ్యం

## సాహిత్యానికి జీవితమే ప్రమాణం

తణుకు, ఏప్రిల్ 4: సాహిత్యానికి జీవితమే ప్రమాణమని, జీవితాన్ని మెరుగుపరిచేందుకు సాహిత్యం, సాహిత్యాన్ని మెరుగుపరిచేందుకు విమర్శ తోడ్పడాలని ప్రముఖ సాహితీ విమర్శకుడు చందు సుబ్బారావు అన్నారు. చందు లిటరరీ ట్రస్ట్, విశాఖపట్నం జాతీయ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తణుకులో సోమవారం జరిగిన సమకాలీన సాహిత్య సదస్సులో ఆయన 'ఆధునిక సాహిత్య విమర్శ' అంశంపై మాట్లాడారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డీవీవీఎస్.వర్మ మాట్లాడుతూ వర్తమాన సాహిత్యం వర్తమాన సమాజాన్ని, సంఘర్షణల్ని వాస్తవ దృక్పథంతో చిత్రించి కొత్త ఆలోచనలు కలిగించాలన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అనువాద పురస్కార గ్రహీత ఎల్ఆర్ స్వామి మాట్లాడుతూ రెండు భాషలు తెలిసినంత మాత్రాన అనువాదం సాధ్యం కాదన్నారు. అనువాదకులు సాంస్కృతిక రాయబారులు అన్నారు. తెలుగులో అస్తిత్వవాద కవిత్వం గురించి మాట్లాడిన కొప్పర్తి వెంకటరమణమూర్తి వామపక్ష భావజాలం సాంస్కృతిక వివక్షను విస్మరించడం నుంచి అస్తిత్వవాదం పుట్టిన వైనాన్ని చెప్పారు. ఇటీవల వెలుగులోకి వస్తు...

## తణుకులో చందు సుబ్బారావు..




# బడా కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ఉచితాలను రద్దు చేయాలి



ప్రొ ॥ జ్యోతిరాణి

ఉచితాల రూపం తీసుకొని ప్రచారమవుతున్న సామాజిక సంక్షేమ పథకాలు అనవసరమైనవని, ప్రజలు సోమరులు అవుతున్నారని, వాటివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టమన్న వాదనలతో విమర్శించటం గత దశాబ్ది నుంచి తీవ్రమైంది. గత పదేళ్లుగా పెట్టుబడిదారీ విధానానికి నాజూకు రూపమిచ్చి బలంగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాలతో ఈ విమర్శ ముడిపడి వున్నది. 2022 జులైలో ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్ ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ ప్రధాన మంత్రి మోడీ తాను ఉచితాల సంస్కృతికి వ్యతిరేకమని, అవి దేశానికి ప్రమాదకర మని ప్రకటించారు. దానితో ఉచితాల మీద విమర్శ మరింత బలపడింది. 2022లో వున్న కేంద్ర ప్రాయోజిత పథకాల సంఖ్య 65. కేవలం రెండేళ్లలో, 2024 నాటికి మోడీ ప్రభుత్వ కాలం లోనే ఈ పథకాలు 75కు పెరిగాయి. అసలు ఈ పథకాలలో 26కు పైగా మోడీ ప్రభుత్వమే ప్రారంభించింది. ఇంకా 740 కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు నామ మాత్రంగానైనా కొనసాగుతూనే వున్నది. ప్రధాన మంత్రి ప్రకటనకు, ఆచరణకు మధ్య తీవ్రమైన వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తూ వున్నది. ఎందుకంటే ఈ రెండు సంవత్సరా లలో నయా ఉదార వాద విధాన దోపిడీ వ్యవస్థ బలపడుతున్న క్రమంలో మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం అదనంగా తీవ్రమైంది. ఇందువల్ల పీడనకు గురవుతున్న అసంఖ్యాక ప్రజా నీకం సంఘటితమవుతారని, అది ఉద్యమాలకు దారి తీస్తుందన్న ఎరుక ఏ పాలక వర్గానికైనా తప్పకుండా వుంటుంది. ప్రజల దుర్భర జీవితాలను ఎంతో కొంత బాగు చేస్తామన్న భ్రమను కల్పించే క్రమంలో భాగంగా నే సామాజిక సంక్షేమ పథకాలు/ ఉచితాల ప్రకటనలు వుంటాయి. ఉచితాల సంస్కృతికి తాము వ్యతిరేకమని ప్రధానమంత్రి మోడీ ప్రకటించిన తర్వాతే పాలక పార్టీకి చెందిన లాయర్ అశ్వినీ ఉపాధ్యాయ, ఉచితాలు రాజ్యాంగ విరుద్ధమని, స్వచ్ఛమైన ఎన్నికలకు అవరోధమని, అందువల్ల ఉచితాలను రద్దు చేయా లంటూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ డి.వై.చంద్ర చూడ్, జస్టిస్ జె.బి.పార్ధీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో ఏర్పడిన బెంచ్ ఈ విధంగా దాఖలైన పిల్స్ అన్నింటిని సుప్రీంకోర్టు పరిశీలిస్తుందని 2024 సెప్టెంబర్ 18న తెలిపారు. మన దేశ ఉన్నత న్యాయస్థానం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నది.




**ప్రచురణ : రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) - వెల : రూ.60**
**ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి - కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 2**

ప్రకటిస్తున్న ఉచితాల కోసం నిధులను ఏ విధంగా సమీకరిస్తారో రాజకీయ పార్టీలు చెప్పాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సమస్యలను, ప్రధా నంగా నాన్ మెరిట్ వస్తువులను ఉచితాలుగా ఇవ్వటం కారణమవుతు న్నదని మన రిజర్వుబ్యాంకు చెబుతు న్నది. నిజానికి, న్యాయమైన, నిష్పక్ష పాతమైన ఎన్నికలు జరుగుతున్నా యా ? మద్యం, డబ్బులు ఏరులై పారుతుందన్న వాస్తవం అందరికీ తెలిసిందే. ప్రపంచంలో మనవి అతి ఖరీదైన ఎన్నికలు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అంచనాల ప్రకారం 2019 జాతీయ ఎన్నికలలో 73,278 కోట్ల రూ.లు ఖర్చయింది. 2024 ఎన్నికలలో ఈ వ్యయం లక్ష కోట్ల రూపాయలకు పెరిగింది. ఈ క్రమంలో బయటపడిన ఎలక్టో రల్ బాండ్స్ స్కాం గురించి మొత్తం ప్రపంచానికి తెలుసు. ఎన్ని కల సమయంలో ఓటర్లను ఆకర్షించడానికి సంక్షేమ పథకాల ప్రకటనలు, అమలును వ్యతిరేకించే ప్రస్తుత పాలక పార్టీ 2024 ఎన్నికలకు ముందు ఏం చేసింది ? ఉదాహరణకు, వంట చేసుకోవటానికి సాంప్రదాయక ఇంధనాలన్నీ అంతరించాయి. వంట గ్యాస్ సిలిండర్ తప్పనిసరైంది. అయినప్పటికీ వంట

గ్యాస్ సిలిండర్ ధరను 2020 నుంచి ఏడుసార్లు ప్రభుత్వం పెంచింది. పైగా దారిద్ర్యరేఖకు దిగువన (BPL) వుండే కుటుంబాలకు ఉజ్వల పథకం ద్వారా ఇచ్చే గ్యాస్ సిలిండర్ల మీద సబ్సిడీని 2021లో రద్దు చేసింది. 2024లో రానున్న జాతీయ ఎన్నికలు, 5 రాష్ట్రాలలో ఎన్నికల దృష్ట్యా ఆగస్టు 2023లో వంట గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వం 200 రూ.లు తగ్గించింది. ఉజ్వల గ్యాస్ సిలిండర్లకు 200 రూ.ల సబ్సిడీని 2022లో తిరిగి ప్రారంభించారు. 2023 లో ఈ సబ్సిడీని 200 రూ.ల నుంచి 300 రూ.లకు పెంచారు. సబ్సిడీని మరొక సంవత్సరంపాటు పొడిగించారు.

ముడిచమురు ధరలు పెరుగుతున్నప్పటికీ 2024లో ఆనాడు రానున్న ఎన్నికల దృష్ట్యా పెట్రోల్, డీజిల్ ధరలను ఏప్రిల్, 2022 నుంచి పెంచలేదు. ఇవి ప్రజలను భ్రమలలో ముంచే, ఆకర్షించే తాత్కాలిక ఉపశమన జిమ్మిక్కులే. మిక్సర్ గ్రైండర్, లాప్టాప్, బంగారం, టీ.వీలు మొదలైన నాన్ మెరిట్ వస్తువుల ను ఉచితాలుగా ఇవ్వటాన్ని రిజర్వ్ బ్యాంకుతోపాటు చాలా మంది విమర్శిస్తున్నారు. నిజానికి ఈ వస్తువులు రాజకీయ నాయకుల సన్నిహితులకు, కార్యకర్తలకు, అందుతాయి. కార్యకర్తల కేడర్‌ను పెంచుకోవడానికి, కాంట్రాక్టర్లను గుప్పిట్లో పెట్టుకోవటానికి ఉపయోగపడతాయి. తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల, జాతుల కుటుంబాలలో ఆడపిల్ల పెళ్లి సమయంలో ఒక లక్ష రూపాయలు ఇచ్చే కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ పథకాలు వున్నాయన్న విషయమే చాలామంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తెలియదన్న నిజాన్ని TISS అధ్యయనం బయటపెట్టింది.

**ప్రోత్సాహకాల పేరుతో లక్షల కోట్ల రూపాయల ఉచితాలు – కార్పొరేట్ శక్తులు :** ప్రపంచీకరణ ప్రవేశించిన 1990-91 నుంచి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి అనేక పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు, ఎంతో విలువైన భూములను అతిచౌకగా ఇవ్వటం, కేటాయించడం, ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ఎంతో చౌకగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించటం మొద లైంది. 2000 దశాబ్ద ప్రారంభం నుండే ప్రైవేటు/ కార్పొరేట్ శక్తుల మొండి బకాయిలను ప్రభుత్వ రంగ బ్యాంకులు రైట్ ఆఫ్ చేయటం మొదలైంది. ఇది నిజానికి రుణమాఫీనే. రైట్ ఆఫ్ చేసిన మొండి బకాయిలను రికవరీ చేసిన దాఖలాలు లేవు. 2004-19 మధ్యకాలంలో 8.4 లక్షల కోట్ల రూ.ల మేరకు బడా కార్పొరేట్ శక్తుల బాకీలను బ్యాంకులు మాఫీ చేశాయి. ఇందులో 2014-19 మధ్య మాఫీ చేసిన మొత్తం 75 శాతం అంటే 5 లక్షల కోట్ల రూ.లు. కేవలం కోవిడ్ విపత్తు సమయం లో కార్పొరేట్ దిగ్గజాల రుణమాఫీ 68,000 కోట్ల రూ.లు. 2014 నుంచి సమర్థవంతమైనవని చెబుతున్న కార్పొరేట్ శక్తుల మొండి బాకీలు వేగంగా పెరుగుతున్నాయి. అసలు బడా కార్పొరే ట్ల రుణాల మాఫీ దానంతటదే పెద్ద స్కాం. రిజర్వు బ్యాంకు సమాచారం ప్రకారం, 2017-2022 మధ్య కాలంలో బడా కార్పొరేట్ల రుణమాఫీ 10 లక్షల కోట్ల రూ.లు. ఇందులో 7.34 లక్షల కోట్ల రూ.లు ప్రభుత్వ రంగ బ్యాంకులు చేసిన రుణ మాఫీలే. ఇవన్నీ బడా కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ఉచితాలే. 10 సం.ల మోడీ పాలనలో 16 లక్షల కోట్ల రూపాయల మేరకు బడా కార్పొరేట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేశారు. దీనికితోడు, ఈ సంస్థలకు భారీ స్థాయిలో పన్ను రాయితీలు ఇస్తున్నారు. వీటి వల్ల 2017-18లో 93,642 కోట్ల రూ.ల పన్ను రాబడిని ప్రభు త్వం కోల్పోయింది. 2018-19లో 1,08,785 కోట్ల రూ.ల పన్ను రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. 2018-19లోనే సెజ్‌లలో వున్న సంస్థలకు లాభం పన్నును మినహాయించడం వల్ల 24,300 కోట్ల రూ.ల రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. 2014-19 మధ్యకాలంలో కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన పన్ను రాయితీల వల్ల 5.76 లక్షల కోట్ల రూ.లను ప్రభుత్వం కోల్పోయింది. 2019లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి, కొత్త సంస్థలకు 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించారు. ఇది ప్రపంచంలోనే కనిష్ట కార్పొరేట్ పన్ను. దీనివల్ల సంవత్సరానికి 1.45 లక్షల కోట్ల రూ.ల రాబడిని ప్రభుత్వం కోల్పోతుంది. కానీ, ప్రభుత్వ బడ్జెట్‌లో కోట్ల లోటు తగ్గుతూ వున్నది. అంటే కోల్పోయిన పన్ను రాబడిని సామాన్య జనం వినియోగించే వస్తువుల మీద ఎక్కువ జీఎస్టీ వేస్తూ వసూలు చేసుకుంటున్నారు. దీంతో, సంపన్నులకు ఉచితాలు, సామాన్య ప్రజలకు, మధ్యతరగతి వర్గాలకు అధిక పన్నులు. రాయితీలు, రుణమాఫీలకు అదనంగా, ఏ ఇబ్బంది రుణాలను ఎగ్గొట్టడానికి వీలైన దివాళాను సులభం చేశారు. ఉద్యోగ కల్పన పేరిట 10 వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలను పొందుతున్న ఆదానీ కంపెనీలలో కేవలం 8 వేల మంది పనిచేస్తున్నారు. అంటే, ఒక ఉద్యోగానికి, సంవత్సరానికి 1.25 కోట్ల రూ.ల పన్ను రాయితీ, ఎంతో విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి ఆస్తులను అతి చౌకగా ప్రైవేటు కార్పొరేట్లకు అప్పజెప్పటం, దేశ సంపదను ఉచితంగా గుత్త పెట్టుబడులకు అప్పజెప్పటమే.

ఉదాహరణకు, జనవరి, 2022లో కేవలం 18 వేల కోట్ల రూ.లకు ఎయిర్ ఇండియా సంస్థను టాటా గ్రూపుకు అప్పగిం చారు. ఎయిర్ ఇండియాతోపాటు చౌక ధరలతో విమానాలను నడిపి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, AISATS లో వున్న 50 శాతం ప్రభుత్వ వాటా ఇక టాటా గ్రూపు స్వంతమే. ఎక్కడా ఆగకుండా యూరప్, అమెరికాకు ప్రయాణించగల ఎయిర్ ఇండియా సామర్థ్యం టాటా గ్రూపుకే. 100 దేశీయ గమ్యాలకు ప్రయాణించే 94 ఎయిర్ క్రాఫ్టులు, విదేశీ గమ్యాలకు ప్రయా ణించే 60 ఎయిర్ క్రాఫ్టులు, 4,400 దేశీయ – ల్యాండింగ్ పార్కింగ్ ప్లాట్లు, విదేశాల్లోని ఎయిర్ పోర్టులలో 900 ప్లాట్లు, సమర్థవంతమైన శిక్షణతో లైసెన్సులు వున్న 200 మంది

పైలట్లు, ఇక టాటా గ్రూపు ఆస్తి అవుతుంది. ఇట్లా సమస్త దేశ సంపదను ప్రైవేటు గుత్త పెట్టబడులకు ఉచితంగా అప్పగించడాన్ని ఉన్నత న్యాయస్థానం, రిజర్వు బ్యాంకు మొదలైన సంస్థలు ఏవీ ప్రశ్నించవు. రద్దు చేయాలని చెప్పవు. కానీ వక్రీకరించిన ఆర్థిక నిర్మాణాల పునాదుల వల్ల బతుకు తెరువు దొరకక అనియత రంగంలో, గిగ్ వ్యవస్థలో అత్యధిక శ్రమదోపిడీకి గురవుతూ, దుర్భరమైన పేదరికంతో, ఆకలి సమస్యతో, తాగటానికి మంచినీళ్లు కూడా దొరకని స్థితిలో బతుకుతున్న మెజారిటీ ప్రజల పేరిట ప్రకటిస్తున్న ఉచితాలను మాత్రం రద్దు చేయాలి, రాజ్యాంగ విరుద్ధం అంటారు. లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను, దేశ సంపదను ఉచితంగా బడా కార్పొరేట్ శక్తులకు ఇవ్వటం మాత్రం రాజ్యాంగబద్ధం అవుతుందా? చాలా సందర్భాలలో సంక్షేమ పథకాలు, ప్రకటనలకే పరిమితమవుతాయి. మెజారిటీ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందవు. కాగ్ నివేదికలు ఈ అంశాన్ని వెల్లడి చేశాయి. మన దేశంలో ఒక పథకాన్ని కేస్ స్టడీగా తీసుకొని అసలు అర్హులైన వారెందరు? ఎంతమందికి ఈ పథకం అందింది? అనే అంశాన్ని సీరియస్‌గా అధ్యయనం చేసి, అత్యధికంగా 73 శాతం మంది బహిష్కృతం అయినారని తేల్చారు. పాలక పార్టీ నాయకుల సన్నిహితులు, కార్యకర్తలు, ప్రధానంగా లబ్దిదారులుగా వుంటారని ఎన్నోసార్లు రుజువైంది. అయినప్పటికీ బడా నాయకుల మీటింగులకు భారీ ఎత్తున తరలించిన జనంతో, తమను విమర్శిస్తే, ప్రశ్నిస్తే సంక్షేమ పథకాలు ఇవ్వం అని బెదిరించడం మనం వార్తా పత్రికలలో చూస్తూనే వుంటాం. ఇందుకు విరుద్ధంగా బడా కార్పొరేట్లకు ప్రోత్సాహకాలంటూ లక్షల కోట్ల రూపాయలను ఉచితంగా మాఫీ చేస్తారు. ప్రైవేటు రంగమే సమర్థవంతమైందని బలంగా చెబుతున్న ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల ఉచితాలను ఇవ్వాల్సిన స్థితి, వాటి అసమర్థతను సూచిస్తాయి.

**సంక్షేమ పథకాలు :**

1947 తర్వాత భారతదేశంలో సోషలిస్టు తరహా సమాజ స్థాపన లక్ష్య ప్రకటనతో 1951లోనే పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనాయి. స్థూల జాతీయోత్పత్తి పెరిగితే దానంతటదే పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన జరుగుతుందని, ప్రజలందరి జీవన ప్రమాణాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయని ట్రికిల్ డౌన్ సిద్ధాంతం మీద నమ్మకం ఉండడం వల్ల ఆశించారు అనుకుందాం. కానీ నాలుగవ పంచవర్ష ప్రణాళిక పూర్తికాకముందే 1970ల నాటికే నిరుద్యోగం, పేదరికం పెరుగుతున్నాయని, వ్యవసాయ రంగం మీద ఆధారపడి బ్రతికే వారి సంఖ్య పెరుగుతున్నదని, గ్రామీణ పేదరికం ఇంకా తీవ్రమవుతున్నదని, అసమానతలు, గుత్తాధిపత్యం, ఆర్థిక శక్తి కేంద్రీకరణ, విదేశీ మారక చెల్లింపుల శేషంలో లోటు పెరుగుతున్నాయని ఆనాటి ఆర్బిఐ బులెటిన్ సమాచారం. రీసెర్చ్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ టైమ్స్ సమాచారం, రంజిత్‌దాస్ గుప్తా, తరిమెల నాగిరెడ్డి, దండేకర్ రాత్ అధ్యయనాలు స్పష్టంగా చెప్పాయి. సమ్మిళిత వృద్ధికి వ్యతిరేకంగా ఆర్థిక నిర్మాణాల పునాదులు బలపడ్డాయి. అందువల్లనే ఈ సంక్షోభ సర్వ శిక్షా అభియాన్' పథకం 2018లో సమగ్ర శిక్ష పథకమయింది. ప్రపంచీకరణకు పూర్వం ఆకలి సమస్యకు పరిష్కారంగా మొదలైన ప్రజా పంపిణీ వ్యవస్థ క్రమంగా నగదు బదిలీ కార్యక్రమం అయింది. ప్రస్తుతం ఈ పథకం పేరు PM- POSHAN. 1970లలోనే ఉపాధి కల్పన కోసం మొదలైన పనికి ఆహార పథకం 2006లో ఉపాధి కల్పన (MGNREGA)గా మారింది. ప్రజారోగ్య వ్యవస్థ క్రమంగా అంతరిస్తున్నది. కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యానికి బీమా పథకాలు వచ్చాయి. ఆకలి, పౌష్టికాహార లోపం సమస్యలకు మార్చి 2020లో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం వచ్చింది. వలస కార్మికుల కోసం "వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు" అన్నారు. రైతుల సంక్షేమం కోసం బీమా పథకాలు, నగదు బదిలీ పథకం వచ్చాయి. సంప్రదాయక వంట ఇంధనాలు అంతరించాయి. వంట కోసం ఎల్పిజీ గ్యాస్ తప్పనిసరి. వాటికి సబ్సిడీలు వచ్చాయి. ప్రజా రవాణా వ్యవస్థ అంతరించడంతో ప్రైవేటు వాహనాలు తప్పనిసరైనాయి. పెట్రోల్, డీజిల్ సబ్సిడీలు వచ్చాయి. ఈ పథకాలన్నీ క్రమంగా దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకే పరిమితమైనాయి. నగదు బదిలీ అన్నారు. అది కూడా అందదు. పథకాల వల్ల లబ్ధి పొందవలసిన వాళ్లలో 70 శాతం మినహాయించ బడుతున్నారు. ఈ పథకాల అమలు ప్రారంభం నుంచి వైఫల్యమే. ఈ పథకాలతో సమ్మిళిత వృద్ధి రాదు. అభివృద్ధి క్రమం వెలుపల మెజారిటీ ప్రజలు దుర్భరంగా బతుకుతున్నారు. మల్టీ డైమెన్షనల్ పావర్టీని అంచనా వేసిన నీతి ఆయోగ్, దారిద్ర్య రేఖకు దిగువన 20 శాతం కుటుంబాలున్నాయని అంటుంది. 2013 లో రూపొందిన ఆహార భద్రత చట్టం పరిధిలోకి 67 శాతం ప్రజలు వస్తారని ప్రభుత్వమే చెబుతుంది.

కోవిడ్ విపత్తు తర్వాత 81 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామని ప్రభుత్వమే చెబుతున్నది. అంటే దాదాపు 60 శాతం పేద ప్రజలు వున్నారు. ఉపాధి హామీ పథకానికి 2017 నుంచి కేటాయింపులు తగ్గుతున్నాయి. సంవత్సరానికి 100 రోజులకు బదులుగా 40-50 రోజుల పనిని ఇస్తున్నారు. చెల్లింపులలో జాప్యం వుంటుంది. గ్రామాల్లో బతకలేక పట్టణాలకు వచ్చి గిగ్ వ్యవస్థలో యువత పనిచేస్తున్నది. ఏప్రిల్ 2008 నుంచి బీపీఎల్ కుటుంబాలకు బీమా ద్వారా కార్పొరేట్ వైద్యం కోసం, రాష్ట్రీయ స్వాస్థ్య యోజన' మొదలైంది. వీటిలో 31 శాతం హాస్పిటల్ బిల్లులే సెటిల్ అవుతున్నాయి. చాలా ఆసుపత్రులు ప్రభుత్వ ఆరోగ్య బీమాను ఆమోదించమని ఖరాఖండిగా


**(మిగతా 40వ పేజీలో)**

# మననం చేసుకోవలసిన మహానుభావుడు



- మండలపర్తి కిషోర్

మార్పు దానంతట అది రాదు–ఎవరైనా నడుంకట్టి, తీసుకు వస్తే కానీ అది రాదు ! తెలుగునాట, పందొమ్మిదో శతాబ్దిలో కొందరు వైతాళికులు పూనికతో చేసిన ప్రయత్నం ఫలితంగానే, మనం – ఈ మేరకైనా – ఆధునికులుగా మనగలుగుతున్నాం. ఇరవయ్యో శతాబ్దిలో మరికొందరు దీపధారులు, వారి వారసత్వం చేపట్టి, తెలుగు జాతిని చెయ్యి పట్టుకుని అభ్యుదయ మార్గంలో నడిపించారు. అలాంటి వాళ్ళ జాబితా ఏదైనా తయారుచేస్తే, దానిలో స్వామి నీన ముద్దునరసింహం, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి మొదలుకొని కుసుమ ధర్మన్న, త్రిపురనేని రామస్వామి, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, మద్దుకూరి చంద్రం తదితరులు ఎందరో మహానుభావుల పేర్లు ఉండి తీరుతాయి. వీళ్లందరూ, తమ తమ రంగాల్లో ఆధునికత మీదుగా సమాజ అభ్యున్నతిని ఆవిష్కరించేందుకు జీవితాలను ధారపోసిన వారే!




ఆధునికంగా జీవించడానికి ఏం చెయ్యాలనే ఆలోచనకు అంకురార్పణ చేసిన ఆది సంస్కర్త ముద్దు నరసింహమైతే, దానికి ఆచరణ రూపమిచ్చేందుకు అహరహం కృషి చేసిన సంస్కరణ సేనాని వీరేశలింగం. అప్పటికి మూడు వందల సంవత్సరాలుగా పెళ్లినడక నడుస్తున్న ప్రాబంధిక ధోరణి అనే ఒంటెద్దు బండిలోంచి తెలుగు సాహితిని ఉద్ధరించి, ఆధినికత రైలు బండి ఎక్కించిన వాడు గురజాడ. పదో శతాబ్దంలో మేకు బందీ చేసిన గ్రాంథిక భాష అనే ఉక్కు చట్రం నుంచి తెలుగును తప్పించి, జీవద్భాషకు గౌరవప్రాచుర్యాలు కలిగించిన వాడు గిడుగు. ఇరవయ్యోశతాబ్దిలో, జాతీయోద్యమం మొగ్గ తొడుగుతున్న దశలోనే, తెల్ల దొరతనం స్థానంలో నల్ల దొరతొనం వచ్చే పక్షంలో అది తమకు అక్కర్లేదని దళిత చైతన్య స్వరం పలికినవాడు కుసుమ ధర్మన్న. పుట్టుక ప్రాతిపదికగా హెచ్చు తగ్గులెన్నే దురాచారాన్ని నిలదీసినవాడు త్రిపురనేని. శ్రమ దోపిడితో సహా అన్నిరకాల దోపిడులనూ, అణచివేతలనూ తిరస్కరించే విప్లవ చైతన్యాన్ని రగుల్కొల్పినవాడు చంద్రం.

వాళ్లందరూ ఆనాడు అలా చెయ్యగలిగినందు వల్లనే, మనం సంపద పునః పంపిణీ ద్వారా రాజ్యాంగం వాగ్దానం చేసిన సామాజిక–ఆర్థిక న్యాయం కూడా సమకూర్చే "ప్రజా రిపబ్లిక్" సాధించేందుకు ఈనాడు ఉద్యమించగలుగుతున్నాం. అలాంటి వారికి మనం నిత్యనీరాజనాలు సమర్పించుకోవలసిన అవసరం లేదేమో కానీ, తరచు వారి స్ఫూర్తితో మన హృదయ సీమలను సుసంపన్నం చేసుకుంటూ ఉండవలసిందే.

ఆరేడు నెలల కిందట డాక్టర్ చెలికాని రామారావు స్మారక సమితి వెలువరించిన "కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర" పునః ప్రచురణ అటువంటి ప్రయత్నమే! ఇది, గతంలో వెలువడిన వీరేశలింగం స్వీయచరిత్ర ప్రచురణల్లో దేనికీ పునర్ముద్రణ కాదు – ఈ తరం సామాన్యపాఠకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన స్వతంత్ర–పునఃప్రచురణ! 1910–'15 సంవత్సరాల్లో, రెండు భాగాలుగా, వీరేశలింగం వెలువరించిన "స్వీయచరిత్ర" గురించి మనకందరికీ తెలుసు. నూటపదేళ్ళ తర్వాత ఈ తరం పాఠకుల అభిరుచులకూ అవసరాలకూ తగినట్లు "స్వీయచరిత్ర"ను సరళీకరించిన సంక్షిప్త రూపమిది. దీన్ని ఇలా రూపొందించిన వారు డాక్టర్ పి.ఎస్.ప్రకాశరావు. వీరేశలింగం ప్రయోగించిన భాషనూ, ముఖ్యంగా పరిభాషనూ, అయిదారు పేజీల్లో అనుబంధంగా ఇచ్చి, కాలానికి మాటల వంతెన కట్టేందుకు ప్రకాశరావు చేసిన ప్రయత్నం అభినందనీయం. అలా చెయ్యడంతో, ఈ విలువైన చారిత్రక గ్రంథానికి అకడమిక్ పోహళింపు కూడా జతపడింది.

వాస్తవానికి, ఇటువంటి కూర్పు అవసరాన్ని ఇంతకుముందు పెద్దలు గుర్తించకపోలేదు! దాదాపు అయిదున్నర దశాబ్దాల కింద –1972లో– నేషనల్ బుక్ ట్రస్ట్ వారు అటువంటి ప్రయత్నం చెయ్యకపోలేదు. "భావ విప్లవకారుడు" అనిపించుకున్న కొడవటి గంటి కుటుంబరావు, ఆరు వందల పేజీలకు విస్తరించిన "స్వీయ చరిత్ర"ను మూడో వంతుకు సంగ్రహపరిచి ఎన్.బి.టి. వారి ప్రయత్నాన్ని అర్థవంతం చేశారు. మరో అయిదున్నర దశాబ్దాల తర్వాత డాక్టర్ ప్రకాశరావు ఈ కృషిని

దాన్ని "సహజ పర్యవసానం" వైపు నడిపించారు. సముచితమైన ఆలోచన సమర్థమైన ఆచరణగా మారడానికి కొంత టైం పట్టడం సహజం కదా! "గద్యతిక్కన" బిరుదాంకితులయినప్పటికీ వీరేశ లింగానికి, కొక్కొండ వేంకటరత్న"శర్మ"లాంటి పండిత మత్తే భాలతో తలపడక తప్పలేదు. అయినప్పటికీ, "ఆంధ్ర కవులు" లాంటి సాహిత్య చరిత్ర గ్రంథాలూ, కాళిదాసు రాసిన "అభిజ్ఞాన శాకుంతల నాటకం"లాంటివాటి అనువాదాలూ, "రాజశేఖర చరిత్ర" లాంటి నవలలూ రచిస్తూనే వున్నారు. వాటికితోడుగా "వివేకవర్ధని", "హాస్య సంజీవని" లాంటి పత్రికల నిర్వహణ భారం ఒకటి! ఎన్ని వత్తిడులు వచ్చిపడినప్పటికీ, వీరేశలింగం సత్యశోధక పాత్రను పోషించడంలో ఒక్కడుగు కూడా వెనకె య్యక పోవడం విశేషం. చిత్రపు కామరాజు ఉదంతమే దానికి నిదర్శనం. (వివరాలపై ఆసక్తి వున్న పాఠకులు ఈ పుస్తకంలోని 57వ పేజీకి ముందూవెనకా వున్న కథనం చూడండి!) ఇలాంటి వ్యక్తి తన స్వీయచరిత్రను ఏ భాషలో రాసినా, ఎలా రాసినా దాన్ని సామాన్య పాఠకులకు చేరువ చెయ్యడం మనకర్తవ్యం! నమ్మినదాన్ని, చెప్పినదాన్ని తూ.చా.తప్పకుండా ఆచరించి చూపించిన ఆదర్శవాది డాక్టర్ చెలికాని రామారావు స్మారక సమితి ద్వారా ఇలాంటి కర్తవ్యం నెరవేరడం అన్నివిధాలా యుక్తంగా వుంది. ❑

## బడా కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ఉచితాలను రద్దు చేయాలి

**(38వ పేజీ తరువాయి)** చెబుతున్నాయి. 'భేటీ బచావో - బేటీ పడావో" పథకం అంటారు. ప్రభుత్వ బడులను మూసేస్తున్నారు. తల్లీ పిల్లల పౌష్టికాహారం కోసం పనిచేసే అంగన్వాడీ టీచర్లు తాత్కా లిక ఉద్యోగులే. కనీస వేతనం ఉండదు. చెల్లింపులలో జాప్యం. ఈ పథకాల వల్ల ఆశించిన కొద్దిపాటి మేలు కూడా అసాధ్యమే. వంట గ్యాస్ సిలిండర్ సబ్సిడీని కేవలం బిపిఎల్ కుటుంబాలకే అందించాలని ఉజ్వల పథకాన్ని 2016 లో మొదలు పెట్టారు. పేద కుటుంబాలు మొదట పూర్తి డబ్బు చెల్లించి, వంట గ్యాస్ సిలిండరును కొనుక్కోవాలి. దాదాపు 1000 రూ.లు. వంట చేయటానికి ఖర్చు పెట్టే స్థోమత పేద కుటుంబాలకు ఉంటుందా? నెమ్మదిగా సబ్సిడీ డబ్బులు అకౌంట్ల కు బదిలీ వేస్తామంటారు. చాలామందికి సబ్సిడీ రాలేదు. పూర్తిగా రాదు. అసలే రాదు. మరొకవైపు రోజురోజుకూ వంట గ్యాస్ సిలిండర్ ధర పెరుగుతూనే వున్నది. ఉజ్వల పథకం లబ్ధిదారులు 2023లో 96 మిలియన్లు ఉండగా, 2024లో 102 మిలియన్ల కు పెరిగారని ప్రభుత్వం చెబుతున్నది. వంటగ్యాస్ సిలిండర్ ధర పెరిగి, లబ్ధిదారుల సంఖ్య పెరిగినప్పుడు, ఉజ్వల పథకం సబ్సిడీ కేటాయింపులో భారీ తగ్గుదల వైరుధ్యమే. 2018-19లో 37,209 కోట్ల రూపాయలు ఉండగా, 2021-22 లో కేవలం 1,811కోట్ల రూపాయలు. ఇక 2022-23 లో 2,257 కోట్ల రూపాయలు. ప్రజా రవాణా వ్యవస్థ అంతరించే క్రమంలో ప్రైవేట్ వాహనాలు తప్పనిసరైనాయి. కూలి పనులు చేసుకునే వాళ్లకు, వీధుల్లో తిరిగి అమ్ముకునే వాళ్లకు వాహనాలు తప్పనిసరి. పెట్రోలు, డీజిల్ నిత్యావసర వస్తువులే. 2010లో పెట్రోల్ సబ్సిడీని, 2014లో డీజిల్ సబ్సిడీని తీసేసారు. రెండింటి ధరలను సరళీకరించారు. నవంబర్ 2014 నుంచి జనవరి 2016 మధ్య వీటి మీద ఎక్సైజ్ సుంకాన్ని 9 సార్లు పెంచారు. గ్లోబల్ ధరలు తగ్గినా వీటి ధరలను తగ్గించలేదు. అధిక పన్నులు వేశారు. 2014-15లో వీటి మీద పన్ను వసూళ్లు 99,184 కోట్ల రూపా యలు కాగా, 2016-17లో 2,42,691 కోట్ల రూపాయలు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు వేస్తాయి. పేద మధ్యతరగతి వర్గాల చేతుల్లోకి వ్యక్తిగత వాహనాలు వచ్చిన ఈ మూడు నాలుగు దశాబ్దాలలోనే పెట్రోలు డీజిల్‌పై సబ్సిడీలు తగ్గి పన్నులు పెరుగుతూ పోతున్నాయి. పెట్టుబడిదారీ దోపిడీ విధా నం ప్రజలను కేవలం వినియోగదారులుగా మాత్రమే చూస్తుంద నడానికి ఈ ఉదాహరణ చాలదా ? ఈ విధంగా కార్పొరేట్ సంస్థలకు ఉచితాలను ఇస్తారు. పేద, మధ్య తరగతి వర్గం మీద పన్నులు వేస్తారు. అమృత కాల్ మొత్తం ఈ వర్గం వాళ్లు "సబ్ కా ప్రయాస్"లో భాగం కావాల్సిందే. గుత్త పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి నయా ఉదారవాద విధానాల పేరుతో కార్పొరేట్ శక్తులకు అందిస్తున్న లక్షల కోట్ల ఉచితాలను రద్దు చేయాలి. ప్రజలందరినీ భాగం చేసుకోగల సమ్మిళిత వృద్ధి నిర్మాణాలను నిర్మించాలి. అభివృద్ధి క్రమం నుంచి బయటకు నెట్టివేయబడి అత్యధిక శ్రమ దోపిడీతో దుర్భరంగా బ్రతుకు తున్న అసంఖ్యాక ప్రజానీకం బలంగా, విప్లవ శక్తుల నాయక త్వంలో సంఘటితం కావాలి. దోపిడీ, పీడన, అసమానతలు, వివక్షలు లేని వ్యవస్థల కోసం పోరాడాలి. ❑

**(భూపరాయీకరణ పుస్తకం నుంచి)**


## మహాత్ముడివి మూడు బాధలు!


**(25వ పేజీ తరువాయి)** ఎవరూ మతం మారాల్సిన అవసరం లేదని చెప్పారు. గాంధీ లేకుండా స్వాతంత్ర్యోద్యమాన్ని, అంబే ద్కర్ లేకుండా భారత రాజ్యాంగాన్ని, నెహ్రూ లేకుండా ఆధునిక భారతాన్ని ఊహించలేం. వీరి ఆలోచనలు, ఆచరణ భారతీయ మూలాల నుంచి ఉద్భవించాయి. ఇటీవల మహాత్ముడిని తక్కువ చేస్తూ వస్తున్న పెడధోరణులు గాంధీ వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నాలు. పౌర సమాజం ఈ పోకడలను గుర్తించి, ప్రజలను వాస్తవికత వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది. ❑




‘మురికి’ మాట

అలా సెట్ చేశారన్న మాట!








పెద్దదైతే మోయలేం..!

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 4 - Issue No : 5 Online Edition February 2026







కొత్త పుస్తకాల స్వీకారం

